



# విశ్వంవాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY








SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 8 | సంచిక : 301 | అమలాపురం | ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ | శుక్రవారం 18 జూలై 2025 | పేజీలు : 12 | వెల : 2/-




## బలూచి లిబరేషన్ దాడులు

- వరుస ఘటనలతో పాక్ సైన్యం ఉక్కిరిబిక్కిరి
- రెండ్రోజుల్లో 27మంది సైనికుల హతం

**ఇస్లామాబాద్**

బలోచ్ లిబరేషన్ ఆర్మీ పాకిస్థాన్ సైన్యానికి ఊపిరి సలుపనివ్వడం లేదు. వరుస దాడులతో విరుచుకు పడుతున్నారు. గత రెండ్రోజుల్లో 27 మంది పాక్ సైనికులను మట్టుపెట్టినట్లు ఆ సంస్థ ప్రకటించింది. ఈ విషయాన్ని ఆ సంస్థ ఓ సోషల్ మీడియా పోస్టులో వెల్లడించింది. బీఎల్‌ఏకు చెందిన ఫతే స్క్వాడ్ కలాత్‌లోని నిమ్రాగ్ క్రాస్ వద్ద సైనికులను తరలిస్తున్న ఓ బస్సును లక్ష్యంగా చేసుకొని దాడి చేసింది. ఇందులో 27 మంది సైనికులు చనిపోగా..

-మిగతా 2 లో

## హంద్రీనీవా ప్రాజెక్టుతో రైతులకు మేలు

ఈ ప్రాజెక్టు ద్వారా 6 లక్షల ఎకరాలకు సాగునీరు


### రాయలసీమకు నీరివ్వడమే మా లక్ష్యం

- సీమ కరువు కాటకాలు తెలిసిన వ్యక్తిని
- ఎన్టీఆర్ ఆలోచనలో పుట్టిందే హంద్రీనీవా
- గత ఐదేళ్లు జగన్ ఏమీ చేయలేదని విమర్శలు
- మల్యాల పంపింగ్ స్టేషన్ నుంచి నీటి విడుదల చేసిన సిఎం చంద్రబాబు

**కర్నూలు,**

రాయలసీమకు నీరు ఇచ్చానన్న సంతృప్తి ఎప్పటికీ మర్చిపోలేనని సీఎం చంద్రబాబు అన్నారు. హంద్రీనీవా ప్రాజెక్టు నీటితో బాగుపడే రైతులందరికీ ఆయన శుభాకాంక్షలు తెలిపారు. నంద్యాల జిల్లా నందికొట్కూరు మండలం మల్యాలలో సీఎం పర్యటించారు. జలహారతి కార్యక్రమంలో భాగంగా మల్యాల పంపింగ్ స్టేషన్ నుంచి హంద్రీనీవాకు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా రైతులతో నిర్వహించిన సభలో సీఎం మాట్లాడారు. రాయలసీమ కరవు, కష్టాలు, ప్రజల బాధలు నాకు తెలుసు. నేను ఇక్కడే పుట్టాను. ఇక్కడే పెరిగాను. అనంతపురంలో కరవు వస్తే గడ్డి తెచ్చి పశువులను కాపాడిన పార్టీ మాది.

-మిగతా 2 లో





## కూటమి పై బురదజల్లడమే జగన్ పని

- గతంలో చేసిన అకృత్యాలను మరచి విమర్శలు
- జగన్ తీరుపై మండిపడ్డ హోంమంత్రి అనిత

**విజయవాడ,**

కూటమి ప్రభుత్వంపై బురద చల్లాలని జగన్ చూస్తున్నారు అని హోం మంత్రి వంగలపూడి ఆరోపించారు. గతంలో చేసిన అకృత్యాలను మరచి అదేపనిగా జగన్, ఆయన అనుయాయులు విమర్శలు చేస్తున్నారని అనిత మండిపడ్డారు. ఈ మేరకు కృష్ణా జిల్లాలో పర్యటించిన హోం మంత్రి వంగలపూడి అనిత కీలక వ్యాఖ్యలు చేసింది. టీడీపీ ప్రతిపక్షంలో ఉండగా చంద్రబాబు పర్యటనలను అడ్డుకున్నది మీరు కదా?.. నా మీద ఎస్సీ ఎస్టీ కేసు పెట్టారు.. అవినీతి, అరాచకానికి మీరు విత్తనం వేశారు..

-మిగతా 2 లో



## బీహార్‌లో నితీష్ ఉచిత వల

- 125 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఆఫర్

**పాట్నా**

బీహార్ అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడుతుండటం తో నితీష్ ప్రభుత్వం ఓటర్లపై ఉచితాల వలను ప్రయోగించింది. ప్రజలకు 125 యూనిట్ల వరకు విద్యుత్ ఉచితమని గురువారం ప్రకటించారు. మొదటి నుండి రాష్ట్రవ్యాప్తంగా తక్కువ ధరలకు విద్యుత్‌ను అందిస్తున్నాము. ఇప్పుడు ఆగస్ట్ 1 నుండి అంటే జులై బిల్లు నుండే రాష్ట్రంలోని గృహ వినియోగదారులు 125 యూనిట్ల విద్యుత్ వరకు ఎలాంటి నగదు చెల్లించాల్సి అవసరం లేదు. దీంతో రాష్ట్రంలోని మొత్తం 1.67కోట్ల కుటుంబాలకు ప్రయోజనం చేకూరుతుందని ఎక్స్‌లో పేర్కొన్నారు. రాబోయే మూడేళ్లలో గృహాల పైకప్పులపై లేదా ప్రభుత్వ స్థలాల్లో సౌరవిద్యుత్ పాలాంట్లను ఏర్పాటు- చేయాలని నిర్ణయించామని పేర్కొన్నారు. కుటీ-ర్ జ్యోతి పథకం కింద అత్యంత పేద కుటు-ంబాలకు, సౌరవిద్యుత్ పాలాంట్లకు అయ్యే ఖర్చును

-మిగతా 2 లో

## బనకచర్లపై బాబుకు ఎందుకంత ప్రేమ?

- ఈ ప్రాజెక్టు వల్ల లక్షల కోట్ల రూపాయల ఖర్చు తప్ప ఎటువంటి ప్రయోజనం లేదు

**అమరావతి**


పోలవరం-బనకచర్ల లింక్ ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకున్న "అంతులేని ప్రేమ" వెనుక ఆంతర్యం ఏమిటో అర్థం కావడం లేదని పిసిసి చీఫ్ వై.ఎస్. షర్మిల ప్రశ్నించారు. గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో, ఈ ప్రాజెక్టు వల్ల లక్షల కోట్ల

-మిగతా 2 లో



## ఉపాధి హామీ లో దక్షిణాదిలో ఏపీ ఆదర్శం

### ఎక్స్ వేదికగా వెల్లడించిన పవన్ కళ్యాణ్



**అమరావతి,**

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సోషల్ ఆడిట్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దక్షిణాది రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందని ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తెలిపారు. ఈ విషయాన్ని ఆయన తన ఎక్స్ వేదికగా పంచుకున్నారు.

-మిగతా 2 లో



## రాష్ట్రంలో శాంతి భద్రతలు లేవు

- బీఆర్ఎస్ నేతల ఇళ్లపై దాడులు
- కేటీఆర్‌పై చిల్లర విమర్శలు మానాలి
- బీఆర్ఎస్ నేత హరీష్ రావు విమర్శలు

**హైదరాబాద్**

రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ పూర్తిగా విఫలం అయిందని బిఆర్ఎస్ ఎమ్మెల్యే,మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ఇంటి పైన దాడి, నా క్యాంపు కార్యాలయం, పాడి కౌశిక్ రెడ్డి ఇంటి పైన, సునీత లక్ష్మారెడ్డి పైన , మర్రి రాజశేఖర్ రెడ్డిపైన దాడి చేస్తున్నారని ఆయన తెలిపారు. తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు మీడియాతో చిట్ చాట్ చేశారు. రాష్ట్రంలో పూర్తిగా శాంతి భద్రతలు కరువై హత్యలు, ఎక్కువ అవుతున్నాయి. కాంగ్రెస్ పార్టీ పాలనలో రాష్ట్ర ఆదాయం పడిపోయింది. చిల్లర మాటలు బంద్ చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశాడు. ఎవడో దుబాయ్‌లో చనిపోతే మా కేటీఆర్‌కు ఏం సంబంధం. ఆ రిపోర్ట్ నీ దగ్గర ఏమైనా ఉంటే రేవంత్ రెడ్డి ముక్కులో పెట్టు-కో. ఈడీ ఎందుకు రేవంత్ రెడ్డిని అరెస్ట్ చెయ్యడం లేదు, కిషన్ రెడ్డి రేవంత్ రెడ్డికి అండగా ఉంటు-న్నాడు. కేంద్రంతో సఖ్యతతో ఉంటానని పేరుకే అంటు-న్నావు, నీ వల్ల రాష్ట్రానికి ఒక్క ఉపయోగం జరగలేదు అని హరీశ్‌రావు పేర్కొన్నారు. కేటీ-ఆర్ పైన చేసిన ఆరోపణల్లో రుజువు ఉంటే చూపించు లేదంటే కేటీఆర్‌కు బహిరంగంగా క్షమాపణ చెప్ప రేవంత్ రెడ్డి. లోకేష్, కేటీఆర్‌ను అర్ధరాత్రి పూట కలిశాడు అని రేవంత్ రెడ్డి అంటున్నాడు. అర్ధరాత్రి పోయి కలిసే అలవాటు- రేవంత్ రెడ్డికే ఉన్నది,

-మిగతా 2 లో

## రష్యాతో ఇంధన ఒప్పందం చేసుకుంటాం

- ఆంక్షలు విధించడానికి మీరెవరూ!

**న్యూఢిల్లీ**

రష్యాతో ఇంధన ఒప్పందంపై అభ్యంతరాలు తెలుపుతూ నాటో చీఫ్ మార్క్ రుట్టే చేసిన వ్యాఖ్యలపై భారత్ మండిపడింది. రష్యాతో వాణిజ్య ఒప్పందాలు చేసుకునే దేశాలపై వంద శాతం సెకండరీ ఆంక్షలు విధిస్తామని హెచ్చరించడాన్ని భారత విదేశాంగ మీడియా ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ తప్పుబట్టారు. ద్వంద్వ ప్రమాణాలను పాటించడం సరికాదని గురువారం పశ్చిమా దేశాలను జైస్వాల్ హెచ్చరించారు.నాటో చీఫ్ వ్యాఖ్యలను.. ప్రస్తుతం నెలకొన్న పరిణామాలను నిశితంగా

-మిగతా 2 లో



## ఇద్దరు సీఎలం భేటీలో తేలిందేమిటి ?

### బడాయి తప్ప పోలవరం,బనకచర్లపై చర్చలేవీ



- గతేడాది కూడా ఇద్దరు సీఎంల భేటీతో ఒరిగిందేమిటి
- చంద్రబాబు ప్రజలను మోసం చేస్తున్నారు
- మీడియా సమావేశంలో అంబటి రాంబాబు


**అమరావతి,**

ఢిల్లీలో పోలవరం, బనకచర్ల ప్రాజెక్టులపై ఉభయ తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చర్చిస్తారని చెప్పారు.. కొన్ని నిర్ణయాలు వస్తాయని అందరూ ఎదురు చూశారు.. కానీ ఈ సమావేశంలో అసలు ఏ ధమైన చర్చ జరగలేదు అని వైసీపీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు ఆరోపించారు. సీఎంల సమావేశంలో బనకచర్లపై అసలు ప్రస్తావనే లేదు.. వాళ్ళ పత్రికల్లోనే ఏపీలో ఒక రకంగా, తెలంగాణలో మరో రకంగా వచ్చింది.. చంద్రబాబు ఇష్టాగోష్టిగా మాట్లాడి బయటకు వచ్చాక ఉభయ రాష్ట్రాలు నాకు

-మిగతా 2 లో

## లిక్కర్ కేసులో అసలు దోషి జగన్

- అందుకే ఎదురుదాడి విమర్శలు
- మండిపడ్డ మాజీమంత్రి సోమిరెడ్డి



**నెల్లూరు,**

ఏపీ లిక్కర్ కేసులో అసలు బాస్ జగనేనని ప్రపంచానికి తెలిసిపోయిందని టిడిపి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఆ భయంతోనే జగన్ అతి క్రూర మనస్తత్వంతో వ్యవహరిస్తున్నారని ఎమ్మెల్యే సోమిరెడ్డి ఘాటు విమర్శలు చేశారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. జగన్ డిప్రెషన్‌లో ఉన్నారంటూ వ్యాఖ్యలు చేశారు. 'సినిమాల్లో విలన్స్ నరికేయండి.. ఆ నా కొడుకుని అని అంటారు.. నువ్వు కూడా అదే డైలాగ్ చెబుతావా? ఇటువంటి వాళ్లని చూస్తే రాజకీయాల్లోకి ఎందుకొచ్చామా అనిపిస్తుందని అంటూ కామెంట్స్ చేశారు. టీడీపీ ముఖ్య నేతలు ఏమి చేశారని జైళ్లకి పంపారని

-మిగతా 2 లో

## రాష్ట్రంలో శాంతి భద్రతలు లేవు

(మొదటి తరువాయి)



మా కేటీఆర్‌కు లేదు. ఈ రాష్ట్రం కోసం, ప్రజల కోసం మేము భయపడం. ఏదో ఒకటి చేసి మా పైన కేసులు పెడితే మేము భయపడతాం అని రేవంత్ రెడ్డి అనుకుంటు-న్నాడు. మా పై తెలంగాణ ఉద్యమంలో 300 పైగా కేసులు పెట్టారు. ఎన్ని కేసులు పెట్టిన భయపడేది లేదు. మా పైన ఇంటిలిజెన్స్ వ్యవస్థతో రేవంత్ రెడ్డి నిఘా పెడుతున్నాడు, మాకేం కాదు. రేవంత్ రెడ్డి బీఆర్ఎస్ నాయకుల ఫోన్లను రోజూ ట్యాప్ చేస్తున్నాడు. మా వెనుక ఇంటలిజెన్స్ వాళ్ళను పెట్టి ఎక్కడ అంటే అక్కడ తిప్పుతున్నారు. మా చుట్టూ నిఘా పెట్టారు. మా అందరి ఫోన్స్ ట్యాప్ అవుతున్నవి. విలేకరుల ఫోన్ ట్యాప్ చేస్తున్నారా. నా తో విలేకరులు మాట్లాడేది ఎలా తెలుస్తుందని అన్నారు.

## రష్యాతో ఇంధన ఒప్పందం చేసుకుంటాం



(మొదటి తరువాయి)

గమినిస్తున్నాం. అయితే.. నేను మరోసారి చెబుతున్నా మా దేశ ప్రజల ఇంధన అవసరాలే మాకు తొలి ప్రధాన్యం. అందుకని ప్రపంచ పరిస్థితులను బట్టి మార్కెట్లో అందుబాటులో ఉన్న వనరులను ఎంచుకుంటాం. ఈ విషయంలో ద్వంద్వ ప్రమాణాలు పాటించడం సరికాదని హెచ్చరిస్తున్నాం' అని జైస్వాల్ తెలిపారు. ఉక్రెయిన్‌తో రష్యా శాంతి చర్చలకు సిద్ధం కాకుంటే ఆ దేశ ప్రధాన వ్యాపార భాగస్వాములైన భారత్, బ్రెజిల్ చైనాలపై ట్రేడ్ టారిఫ్స్ తప్పవని నాటో చీఫ్ మార్క్ రుట్టే హెచ్చరించారు. అమెరికా సెనేటర్లతో సమావేశమైన తర్వాత ఆయన ఆంక్షల ప్రకటన చేయడం గమనార్హం. జూలై తొలి వారంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సైతం రష్యాతో ఆయిల్ ఒప్పందం చేసుకునే దేశాలపై వంద శాతం సెకండరీ టారిఫ్ భారం తప్పదని వార్నింగ్ ఇచ్చారు. ఉక్రెయిన్‌తో 50 రోజుల్లో శాంతి ఒప్పందం చేసుకోకుంటే తమ ఆగ్రహానికి బలికావాల్సి వస్తుందని ట్రంప్ మాస్కోకు అల్టిమేటం జారీ చేశారు.

## బలూచి లిబరేషన్ దాడులు

(మొదటి తరువాయి)

పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ బస్సు కరాచీ నుంచి క్వెట్టాకు దళాలను తరలిస్తుండగా ఈ దాడి చోటు-చేసుకొంది. మరో ఘటనలో క్వెట్టాలోని హజార్‌గంజ్‌లో ఐఈడీ పేల్చి మరో ఇద్దరు సైనికులను హతమార్చినట్లు బీఎల్ఏ వెల్లడించింది. మంగళవారం కలాత్‌లోని ఖజినా ప్రాంతంలో మరో ఐఈడీ పేల్చి నలుగురు సైనికులను , బుధవారం గుజ్రోకొర్ ఏరియాలో దాడి చేసి మరో ఆరుగురు సైనికులను హత్య చేసినట్లు- బీఎల్ఏ ప్రకటించింది. వీరిలో మేజర్ సయిద్ రబ్ నవాజ్ తరీక్ కూడా ఉన్నట్లు- చెప్పింది. సమీపంలోని సైనిక కాన్వాయ్‌ను స్నైపర్లు లక్ష్యంగా చేసుకోవడంతో.. ఆ కాన్వాయ్ అక్కడినుంచి వెళ్లిపోయింది. ఇక ముగ్గురు బీఎల్ఏ దళ సభ్యులు చనిపోయినట్లు- వచ్చిన వార్తలను ఖండించింది. ఈ ఏడాది జనవరి నుంచి జూన్ బలోచ్ రెబల్స్ మొత్తం 286 దాడులు చేశారు. ఈ క్రమంలో వివిధరకాల వ్యూహాలను అమల్లోకి తెచ్చారు. వీటిల్లో మూడు ఆత్మాహుతి దాడులు ఉన్నాయి. బీఎల్ఏ చేసిన మొత్తం దాడుల్లో 700 మందికి పైగా చనిపోయారు. 290 మందిని అదుపులోకి తీసుకొన్నట్లు- బీఎల్ఏ చెబుతోంది. ఈ క్రమంలో 133 వాహనాలను లక్ష్యంగా చేసుకొంది. ఏకంగా ఓ రైలునే హైజాక్ చేసింది. దీంతోపాటు- ఈ ఏడాది మొత్తం 45 వ్యూహాత్మక ప్రాంతాలను పాక్ నుంచి స్వాధీనం చేసుకొన్నట్లు- గణాంకాలు చెబుతున్నాయి.

## బీహార్‌లో నితీష్ ఉచిత వల

(మొదటి తరువాయి)

రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందని, మిగిలిన వారికి ప్రభుత్వం తగిన మద్దతును అందిస్తుందని తెలిపారు. అంటే గృహ వినియోగదారులు ఇకపై 125 యూనిట్ల వరకు విద్యుత్ కోసం ఎటు-వంటి ఖర్చు భరించాల్సిన అవసరంలేదని, రాబోయే మూడేళ్లలో రాష్ట్రంలో 10,000 మెగావాట్ల వరకు సౌరశక్తి అందుబాటు-లో ఉంటుందని అన్నారు. తాము అధికారంలోకి వస్తే 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తామని రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్‌జెడి) నేత, మాజీ డిప్యూటీ- సిఎం తేజస్వీయాదవ్ ప్రకటించిన సంగతి తెలిసిందే. తమ నేత 200 యూనిట్ల వరకు విద్యుత్ ఉచితమని ప్రకటించడంతో బీహార్ సిఎం నితీష్‌కుమార్ దిగిరావాల్సి వచ్చిందని ఆర్‌జెడి అధికార ప్రతినిధి శక్తి సింగ్ యాదవ్ ఏద్దేవా చేశారు.

# హంద్రీనీవా ప్రాజెక్టుతో రైతులందరికి మేలు

(మొదటి తరువాయి)

రాయదుర్గం ఎడారిగా మారకుండా చర్యలు తీసుకున్నాం. సీమ చరిత్రను తిరగరాయాలని ఎన్టీఆర్ తొలిసారి ఆలోచించారు. హంద్రీనీవా, గాలేరు నగరి, తెలుగుగంగకు శ్రీకారం చుట్టింది ఎన్టీఆరే. ఆయన ఆశయాలను తెదేపా నెరవేర్చింది. రాయలసీమకు నీరిచ్చాకే చెన్నైకి నీళ్లు ఇస్తానని ఆనాడు ఎన్టీఆర్ చెప్పారు. హంద్రీనీవా నీరు 550 కి.మీ ప్రవహించి చిత్తూరు, కుప్పం వరకు వెళ్తోంది. ఈ ప్రాజెక్టు ద్వారా 6 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుంది. మల్యాల ద్వారా సుమారు 4 టీఎంసీల నీరు తీసుకెళ్లవచ్చు. కృష్ణగిరి, పత్తికొండ, జీడిపల్లి, పీఏబీఆర్, మారాల, గొల్లపల్లి, చెర్లోపల్లి, మదనపల్లె, చిత్తూరుకు నీరిచ్చే అవకాశం వస్తుంది. సమస్య ఎదురైతే సవాలుగా తీసుకొని పనిచేసే మనస్తత్వం నాది. వేరే రాష్ట్రానికి వెళ్తున్న కియాను అనంతపురం తీసుకొచ్చా. 8 నెలల్లో గొల్లపల్లి పూర్తి చేసి కియాకు నీళ్లిచ్చిన ఘనత మాది. రాయలసీమ రైతు కుటుంబాల్లో మార్పు రావాలనేదే నా లక్ష్యం. తొలి దశలో 1.98 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరు వస్తుందని బాబు అన్నారు. ఒక్క ఛాన్స్ అంటూ వచ్చిన జగన్ ఐదేళ్లపాటు- రాష్ట్రాన్ని నాశనం చేశారు. రాష్ట్రానికి పేరు రావాలని, ప్రజల జీవితాలు బాగుపడాలని నిత్యం కోరుకుంటా. రాయలసీమకు రూ.2 వేల కోట్లు- కూడా వైకాపా ఖర్చు చేయలేదు. హంద్రీనీవాకు కనీసం రూపాయి ఖర్చుపెట్టారా? అన్ని ప్రాజెక్టులు పూర్తి చేసింది మా ప్రభుత్వమే. మా హయాంలోనే పోతిరెడ్డిపాడు, ముచ్చుమర్రి, గండికోట వచ్చాయి. నదుల అనుసంధానం జరగాలనేది నా జీవిత ఆశయం. పోలవరం పూర్తి చేసి నదులు అనుసంధానిస్తే కరవు అనే మాటే ఉండదు. ఇప్పుడు రాయలసీమలోని అన్ని జలాశయాలు కళకళలాడుతున్నాయి. రాయలసీమను రతనాలసీమగా మారుస్తామనే ధైర్యం వచ్చింది. శ్రీశైలం నుంచి ఎస్ఆర్‌బీసీ, ముచ్చుమర్రి, మల్యాల



కాల్వలు వస్తాయి. హంద్రీనీవా నుంచి అనంతపురం, పత్తికొండ, గొల్లపల్లికి మరో కాల్వ వెళ్తుంది. గాలేరు-నగరి నుంచి గండికోట, అవుకు, మైలవరానికి నీళ్లు వస్తాయి. శ్రీశైలం నుంచి ప్రారంభమైన నీరు తిరుపతికి వెళ్లే పరిస్థితి వస్తుందని అన్నారు. రాజకీయాలు సమస్యలు ఎప్పుడూ ఉంటాయి. క్లైమోమోర్ మైన్స్ కూడా నన్ను ఏమీ చేయలేకపోయాయి. రాయలసీమ లో అన్ని రకాల వనరులు ఉన్నాయి. మంచి రోడ్లు ఉన్నాయి. ఎక్కడికైనా సులువుగా వెళ్లవచ్చు. వైకాపా హయాంలో ఐదేళ్లపాటు- ఒక్క గుంత కూడా పూడ్చలేదు. రాష్ట్రంలో ఆర్‌అండ్‌బీ రోడ్లను అందంగా మారుస్తాం. చెప్పిన ప్రతిమాట నిలబెట్టు-కుంటు-న్నానా? లేదా? గత ప్రభుత్వం పింఛను రూ. వెయ్యికి పెంచేందుకు ఐదేళ్ల సమయం తీసుకుంది. మేం వచ్చాక ఒకేసారి రూ. వెయ్యి పెంచి పింఛను ఇచ్చాం. దివ్యాంగుల పింఛను ఒకేసారి రూ.6 వేలకు పెంచిన ఘనత మాదే. పేదవాడికి అన్నం పెట్టే క్యాంటీ-న్లు మూసేశారు. మేం వచ్చాక మళ్లీ 207 అన్న క్యాంటీన్లు ప్రారంభించాం. 21 దేవాలయాల్లో అన్నప్రసాదం ప్రారంభించాం అని చంద్రబాబు అన్నారు. హంద్రీనీవా ఫేజ్-1 కాల్వల విస్తరణ పనులు పూర్తి కావడంతో గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబు నీరు విడుదల చేశారు. జలహారతి ఇచ్చి నంద్యాల జిల్లా నందికొట్కూరు మండలం మల్యాల పంపింగ్ స్టేషన్‌లో రెండు మోటార్లను ఆన్ చేశారు. నీటి విడుదలతో రాయలసీమకు తాగు, సాగునీటి కష్టాలు తీరనున్నాయి. 12 ఏళ్ల తర్వాత సీమకు 40 టీఎంసీల నీరు అందుబాటులోకి వచ్చింది. ఈ సందర్భంగా జలవనరులశాఖ ఏర్పాటు- చేసిన ఛాయాచిత్ర ప్రదర్శనను సీఎం తిలకించారు. ప్రాజెక్టు అలైన్ మెంట్, ఆయకట్టు-, కృష్ణా రివర్ బేసిన్ మ్యాప్‌లను పరిశీలించారు. పంపింగ్ స్టేషన్ వ్యూపాయింట్ నుంచి నీటి విడుదలను వీక్షించారు. నీటిపారుదలశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, ఎంపీ బైరెడ్డి శబరి, ఇరిగేషన్ ఉన్నతాధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు. రాయలసీమలో అరాచకం సృష్టించాలని మాజీ సీఎం జగన్ చూస్తున్నారని ఈ సందర్భంగా ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. మన జీవితాల్లో వెలుగులు నింపేందుకు సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని చెప్పారు. బనకచర్లపై జగన్ మాటలను చరిత్ర క్షమించదన్నారు. కేవలం 100 రోజుల్లోనే హంద్రీనీవా కాల్వ సామర్థ్యాన్ని 12 పంపులకు పెంచాం. వైకాపా హయాంలో గంప మట్టి కూడా తీయలేని పరిస్థితి నెలకొంది. జగన్ మళ్లీ పాలెగాళ్ల సంస్కృతిని ప్రోత్సహిస్తున్నారు. రాయలసీమను అభివృద్ధి చేసింది మా పార్టీయే. మీ వైపు ఎంతమంది మారినా.. మా వైపు ఒకే నాయకుడు ఉన్నారు. వైకాపా నేతలు రౌడీ రాజకీయాలు చేస్తున్నారని పయ్యావుల కేశవ్ విమర్శించారు.

## బనకచర్లపై బాబుకు ఎందుకంత ప్రేమ?

(మొదటి తరువాయి)




రూపాయల ఖర్చు తప్ప ఎటువంటి ప్రయోజనం లేదని ఇంజినీర్లు స్పష్టం చేస్తున్నారని ఆమె అన్నారు.బనకచర్ల లింక్ ప్రతిపాదన పోలవరం అసలు ప్రాజెక్టుకే నష్టం కలిగిస్తుందని ప్రాజెక్టు అథారిటీ సైతం చెబుతున్నప్పటికీ, ముఖ్యమంత్రి చంద్రబాబు పట్టించుకోవడం లేదని షర్మిల విమర్శించారు. 2014లో దివంగత వై.ఎస్. రాజశేఖరరెడ్డి ప్రారంభించిన జలయజ్ఞంలో దాదాపు 39 ప్రాజెక్టులు పెండింగ్‌లో ఉన్నాయని ఆమె గుర్తు చేశారు.గత పదేళ్లుగా ప్రభుత్వాలు ఈ ప్రాజెక్టులపై కనీసం ఒక్క తట్ట మట్టి కూడా తీయలేదని షర్మిల ఆరోపించారు. సుమారు రూ.40 వేల కోట్లు వెచ్చిస్తే ఈ ప్రాజెక్టులన్నీ పూర్తయి 50 లక్షల ఎకరాలకు అదనంగా సాగునీరు, కోటి మందికి తాగునీరు అందుతాయని తెలిసినా కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేకపోవడం బాధాకరమని పిసిసి చీఫ్ షర్మిల పేర్కొన్నారు.

## ఉపాధి హామీ లో దక్షిణాదిలో ఏపీ ఆదర్శం

(మొదటి తరువాయి)

ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ- సీఎం పవన్ కళ్యాణ్ నేతృత్వంలోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామీణ అభివృద్ధిని ప్రధాన లక్ష్యంగా తీసుకొని ప్రతి ఒక్కరికి ఉపాధి కల్పించాలనే సంకల్పంతో ముందుకెళు తున్నాయని వెల్లడించారు. ఇక, ఉపాధి ద్వారా చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు విజయవంతంగా అమలవుతుండటంతో, రాష్ట్రంలోని గ్రామాల రూపురేఖలు మారుతున్నాయని డిప్యూటీ- సీఎం పవన్ కళ్యాణ్ చెప్పుకొచ్చారు. అధికారుల పని తీరును ఎప్పటికప్పుడు సోషల్ ఆడిట్ ద్వారా సమీక్షిస్తూ, నాణ్యతా తనిఖీలు, పారదర్శకత, జవాబుదారీతనాన్ని పాటించడం వల్ల ఇతర రాష్ట్రాల అధికారులు కూడా ఆంధ్రప్రదేశ్ పని తీరును మెచ్చుకుంటు-న్నారని పవన్ కళ్యాణ్ ఎక్స్ వేదికగా రాసుకొచ్చారు.

## కూటమి పై బురదజల్లడమే జగన్ పని

(మొదటి తరువాయి)

వివేకా హత్యతో ఆ విత్తనం పెరిగింది.. సినిమా డైలాగు బ్యానర్ లో వేస్తే తప్పుకాదు అంటున్నారు.. మరి, గతంలో పట్టాభి బోస్ డీకే అంటే ఎందుకు అరెస్ట్ చేశారు అని ప్రశ్నించారు. మా కార్యకర్తలకు పునకాలు వచాయి.. అందుకే టీడీపీ ఆఫీసుపై దాడి చేశారని అన్నారు.. బోస్ డీకే కూడా సినిమా డైలాగ్ కదా?.. రప్పా రప్పా అంటూ నరుకూతామంటే కేసులు పెట్టారా అని మంత్రి అనిత ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత మా వాళ్ళు నా మాట వినరు అంటూ బెదిరిస్తున్నారా అని హోంమంత్రి అనిత పేర్కొన్నారు. పేర్ని నాని నోటికి వచ్చినట్లు- మాట్లాడుతున్నారు.. కుటుంబ సభ్యులను కూడా విమర్శిస్తున్నారు.. చీకటిలో వేసెయ్యాలా.. చంద్రబాబు ఇంకా ఎంతకాలం బతుకుతాడు అంటున్నాడు.. వైసీపీ వాళ్లు దిగజారి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఏం మాట్లాడినా చెల్లుబాటు- అవుతుందని అనుకుంటే ఎలా?.. గత ప్రభుత్వంలో పెట్టిన కేసులపై.. ఇప్పుడు నమోదు అవుతున్న కేసులపై చర్చకు సిద్ధమా? అని సవాల్ విసిరారు. ప్రసన్న కుమార్ రెడ్డి ఇంటిపై దాడి చేశారని జగన్ అంటున్నారు.. ఆయన ప్రశాంతి రెడ్డిని ఎలాంటి మాటలు అన్నారో గమనించారా అని అన్నారు. ప్రసన్న వ్యాఖ్యలను కోర్టు కూడా తప్పుబట్టింది.. సొంత చెల్లి కట్టుకున్న చీర గురించి మాట్లాడిన వ్యక్తి జగన్.. ఆయన నుంచి మంచిని ఆశించడం సరికాదు అని వంగలపూడి అనిత ఆగ్రహం వ్యక్తం చేసారు.

## ఇద్దరు సీఎలం భేటీలో తేలిందేమిటి ?

(మొదటి తరువాయి)

సమానమే అని ఒక స్టేట్‌మెంట్ ఇచ్చారు.. ఇరిగేషన్ మంత్రి రామానాయుడు కార్యాచరణకు రూట్ మ్యాప్ సిద్ధం చేస్తామన్నారు.. వాళ్ళ మాటలు వింటుంటే సీఎం చంద్రబాబు మోసపు మాటలు చెబుతున్నారని అనకతప్పదు.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత ఏడాది 7- 7- 24న ప్రగతి భవన్ లో సమావేశమయ్యారు.. విభజన సమస్యల పరిష్కారం కోసం భేటీ అయ్యామన్నారు.. త్వరలో కమిటీ- వేసి తేల్చేస్తామన్నారు.. ఇప్పటికి ఏడాది దాటింది.. మీరు సాధించింది ఏంటి అని అంబటి రాంబాబు ప్రశ్నించారు. ఇక, నీళ్లను రాయలసీమకు తీసుకెళ్లి సస్యశ్యామల చేద్దామన్న ఆలోచన చంద్రబాబు లేదని వైసీపీ నేత అంబటి రాంబాబు విమర్శించారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి చేపట్టిన ప్రాజెక్టులు తప్ప మీరు చేసిందేమీ లేదు.. పోలవరం నుంచి బనకచర్లకు నీళ్లు తీసుకు వెళ్లాంటే 42 లెవెల్ ఉన్నప్పుడు మాత్రమే సాధ్యం అవుతుంది.. ఇవాళ దాన్ని 41.15 కే చంద్రబాబు అంగీకరించారు.. ఇప్పుడు పోలవరం, బనకచర్లకి 42 నుంచి నీళ్లు ఎలా తీసుకువెళతారు అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 2027 వరకు పోలవరం ప్రాజెక్టు పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామన్నారు.. అక్కడ పనులు మాత్రం ముందుకు వెళ్ళడం లేదు.. డయాఫ్రమ్ వాల్ చాలా ప్రధానమైంది.. 0.65 వెడల్పుతో వేయాల్సిన డయాఫ్రమ్ వాల్ 0.9 వెడల్పు లో వేస్తున్నారు.. ప్రాజెక్టు విషయంలో చంద్రబాబు ప్రవర్తన సరినది కాదు.. ఆయనకు పోలవరం మీద అసలు ఇం-ట్రెస్ట్ లేదు.. ఆయన దృష్టి మొత్తం మొబలైజేషన్ ఫండ్ మీదే ఉందని మాజీ మంత్రి రాంబాబు ఆరోపించారు. ఎల్లో మీడియా, చంద్రబాబు.. రాష్ట్ర ప్రజలను మోసం చేస్తున్నారని అంబటి రాంబాబు మండిపడ్డారు.

## లిక్కర్ కేసులో అసలు దోషి జగన్

(మొదటి తరువాయి)

ప్రశ్నించారు. చంద్రబాబు ఇళ్లు, పార్టీ కార్యాలయంపై దాడులు ఎందుకు చేయించారని నిలదీశారు. జగన్ బుద్ధిమంతుడు.. తాము అరాచకవాదులమా అంటూ ఫైర్ అయ్యారు. ఒక్క ఛాన్స్ అని అధికారంలోకి వచ్చి వ్యవస్థలన్నింటినీ నిర్వీర్యం చేశారని విమర్శించారు. 11 సీట్లతో ప్రజలు ఈడ్చికొట్టారు. అసెంబ్లీకి రావంటావా? రిజైన్ చేయి, మీ ఎమ్మెల్యేలతో రిజైన్ చేయించు. సిట్ కేసులో రూ.3200 కోట్లు ఎక్కడికి పోయాయో చెప్పు అంటూ సోమిరెడ్డి సవాల్ చేశారు. ఇన్ని కేసులు ఉన్నా నోరు మెదపవే. నీ మద్యం తాగించి 33 మందిని చంపేశావ్? లక్షల మందిని బెడ్ ఎక్కించావ్?' అంటూ జగన్‌పై సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. అరాచక పాలన సాగించిన జగన ఇప్పుడు నీతులు పలుకుతున్నారని, మళ్లీ తమదే రాజ్యం అంటూ పోజులు కొడుతున్నారని మండిపడ్డారు. కలలో కూడా ప్రజాలు జగన్‌ను నమ్మరని అన్నారు.

## సంపాదకీయం

# దగాకోరు ఎఫ్‌పిపిసిఎ విధానం


ఇంధనం, విద్యుత్ కొనుగోలు వ్యయం సర్దుబాటు (ఎఫ్‌పిపిసిఎ) విధానం వినియోగదారుల నుండి అనవసరంగా, అన్యాయంగా అధిక మొత్తాలను ముందుగానే వసూలు చేయడానికి విద్యుత్ పంపిణీ కంపెనీలకు (డిస్కాం), ప్రసార సంస్థ (ట్రాన్స్‌కో)కు వీలు కల్పించే విధానమది. ఏ ఆర్థిక సంవత్సరానికైనా విద్యుత్ చార్జీలను పెంచరాదని ప్రభుత్వం నిర్ణయిస్తే, అది భరించాల్సిన సబ్సిడీని తగ్గించేందుకు తన రెగ్యులేషన్‌ని ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ కమిషన్ (ఎపిఈఆర్‌సి) తానే ఉల్లంఘిస్తున్నది. వినియోగదారులకు ట్రూడౌన్ కింద ఈ విద్యుత్ సంస్థలు తిరిగి చెల్లించాల్సిన మొత్తాలు వినియోగదారులకు నేరుగా అందకుండా ఉండే రీతిలో కమిషన్ ద్వంద్వ ప్రమాణాలను పాటిస్తున్నది. ఆ మొత్తాలను డిస్కాంలు గుండుగుత్తగా వాటి రెవెన్యూ లోటును తగ్గించేందుకు ముందుగానే పొందే విధంగా కమిషన్ అసంబద్ధ నిర్ణయాలు తీసుకొంటున్నది. వ్యవసాయ వినియోగదారులకు ఉచిత విద్యుత్ సరఫరా విధానం కింద అదనంగా సరఫరా చేసిన విద్యుత్‌కు అవుతున్న అదనపు వ్యయంలో అధిక మొత్తాన్ని వ్యవసాయేతర విద్యుత్ వినియోగదారులపై మోపే రీతిలో కమిషన్ ఎఫ్‌పిపిసిఎ రేట్లను నిర్ణయిస్తూ, ప్రభుత్వం భరించాల్సిన సబ్సిడీని తగ్గిస్తున్నది. ఒక ఆర్థిక సంవత్సరానికి కమిషన్ చార్జీల ఉత్తర్వును (మార్చి నెలలో) జారీ చేశాక, మరుసటి నెల (తదుపరి ఆర్థిక సంవత్సర ఏప్రిల్ మాసం నుండే) ఎఫ్‌పిపిసిఎ కింద యూనిట్‌కు 40 పైసల చొప్పున చార్జీలకు అదనంగా వినియోగదారుల నుండి వసూలు చేస్తున్న విధానం అనేక విధాలుగా ప్రశ్నార్థకంగా మారింది. అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని డిస్కాంల రెవెన్యూ లోటును భర్తీ చేసే విధంగా కమిషన్ చార్జీలను నిర్ణయించాక, మరుసటి నెల నుండే ఇలా అదనపు మొత్తాలను వసూలు చేసుకొనేందుకు డిస్కాంలకు అనుమతి ఇవ్వటం అంటే, కమిషన్ చేసిన నిర్ధారణలు రెండు విధాలుగా అసమగ్రమైనవి, అవాస్తవికమైనవి అని భావించాలి. దీనివల్ల డిస్కాంలు వినియోగదారుల నుండి చాలా అధిక మొత్తాలను అనవసరంగా, ముందస్తుగా వసూలు చేయడానికి వీలు కలుగుతున్నది. డిస్కాంల రెవెన్యూ లోటును వాస్తవంగా ఉండేదాని కన్నా తక్కువగా కమిషన్ నిర్ధారించి, చార్జీలను నిర్ణయిస్తే, ప్రభుత్వం ఇవ్వాల్సిన సబ్సిడీ అవసరం తగ్గించడానికి దారితీస్తున్నది. చార్జీలను పెంచలేదని చూపుతూ, ఏడాది అంతా యూనిట్‌కు 40 పైసల చొప్పున అదనంగా వసూలు చేయటంతో పాటు, వేల కోట్ల రూపాయలను ఆర్థిక సంవత్సరం ముగిశాక ట్రూఅప్ కింద డిస్కాంలు క్లెయిమ్ చేయడానికి దారితీస్తున్నది. కమిషన్‌లో దాఖలు చేసిన పిటిషన్ల ప్రకారం, 2024-25 సంవత్సరానికి, రాష్ట్రంలోని మూడు డిస్కాంలు కలిపి ఎఫ్‌పిపిసిఎ కింద మొత్తం రూ.2376.94 కోట్ల మేరకు ట్రూఅప్ క్లెయిమ్‌లను చూపగా, నెలకు యూనిట్‌కు 40 పైసల చొప్పున అవి వసూలు చేసిన మొత్తం రూ.2787.19 కోట్లు. ఇపిడిసిఎల్ రూ.1292.28 కోట్ల మేరకు ట్రూడౌన్ క్లెయిమ్‌ను చూపింది. ఆ మేరకు అనవసరంగా వినియోగదారుల నుండి ఇపిడిసిఎల్ వసూలు చేయడం ఎఫ్‌పిపిసిఎ విధానం ఎంత లోపభూయిష్టంగా ఉన్నదీ స్పష్టం చేస్తున్నది. కాగా, వసూలు చేసిన మొత్తంతో కలిపి ఎస్‌పిడిసిఎల్ రూ.1599.33 కోట్లు, సిపిడిసిఎల్ రూ.963.77 కోట్ల మొత్తాన్ని ట్రూఅప్ కింద చూపడం అనేక ప్రశ్నలకు తావిస్తున్నది. ఇలాంటి వ్యత్యాసాలకు కారణమైన అంశాలపై వివరమైన అధ్యయనం చేయాల్సి ఉంది. మూడు డిస్కాంల క్లెయిమ్‌లను సర్దుబాటు చేసి వినియోగదారులకు రూ.449.60 కోట్లు ట్రూడౌన్ కింద తిరిగి ఇవ్వజూపటం ఘనకార్యమన్నట్లు మూడు డిస్కాంల సిఎండిల తరపున ఇచ్చిన వివరణ హాస్యాస్పదం. మూడు డిస్కాంలు గత ఆర్థిక సంవత్సరంలో యూనిట్‌కు రూ.40 పైసల చొప్పున వినియోగదారుల నుండి వసూలు చేసిన రూ.2787.19 కోట్ల నుండి రూ.449.60 కోట్ల మొత్తాన్ని వినియోగదారులకు తిరిగి ఇవ్వజూపుతున్నాయి తప్ప తమ వ్యయాన్ని తగ్గించుకొని, పొదుపు చేసి ఈ మొత్తాన్ని వినియోగదారులకు ఇవ్వటం లేదు. వాస్తవానికి, కమిషన్ ఉత్తర్వులో అనుమతించిన చార్జీలకు మించి గత ఆర్థిక సంవత్సరంలో రూ.2787 కోట్ల మేరకు వినియోగదారులపై అదనపు భారాన్ని మోపాయి ట్రాన్స్‌కో వసూలు చేయాల్సిన ప్రసార చార్జీలను, డిస్కాంలు వసూలు చేయాల్సిన పంపిణీ చార్జీలను కమిషన్ అయిదేళ్ళ నియంత్రణ కాలానికి ఏటా ఎంత ఉండాలో నిర్ణయిస్తూ బహుళ సంవత్సర చార్జీల (ఎంవైటి) ఉత్తర్వులను జారీ చేస్తున్నది. ప్రసార, పంపిణీ వ్యాపారాలకు సంబంధించి ట్రాన్స్‌కో, డిస్కాంల రెవెన్యూ అవసరాలలో వస్తున్న తేడాలను బట్టి వచ్చే ట్రూ అప్ లేదా ట్రూ డౌన్ మొత్తాలను అయిదేళ్ళ నియంత్రణ కాలం ముగిశాక సర్దుబాటు చేయాలని కమిషన్ రెగ్యులేషన్‌లో నిర్దేశించింది. డిస్కాంల విద్యుత్ సరఫరా వ్యాపారానికి సంబంధించి, ఏడాది ముగిశాక కమిషన్ ఇస్తున్న ట్రూ అప్ సర్దుబాటు ఉత్తర్వుల ప్రకారం ఎన్ని నెలల పాటు నెలకు యూనిట్‌కు మూడు డిస్కాంలు వసూలు చేసుకొనేందుకు అవసరమైన మొత్తాలను కమిషన్ నిర్ణయిస్తున్నది. ప్రతి నెలా వినియోగదారుల నుండి వసూలు చేస్తున్నాయి. సాధారణంగా, విద్యుత్ సరఫరా వ్యాపారానికి డిస్కాంలు ట్రూఅప్ మొత్తాలను చూపుతున్నాయి. ప్రసార, పంపిణీ వ్యాపారాలకు సంబంధించి, ట్రాన్స్‌కో, డిస్కాంలు ప్రతిపాదించిన, కమిషన్ అనుమతించిన మేరకు నియంత్రణ కాలంలో ఏటా అవి పెట్టుబడి వ్యయం చేయటం లేదు. దానివల్ల, వాటి రెవెన్యూ అవసరాలు కమిషన్ ఎంవైటి ఉత్తర్వులలో నిర్ధారించిన దానికన్నా తక్కువగా తేలి, ట్రూడౌన్ మొత్తాలను చూపుతున్నాయి. ఈ ట్రూడౌన్ మొత్తాలు తేలుతున్నది వాటి నిర్వహణ సామర్థ్యం మెరుగుపడటం వల్ల కాదు. అవసరమైన దానికన్నా అధిక మొత్తాలను చార్జీల రూపంలో వసూలు చేస్తుండటం వల్లనే. 2023-24 సంవత్సరంతో ముగిసిన అయిదేళ్ళ నాల్గవ నియంత్రణ కాలానికి ఎ.పి ట్రాన్స్‌కో తన ప్రసార వ్యాపారానికి రూ.1059.75 కోట్ల మొత్తాన్ని ట్రూడౌన్ కింద చూపింది. ఇదిగాక, మరో రూ.510 కోట్ల ట్రూడౌన్ మొత్తాన్ని గత ఆర్థిక సంవత్సరానికి డిస్కాంల రెవెన్యూ లోటును తగ్గించేందుకు కమిషన్ విద్యుత్ సరఫరా చార్జీల ఉత్తర్వులో సర్దుబాటు చేసింది. దానివల్ల, చార్జీలను పెంచరాదని నిర్ణయించిన ప్రభుత్వం ఇవ్వాల్సిన సబ్సిడీ అవసరం ఆ మేరకు తగ్గింది. కమిషన్ అలా సర్దుబాటు చేయకుండా ఉంటే, ఆ మొత్తాన్ని కూడా డిస్కాంలు వినియోగదారులకు తిరిగి చెల్లించాల్సి వచ్చేది. అదేవిధంగా, డిస్కాంలు తమ పంపిణీ వ్యాపారానికి నాల్గవ నియంత్రణ కాలానికి చూపిన ట్రూఅప్, ట్రూడౌన్ క్లెయిమ్‌ల మొత్తాల నుండి 2024-25 సంవత్సరానికి రెవెన్యూ లోటులో ఎస్‌పిడిసిఎల్‌కు సంబంధించి రూ.2000 కోట్లు, ఇపిడిసిఎల్‌కు రూ.1800 కోట్లు, సిపిడిసిఎల్‌కు రూ.1400 కోట్ల మేరకు సర్దుబాటు చేసింది. ఆ మేరకు కూడా ప్రభుత్వం ఇవ్వాల్సిన సబ్సిడీ అవసరం తగ్గింది. వినియోగదారులకు తిరిగి చెల్లించాల్సిన మొత్తం రాకుండా పోయింది. అలా సర్దుబాటు చేయకుండా ఉంటే ఆ మొత్తాలను కూడా డిస్కాంలు వినియోగదారులకు తిరిగి చెల్లించాల్సి వచ్చేది. విద్యుత్ సరఫరా వ్యాపారానికి సంబంధించి అదనపు విద్యుత్ కొనుగోళ్ళు, ఆదాయ వ్యయాలలో వస్తున్న తేడాలను డిస్కాంలు ప్రతినెలా సమర్పిస్తున్నా, ఇపిడిసిఎల్ నెలకు యూనిట్‌కు 40 పైసల చొప్పున అనవసరంగా వసూలు చేస్తున్నా, కమిషన్ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించింది. అదేవిధంగా, ట్రాన్స్‌కో ప్రసార వ్యాపారానికి, డిస్కాంల పంపిణీ వ్యాపారానికి సంబంధించి కమిషన్ ప్రతి ఏటా సమీక్ష చేస్తున్నా, అనవసరమైన అదనపు వసూళ్ళకు సంబంధించి కూడా కమిషన్ అదేవిధంగా వ్యవహరించింది. ఎఫ్‌పిపిసిఎ మొత్తాలను ప్రతి నెలా విద్యుత్ బిల్లులో చూపి వసూలు చేసేందుకు డిస్కాంలకు అనుమతిస్తున్న కమిషన్, ట్రూడౌన్ మొత్తాలను కూడా అదేవిధంగా విద్యుత్ బిల్లులో చూపి ఆ మేరకు బిల్లు మొత్తాలను తగ్గించాలని ఆదేశించకుండా ద్వంద్వ ప్రమాణాలను పాటిస్తున్నది. ప్రసార, పంపిణీ వ్యాపారాలకు సంబంధించి అయిదేళ్ళ నియంత్రణ కాలం ముగిసిన తరువాతనే ట్రూఅప్, ట్రూడౌన్ మొత్తాలను సర్దుబాటు చేయాలని రెగ్యులేషన్‌లో నిర్దేశించిన కమిషన్ ట్రూడౌన్ మొత్తాలను డిస్కంల ఆర్థిక లోటును తగ్గించేందుకు వాటి వార్షిక చార్జీల ఉత్తర్వులో సర్దుబాటు చేస్తూ తన రెగ్యులేషన్‌ను తానే ఉల్లంఘిస్తోంది.

# హద్దుమీరుతున్న నేతల రాజకీయ భాష !



రాజకీయ నాయకుల విమర్శల్లో భాష హద్దు దాటుతోంది. హుందాగా ఉండాల్సిన వారు బజారు భాష మాట్లాడుతున్నారు. విమర్శల కోసం ఏదిపడితే అది మాట్లాడుతున్నారు. ముఖ్యంగా పదేళ్లు అధికారం వెలగబెట్టిన బిఆర్ఎస్ నేతలు, ఐదేళ్లు అధికారం వెలగబెట్టిన వైకాపా నేతలు ఇష్టానుసారంగా విమర్శలు చేస్తున్నారు. పత్రికలు, ఛానళ్లు కూడా వీటిని యదాతథంగా ప్రసారం చేస్తున్నాయి. నాయకుల విమర్శలు చేసే సమయంలో మాట్లాడే భాషపై ఆంక్షలు విధించాలి. లేకుంటే రానురాను అది పరిధి దాటి పోగలదు. మంత్రులుగా చేసిన వారు, ముఖ్యమంత్రులుగా చేసిన వారు సైతం భాషను పరిధి దాటి వినియోగిస్తు న్నారు. సన్నాసి, లుచ్ఛా లఫంగా, ఏం పీకుతావ్, రఫారఫా,సిగ్గులేదు... ఇలా అనేక రకాల పదాలు వాడుతున్నారు. కావాలనే అన్ని పదాలను ఇక్కడ ప్రస్తావించడం లేదు. తెలంగాణలో దాదాపు పదేళ్లు పాలన చేసిన కెసిఆర్ తెలంగాణ ఉద్యమంలో భాషను సాధనంగా చేసుకున్నారు. అధికారంలోకి వచ్చిన తరవాత మార్పు కనిపించింది. మధ్యలో కొంతకాలం మళ్లీ ఎదురుదాడి చేసే సమయంలో దుర్భాషను వాడారు. ఇప్పుడు బిఆర్ఎస్ నేతలు కెటిఆర్, హరీష్ రావులతో పాటు ఇతర నేతలు కూడా హద్దుమీరి మాట్లాడుతున్నారు. ఓ రకంగా చెప్పాలంటే కాంగ్రెస్ నేతలే కొంత సంయమనం పాటిస్తున్నారు. ఎపిలో జనగ్ ఆయన అనుచరులు కూడా ఇలాగే తెగించారు. ఇలాంటి భాష మాట్లాడితే ప్రజలు మెచ్చి అధికారం కట్టబెడతారని వారు భావిస్తున్నట్లుగా ఉంది. తెలంగాణ రాష్ట్రం సాధించుకున్న తర్వాత కల్వకుంట్ల కుటుంబ సభ్యులంతా అధికారం అనుభవించారు. వారి చుట్టాలు, పక్కాలు, కులమైతే చాలన్నట్లుగా పదవులను చేపట్టారు. సంతోష్‌తో పాటు సమీప బంధువులు కూడా మంత్రి పదవుల నుంచి ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అనేక ఉన్నతస్థాయి నామినేటెడ్ పదవులు పొందారు. ఉద్యమం చేసి ప్రాణత్యాగాలు చేసిన 1400 మంది కుటుంబాలను, ఇతరులను ఉద్యమ నాయకుడు కెసిఆర్ గడ్డిపరకల్లా తీసి అవతల పడేశారు. ప్రొపెసర్ కోదండరామ్ లాంటి వారిని కూడా మర్చిపోయారు. జర్నలిస్టులను గంజిలో ఈగల్లాగా విసిరి పడేశారు. ఇప్పుడు అధికారం పోయేసరికి వారికి పిచ్చెక్కినట్లుగా ఉంది. అందుకే ఏడాదిన్నరకే నిత్యం రంకెలు వేస్తున్నారు. కాంగ్రెస్ మొత్తం ఏదో తప్పిదం చేసిందన్న భావనలో ఉచ్ఛనీచాలు మరచి విమర్శలు చేస్తున్నారు. ముఖ్యంగా కెటిఆర్ వాడుతున్న భాష జుగప్సాకరంగా ఉంది. ప్రత్యేక తెలంగాణ ఆవిర్భవించా క అధికారం చేబూనిన కల్వకుంట్ల కుటుంబం అసలు ప్రజలను మనుషులగా చూడలేదు. తెలంగాణను తమ సొంత జాగీరుగా భావించారు. ఆడిందే ఆటగా పాలన సాగించారు. అధికారంలో ఉండి లక్షలాది మంది ఉద్యమకారుల త్యాగాలను, ఆశయాలను తుంగలో తొక్కారు. అధికారాన్ని అడ్డంపెట్టుకుని తమ సామాజిక వర్గపు వారి సంక్షేమానికే ప్రాధాన్యం ఇచ్చారు. పోలీసులు,ఇతర అవినీతి అధికారుల అండదండలతో ప్రజాధనాన్ని, హైదరాబాద్ చుట్టుపక్కల ఉన్న వేలాది ఎకరాల భూములను కుటుంబ సభ్యులు, సమీప బంధువులు, కుటుంబానికి వత్తాసు పలికిన నాయకులకు పంచిపెట్టడం జరిగింది. కాళేశ్వరం మొదలు అనేక విషయాల్లో జరిగిన అవినీతి చూస్తుంటే ఎంతగా తెగించారా అని అర్థం అవుతోంది. ఎసిబి దాడులు, ఇడి విచారణలు, కొనసాగుతున్న దర్యాప్తులతో కళ్లు చెదిరిపోతున్నాయి. వందలకోట్లు అధికారులే వెనకేసుకుంటే ఇక అసలు నాయకులు ఎంత వెనకేసుకున్నారో ఊహించుకోవచ్చు. అంతెందుకు ఫార్మూలా కేసులో డబ్బులు నేరుగా దాటించిన కెటిఆర్ బరితెగించి మాట్లాడుతున్నారు. లొట్టపీసు కేసు అని అంటున్నారు. అంటే ఎంతగా డబ్బు మదం ఉంటే ఇలా మాట్లాడగలరో అర్థం చేసుకోవాలి. ఇలా లొట్టపీసు కేసు..ఏం పీక్కుంటారో పీక్కోండి అని అనడం ఎంతవరకు సబబో చెప్పాలి. ఎపిలో జగన్ కూడా ఇలాగే నా వెంట్రుక కూడా పీకలేరు అని అనడం చూశాం. ఇలా మంత్రులుగా, సిఎంగా చేసిన వ్యక్తులు మాట్లాడాల్సిన భాషేనా అని ప్రజలు నిలదీసే రోజులు తప్పకుండా వస్తాయి. రావాలి కూడా. అనేక ప్రభుత్వ శాఖలలో కుటుంబ సభ్యులు చేసిన అక్రమాలను ఒక్కొక్కటిగా వెలికితీస్తున్న అనేక దర్యాప్తుల విషయాలను సోషల్ మీడియా ప్రజలకు తెలియజేయడం తప్పు ఎలా అవుతుంది.? తాము అధికారంలో ఉన్నప్పుడు ప్రజలపై మీడియా సంస్థలపై ప్రతిపక్షాలపై నిఘా, నియంత్రణ, అణచివేత కొనసాగిన విషయం కేటీఆర్ మర్చి పోయి ఉంటాడు. అందుకే అసహనంతో విమర్శలు చేసే క్రమంలో ఉచ్ఛనీచాలు మరచి మాట్లాడుతున్నారు. అధికారం ఉన్నప్పుడు తెలంగాణ నీళ్లు పంపిణీ చేసి రాయలసీమను రతనాల సీమను చేస్తామని ప్రకటించారు. ఇప్పుడేమో సిఎం రేవంత్ రెడ్డి బాబుకు నీళ్లు దానం చేశారని విమర్శలు చేస్తున్నారు. మేడిగడ్డమీద చర్చ పెడతామంటారు. సవాళ్లు విసరుతారు. నిజానికి ప్రభుత్వాలు, ప్రతిపక్షాలు ఉన్నవి సవాళ్లు విసరడానికా లేక పాలన సాగించడానికా అన్నది ప్రజలు చర్చించాలి. ఆనాటి ముఖ్యమంత్రి జగన్ రెడ్డిని కాళేశ్వరం ప్రారంభోత్సవానికి పిలవడం చూశాం. ఆయన ప్రమాణస్వీకారానికి అమరావతి వెళ్లి సంబురాలు చేసుకోవడం చూశాం. మంత్రి రోజా ఆహ్వానాన్ని అందుకొని నగరి సందర్శించి ఆతిథ్యం పుచ్చుకోవడం కూడా చూశాం. ఇవన్నీ మరచిపోయిన కెటిఆర్, హరీష్ రావులు ఇప్పుడు ఇష్టానుసరాంగా వ్యంగ్యాలు పలుకుతున్నారు. కేవలం ఒక కుటుంబం అధికారానికి, అక్రమాస్తుల కోసం, అహంకారానికి మాత్రమే తెలంగాణ సాధించామా అన్న బాధ కలుగుతోంది. ఇకనైనా తెలంగాణ ప్రజల భాషను, నిజాయితీ, సంస్కృతి, మంచితనం పాటిస్తే మంచిది. జగన్ కూడా తనతండ్రి వైఎస్ లాగా హుందాగా ఉండడం నేర్చుకోవాలి. భాషను తిట్టడానికి ఉపయోగించరాదు. ఇరుపార్టీల నేతలు హుందాగా ప్రతిపక్ష బాధ్యతలు నెరవేర్చాలి. ప్రభుత్వ తప్పులను ఎత్తి చూపాలి. ప్రజలకు మేలుచేసేలా చర్యలు ఉండాలి. ప్రతిపక్ష పాత్రను క్రమశిక్షణతో,బాధ్యతగా నిర్వహించినప్పుడే ప్రజలు ఆదరిస్తారని గుర్తించి మసలుకుంటే మంచిది.


# నాటో బెదిరింపులు




ప్రపంచాన్ని తన ఆధీనంలో ఉంచుకునేందుకు అమెరికా పాలకవర్గం ఎంతకైనా తెగిస్తుందన్నది కమ్యూనిస్టులకు ఎప్పుడో తెలుసు. అయినప్పటికీ అమెరికా అంటే వ్యతిరేకం గనుక వారు అలాగే చెబుతారులే అని పట్టించుకోనివారికి ఇప్పుడు తత్వం తలకెక్కుతోంది. ఇదొక శుభపరిమాణం. భాగస్వాములు, మిత్రులు అని చెబుతూనే తన కనుసన్నల్లో నడవాలని అనేక దేశాల మీద ఒత్తిడి తెస్తున్న అమెరికా ఇప్పుడు మిలిటరీ కూటమి నాటోను కూడా రంగంలోకి తీసుకురావటం మరింత ప్రమాదకరం. తన వ్యవహారాలేవో తాను చూసుకోకుండా అమెరికా రాజకీయ, ఆర్థిక ప్రయోజనాలకోసం అది హద్దులు దాటింది. ఉక్రెయిన్ మీద రష్యా మిలిటరీ చర్యను ఆపాలంటే భారత్, చైనా, బ్రెజిల్ ఒత్తిడి తెచ్చి పుతిన్‌ను శాంతి ఒప్పందానికి తీసుకురావాలట. యాభై రోజుల్లో పోరు ముగించక పోతే దానితో వాణిజ్య లావాదేవీలు జరిపే దేశాలపై వంద శాతం సుంకాలు విధిస్తానన్న ట్రంప్ బెదిరింపు తర్వాత, అతగాడితో భేటీ జరిపి బుధవారంనాడు నాటో ప్రధాన కార్యదర్శి మార్క్ రూటే అదే పల్లవి అందుకున్నాడు.

ఇతర దేశాలను బెదిరించే ముందు చేతనైతే ఐరోపా యూనియన్ దేశాలతో రష్యా ఇంధన కొనుగోలు ఆపివేయించాలి. ఉక్రెయిన్ వివాదంలో భారత్, చైనా, బ్రెజిల్ తటస్థంగా ఉన్నాయి. దానికి భిన్నంగా ఐరోపా ఒక చేత్తో జెలెన్‌స్కీకి గతేడాది 22బిలియన్ డాలర్ల మేర ఆయుధాలు అందచేసింది. మరో చేత్తో రష్యా నుంచి 25బిలియన్ డాలర్ల మేర చమురు, గ్యాస్ కొనుగోలు చేసింది. భారత్, చైనా చమురు కొనుగోలు ద్వారా రష్యాకు ఊతమిచ్చి పరోక్షంగా ఉక్రెయిన్ మీద దాడిని సమర్థిస్తున్నాయంటున్న పెద్దలకు ఐరోపా చేస్తున్నదేమిటో కనిపించటం లేదా ? ఉక్రెయిన్ సంక్షోభానికి ముందు ఐరోపా తన అవసరాలకు రష్యా నుంచి 45శాతం గ్యాస్ తెచ్చుకొనేది, ఇప్పుడు 19 శాతానికి తగ్గించుకుంది.మిలిటరీ చర్య కొనసాగితే 2027 నాటికి పూర్తిగా నిలిపి వేస్తామని చెబుతున్నది. తాము విధించిన ఆంక్షలను తామే ఉల్లంఘించి మూడో దేశం ద్వారా ఇప్పటికీ రష్యన్ చమురు ఉత్పత్తులను దిగుమతి చేసుకుంటున్న ఐరోపా సిగ్గుమాలిన చర్య గురించి తెలియనిదెవరికి? హంగరీ, స్లోవేకియా వంటి దేశాలు ఆంక్షలను వ్యతిరేకించి నేరుగా దిగుమతి చేసుకుంటున్నాయి. ఫ్రాన్స్, ఆస్ట్రియా, స్పెయిన్, గ్రీస్, ఇటలీ గణనీయమొత్తంలో చమురు దిగుమతి చేసుకుంటూ రష్యా కోశాగారాన్ని నింపుతున్న సంగతి నాటో నేతకు తెలియదా? అదరగొండితనం గాకపోతే వారు చేస్తే సంసారం, మిగతావారు చేస్తే మరొకటా? ఉక్రెయిన్ సంక్షోభాన్ని పరిష్కరించాలన్న చిత్తశుద్ధే ఉంటే ఉక్రెయిన్‌కు నాటో సభ్యత్వ తీర్థపు అజెండాను పక్కన పెడితే చాలు. దానికి బదులు ఇప్పటి వరకు ఆత్మరక్షణకు ఇస్తున్నామన్న ఆయుధాలను ఎదురుదాడులకూ విస్తరింపచేస్తామని చెప్పటాన్ని ఏమనాలి. అసలు విషయం ఏమంటే రష్యా, చైనాలను కట్టడి చేయాలి, వాటిని దెబ్బతీయాలన్న దుష్ట సంకల్పం దీనికి మూలం.రష్యాపై ఆంక్షల అనుమతి చట్టం 2025పేరుతో రిపబ్లికన్ పార్టీ సెనెటర్లు ఒక బిల్లును ప్రవేశపెట్టారు. దాని ప్రకారం రష్యాతో ఇంధనంతో సహా ఇతర కొనుగోళ్లు చేసే దేశాలపై 500శాతం సుంకాలను విధించేందుకు ట్రంప్‌కు అధికారాన్ని కట్టబెడతారు. ఒక వైపు ఇలాంటి చర్యలకు పాల్పడుతూ మరోవైపు ఇతర పద్దతులనూ అమెరికా వినియోగిస్తున్నది.చైనాతో వాణిజ్య లావాదేవీలు, ఇతర ఒప్పందాలను కొనసాగిస్తే శ్రీలంక వస్తువుల దిగుమతులపై అధిక సుంకాలు విధిస్తామని అమెరికా చేసిన బెదిరింపును ప్రభుత్వం తిరస్కరించింది. అక్కడ ఉన్నది వామపక్ష ప్రభుత్వం గనుక ట్రంప్ బెదిరింపులను బహిరంగ పరచింది. గుట్టుగా ఉంచుతున్న దేశాల సంగతేమిటి ? ఆధిపత్యాన్ని సొమ్ము చేసుకోవటం, వాణిజ్య దౌత్యం పేరు ఏదైనా యావత్ ప్రపంచం ఇలాంటి వాటిని ఖండించాలి. తమ ప్రయోజనాలను ఫణంగా పెట్టి ఇతర దేశాలతో ఒప్పందాలు కుదుర్చుకుంటే సహించేది లేదని,ఇలాంటి వాటిని గమనంలో ఉంచుకొనే కొద్ది వారాల క్రితం ట్రంప్‌ను చైనా హెచ్చరించింది. అదేదో చైనాతో అమెరికా పంచాయితీ మనకు ఉండదులే అని ఎవరైనా అనుకుంటే తప్పులో కాలేసినట్లే.విభజించి పాలించే నీతి గురించి వేరే చెప్పనవసరం లేదు. చైనాతో సంబంధాలను వదులుకొనేది లేదు, మరింతగా పెంచుకుంటామంటూ ఒక చిన్న దేశం శ్రీలంక చూపిన ధైర్యాన్ని కొనియాడాల్సిందే. దీన్నుంచి మనదేశం ఏమైనా నేర్చుకుంటుందా?

# విశ్వం వాయిస్
అవినీతిపై- అక్షరసమరం...



కాకినాడ తూర్పు గోదావరి
డా బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ


శుక్రవారం 18 జూలై 2025




www.viswamvoice.com

# ఇసు'కాసురుల ఇష్టారాజ్యం





మండలంలో మహా జోరుగా ఇసుక మాఫియా హెూరు
అనుమతి లేని అక్రమ నిలువలతో, ప్రభుత్వాదాయానికి గండి
ప్రజా ప్రతినిధుల అండతో మూడు లారీలు, ఆరు గుట్టలుగా సాగుతున్న ఇసుక దందా..

రాయవరం,విశ్వంవాయిస్ న్యూస్,రిపోర్టర్:

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, పేద,మధ్యతరగతి,సామాన్య ప్రజలకు ఉచిత ఇసుక పధకం ను అమలు చేయడమే కాక, సీనరేజీ వంటి నామమాత్రపు రుసుములను సైతం తగ్గించి, ప్రతి పేదవాడికి సొంత ఇంటి కలను సాకారం చేసి, సామాన్యులకు అండగా ఉండాలని ప్రభుత్వం యోచించి, అక్రమాలు జరగకుండా ప్రత్యేక బుకింగ్ విధానం ద్వారా ఎంతగా ప్రయత్నిస్తున్నప్పటికీ.! అక్రమార్కులు మాత్రం ఇసుకను భారీగా సమీకరిస్తూ, దొరికిన అవకాశాలను అందిపుచ్చుకుని, కాసులు సంపాదించడం లో ఏ మాత్రం వెనుకాడడం లేదు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా మండల కేంద్రమైన రాయవరంలో కొంతమంది వ్యక్తులు ప్రజా ప్రతినిధుల అండతో, రాత్రి వేళల్లో మండల వ్యాప్తంగా అందరినీ సమన్వయ పరుచుకుంటూ, పలు చోట్ల తమకు అనుకూలమైన, చాటుగా ఉన్న ప్రాంతాల్లో, భారీగా వందల టన్నుల ఇసుకను కోటల మాదిరి దంపులు గా ఏర్పాటు చేసుకొని, గుట్టు చప్పుడు కాకుండా దాచారు. ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు నదుల్లో నీటి ఉధృతి పెరిగి, నదులలో ఇసుక త్రవ్వకాలకు ప్రభుత్వం అనుమతులు నిలిపి వేసినప్పుడు, దందా ప్రారంభించి, అక్రమంగా ఇసుక వ్యాపారం చేస్తూ,ఒక్కొక్క ట్రాక్టర్ ఇసుకను రూ.3,000, నుంచి రూ.5,000, వరకూ విక్రయిస్తూ, అక్రమ ఆర్జనతో, ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. ప్రశ్నించిన వారిపై ప్రజా ప్రతినిధులు సైతం ఆరోపణలు చేస్తూ, అక్రమార్కులకు కొమ్ము కాయడం చూస్తుంటే, అక్రమార్జనలో వారికి భాగము ఉందని స్పష్టమవుతోంది. దీనికి తోడు మండలంలో పోలీసులు, రెవిన్యూ, గనుల శాఖ అధికారుల తనిఖీలు లేకపోవడంతో, యదేచ్ఛగా గడచిన వేసవి లో అక్రమ మట్టి తవ్వకాలు జరిపి, మట్టిని ఇటుక బట్టీ లకు, ఇతరులకు అమ్ముకుని సొమ్ము చేసుకుని సేల్స్ టాక్స్ ద్వారా ప్రభుత్వానికి రావలసిన ఆదాయానికి సైతం ఎసరు పెట్టగా, ప్రస్తుతం ఇసుక అక్రమ నిల్వల దందా ద్వారా అధిక ధరలకు ఇసుకను విక్రయించి, ప్రభుత్వానికి అక్రమార్కులు నష్టం కలిగిస్తున్నప్పటికీ, ప్రజల పక్షాన నిలబడవలసిన ప్రజాప్రతినిధులు అవకాశవాదులు గా మారి అక్రమార్కులకు అండగా నిలబడడంతో, మూడు గుట్టలు, ఆరు లారీలు గా ఇసుక మాఫియా దందా సాఫీగా సాగుతూ, లాభాలు తెచ్చిపెడుతుందని ప్రజలు చర్చించుకుంటున్నారు.



## చిన్నమ్మను ఊరిస్తున్న మూడు పదవులు!

### ఏదో ఒకటి ఫిక్స్

పురందేశ్వరి కి కీలక బాధ్యతలు..
బిజెపి మోర్చా మహిళ నేతగా పురందేశ్వరి..
పురందేశ్వరుని కేంద్రమంత్రిగా తీసుకోవాలని బిజెపి ఆలోచన...
డిప్యూటీ స్పీకర్ గా పురందేశ్వరి పేరును పరిశీలిస్తున్న కేంద్రం..


తూర్పుగోదావరి జిల్లా, విశ్వం వాయిస్ న్యూస్

ఏపీ బీజేపీ చీఫ్ పదవి నుంచి తప్పుకున్న రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరికి కేంద్రంలో కీలక పదవి దక్కనుందని ప్రచారం జరుగుతోంది. ఆమె పేరును మూడు పదవుల కోసం పరిశీలిస్తున్నారని చెబుతున్నారు. ఆ మూడు పదవుల్లో ఏదో ఒకటి కచ్చితంగా పురందేశ్వరికి కేటాయిస్తారని కమలం నేతలు భావిస్తున్నారు. పురందేశ్వరి కుటుంబ నేపథ్యంతోపాటు ఆమె సామర్థ్యం, పాలన దక్షతా, గతంలో కేంద్ర మంత్రిగా పనిచేసిన అనుభవాన్ని పరిగణలోకి తీసుకుంటున్న కేంద్రం అన్ని చూసుకుని సముచితమైన పదవి కేటాయించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని అంటున్నారు. ఇప్పటికి మూడు సార్లు పార్లమెంటు సభ్యురాలిగా ఎన్నికైన పురందేశ్వరి గత ఏడాది ఏపీలో జరిగిన ఎన్నికల్లో టీడీపీతో పొత్తు కుదిరేలా కీలకంగా పనిచేశారని అంటున్నారు. ఆమె వ్యూహాలతోనే గత ఎన్నికల్లో రాష్ట్రం నుంచి రికార్డు స్థాయి విజయాలు దక్కించుకున్నట్లు బీజేపీ పెద్దలు భావిస్తున్నట్లు చెబుతున్నారు. అంతేకాకుండా గతంలో కేంద్ర మంత్రిగా, బీజేపీ మహిళా మోర్చా నేతగా పనిచేసిన పురందేశ్వరికి కీలక బాధ్యతలు అప్పగిస్తే దక్షినాదిలో పార్టీ బలం పుంజుకుంటుందని ఊహిస్తున్నారు. ఉత్తరాదిలో హవా చాటుకుంటున్న బీజేపీకి దక్షిణాదిలో మాత్రం పలు రాష్ట్రాలు కొరకరాని కొయ్యగా కనిపిస్తున్నాయని అంటున్నారు. దీంతో పార్టీని దక్షిణాదిలో బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని భావిస్తున్న బీజేపీ జాతీయ నేతలు ఈ ప్రాంతానికి చెందిన నేతలను ప్రోత్సహించాలని నిర్ణయానికి వచ్చారంటున్నారు. ఈ దిశగానే పురందేశ్వరికి కీలక బాధ్యతలు అప్పగించాలనే ప్రతిపాదన తెరపైకి వచ్చిందని అంటున్నారు. సాధారణంగా బీజేపీ అధ్యక్ష బాధ్యతలను ఆర్ఎస్ఎస్ నేపథ్యం ఉన్నవారికే ఎక్కువగా కేటాయిస్తారు. కానీ, పురందేశ్వరి విషయంలో ఆ సూత్రానికి మినహాయింపు ఇవ్వడం వల్ల గత ఎన్నికల్లో విజయం దక్కిందని బీజేపీ నేతలు చెబుతున్నారు. ఈ క్రమంలోనే పురందేశ్వరి పేరును జాతీయ పార్టీ అధ్యక్షురాలిగా పరిశీలిస్తున్నట్లు చెబుతున్నారు. ఈ దఫా పార్టీ అధ్యక్ష పదవిని దక్షిణాదికి కేటాయించడంతోపాటు మహిళా నేతను ఎంపీక చేయాలని బీజేపీ అగ్రనాయకత్వం దాదాపు నిర్ణయించిందని అంటున్నారు. దీంతో పురందేశ్వరి పేరు ప్రముఖంగా పరిశీలిస్తున్నారని అంటున్నారు.



పురందేశ్వరితోపాటు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, తమిళనాడుకు చెందిన వనతి శ్రీనివాసన్ పేర్లు పరిశీలిస్తున్నారు. అయితే నిర్మలా సీతారామన్ ను మంత్రి వర్గం నుంచి తప్పించి పార్టీ పదవికి తీసుకోవడం కన్నా, మంచి వాగ్దాటి ఉన్న పురందేశ్వరిని ఎంపిక చేయడమే బెటర్ అన్న చర్చ ఆ పార్టీలో జరుగుతోందని అంటున్నారు. అయితే పురందేశ్వరి పేరును ఆర్ఎస్ఎస్ నాయకత్వం వ్యతిరేకిస్తే ప్రత్యామ్నాయంగా చిన్నమ్మకు కేంద్ర మంత్రి వర్గంలోకి తీసుకోవాలనే ప్రతిపాదన కూడా ఉందంటున్నారు. కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం ఏర్పడి పూర్తవడంతో త్వరలో మంత్రివర్గాన్ని విస్తరిస్తారని ప్రచారం జరుగుతోంది. పార్టీ అధ్యక్ష పదవి లేదంటే కేంద్ర మంత్రిగా పురందేశ్వరిని తీసుకోవడం ఖాయమంటున్నారు. ఇక ఇదే సమయంలో చాలా కాలంగా ఖాళీగా ఉన్న డిప్యూటీ స్పీకర్ పదవికి పురందేశ్వరి పేరు పరిశీలిస్తున్నట్లు చెబుతున్నారు. వాస్తవానికి లోక్ సభ ఎన్నికల అనంతరం పురందేశ్వరిని స్పీకర్ చేస్తారని ప్రచారం జరిగింది. కానీ, అప్పట్లో స్పీకర్ ను మార్చకుండా ఓం బిర్లాకు రెండోసారి కొనసాగింపు నిచ్చారు. ఈ పరిస్థితుల్లో 2019 నుంచి ఖాళీగా ఉన్న డిప్యూటీ స్పీకర్ పదవిని పురందేశ్వరితో భర్తీ చేస్తారని అంటున్నారు. ఏదైనా సరే త్వరలో చిన్నమ్మకు మంచి పదవి దక్కనుందని బీజేపీ వర్గాల సమాచారం.

## తండ్రిని మరిపించేలా అడుగులు..
## టీడీపీ యువ ఎంపీకి పదవి రెడీ?





అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్

గత పార్లమెంటు ఎన్నికల్లో 16 సీట్లు గెలిచిన టీడీపీ.. కేంద్రంలో కీలక పాత్ర పోషిస్తోంది. మంత్రివర్గంలో రెండు పదవులను తీసుకోవడంతోపాటు కీలకమైన స్పీకర్, డిప్యూటీ స్పీకర్ పదవులను కూడా తీసుకుంటుందని ప్రచారం జరిగింది. అయితే చివరి క్షణంలో ఏమైందో కానీ, ఆ రెండు పదవులు టీడీపీకి దక్కలేదు. కానీ, డిప్యూటీ స్పీకర్ పదవి ఇప్పటికీ ఖాళీగా ఉంది. దీంతో ఈ పదవిని టీడీపీలో ఓ యువ పార్లమెంటు సభ్యుడికి కట్టబెడతారని తాజాగా ప్రచారం జరుగుతోంది.అమలాపురం నుంచి తొలిసారి ఎంపీగా ఎన్నికైన గంటి హరీష్ మాధుర్ తన పనితీరుతో కేంద్ర పెద్దలను ముఖ్యమంత్రి చంద్రబాబును మెప్పిస్తున్నారని చెబుతున్నారు. ఎంపీ హరీశ్ మాధుర్ తండ్రి గతంలో లోక్ సభ స్పీకరుగా పనిచేశారు. హెలికాప్టర్ ప్రమాదంలో ఆయన దురదుష్టవశాత్తూ మరణించిన విషయం తెలిసిందే. స్పీకర్ గా బాలయోగి రెండు సార్లు పనిచేయగా, ఆయన మరణానంతరం దాదాపు 23 ఏళ్లు అమలాపురం సీటు ఆ కుటుంబానికి దూరమైంది. 2014లో టీడీపీ తరఫున ఎంపీగా పోటీ చేసిన హరీశ్ మాధుర్ తొలిసారి ఓటమి చెందగా, 2024 ఎన్నికల్లో మాత్రం ఘన విజయం సాధించారు. ఇక ఆయన ఎంపీగా గెలిచిన తర్వాత మంత్రి పదవి ఇస్తారని, డిప్యూటీ స్పీకర్ చేస్తారని పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. అయితే ఏ అవకాశం దక్కకపోయినా ఎంపీగా సమర్థంగా పనిచేస్తూ అటు కేంద్ర పెద్దల వద్ద, ఇటు సొంత పార్టీలోనూ గుర్తింపు తెచ్చుకున్నారని అంటున్నారు. ప్రజా సమస్యలపై తక్షణమే స్పందించడం, వివాదాలకు దూరంగా ఉండటం, విమర్శలపైనా తగిన సమయంలో స్పందిస్తూ సమయస్ఫూర్తి ప్రదర్శిస్తూ ఎంపీ హరీశ్ మాధుర్ అందర్నీ ఆకట్టుకుంటున్నారని అంటున్నారు. ఢిల్లీ పాలిటిక్స్‌లోనూ అనుభవం గడిస్తున్న ఎంపీ హరీశ్ మాధుర్ నియోజకవర్గ సమస్యలను ఆకళింపు చేసుకుంటూ ప్రజలకు చేరువ అవుతున్నట్లు ప్రశంసలు అందుకుంటున్నారు. గతంలో ఆయన తండ్రి జీఎంసీ బాలయోగి ఏవిధంగా ప్రజలకు అందుబాటులో ఉండేవారో ఇప్పుడు అచ్చం అలానే హరీశ్ పనిచేస్తున్నారని చెబుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమాలను ప్రచారం చేయడం, తన పరిధిలో ఎమ్మెల్యేలతో కలిసి సాగడంలోనూ హరీశ్ భేష్ అన్న టాక్ వినిపిస్తోంది. ఇక టీడీపీ యువనేత నారా లోకేష్ టీంలో సభ్యుడిగా క్రియాశీలంగా పనిచేస్తుండటం వల్ల ఆయనకు త్వరలో పదవీ యోగం ఉందని టాక్ వినిపిస్తోంది.

## 36కోట్లతో నరసన్న ఆలయఅభివృద్ధి పనులు-బత్తుల.

-పురావస్తు,రాజకీయ ప్రముఖులు రోప్ వే పరిశీలన.



**కోరుకొండ విశ్వం వాయిస్ న్యూస్:** కోరుకొండ స్వయంభు శ్రీ లక్ష్మీ నరసింహ స్వామివారి ఆలయానికి రోప్ వే నిర్మాణానికి గల పరిస్థితులను పురావస్తుశాఖ అధికారులు ఎన్డిఏ నాయకులు పరిశీలించినట్లు రాజానగరం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ తెలిపారు. గురువారం కాపవరం పాండవుల కొండ నుండి నరసన్న ఆలయానికి రోప్ వే నిర్మాణానికి క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించారు. పురావస్తుశాఖ త్వరలోనే సానుకూల పరిస్థితులు తెలియజేయ వచ్చు అన్నారు.శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయ అభివృద్ధి పనులకు 36కోట్లతో త్వరలోనే టెండర్స్ పిలుస్తా మన్నారు.కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు నరసన్న ఆలయాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి చిత్తశుద్ధితో ఉన్నాయన్నారు.ఈ పుణ్యక్షేత్రానికి 0.25 కిలోమీటర్ల మేర ఆలయం కింద భాగం నుండి ఆలయ శిఖరాగ్రం వరకు రోప్ వే, ఆలయ అభివృద్ధి పనులు పూర్తిచేసే బాధ్యత ఎన్డిఏ కూటమి ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో రాజమహేంద్రవరం పార్లమెంట్ సభ్యురాలు దగ్గుపాటి పురందేశ్వరి, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, భాజపా జిల్లా అధ్యక్షులు పిక్కి నాగేంద్ర, రాజానగరం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ, పురావస్తుశాఖ అధికారులు, ఎన్డిఏ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కార్పొరేషన్ ఎన్నికలు యధావిధిగా జరపాలి

- స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి
- అభ్యర్థుల ఎంపికకు త్వరలో కమిటీలు
- జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు డాక్టర్ టి.కే విశ్వేశ్వరరెడ్డి వెల్లడి



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్:** నవంబర్, డిసెంబర్ నెలల్లో స్థానిక సంస్థలకు ఎన్నికలు జరిగే అవకాశం ఉన్నందున ఆ మేరకు నగరంలోని 52 వార్డులకు అభ్యర్థులను ఎంపిక చేసేందుకు కమిటీలు ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు డాక్టర్ టి.కే విశ్వేశ్వర రెడ్డి చెప్పారు.గురువారం స్థానిక మున్సిపల్ కాలనీ లోని జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల రాష్ట్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ వెల్లడించిన మాటల ప్రకారం మరో 3 నెలలు లేదా ఆరు నెలల్లో ఎన్నికలు జరిగే అవకాశం ఉందని తెలిపారు.గ్రామాలను విలీనంపై కోర్టు స్టే ఉన్న స్థానాలను పక్కను పెట్టి మిగిలిన వాటికి యథాతథంగా ఎన్నికలు జరపాలని సిఎం చంద్రబాబు చెప్పినట్లు మంత్రి వెల్లడించారని విశ్వేశ్వర రెడ్డి గుర్తు చేశారు.రాజమండ్రి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న 52 వార్డులకు ఇన్ చార్జులను వేస్తామని చెప్పారు.నగర కమిటీ అధ్యక్షుడు అబ్దుల్లా షరీఫ్, కార్యదర్శి పట్నాల శ్రీనివాస్ , జిల్లా ఉపాధ్యక్షులు దేవత సుధాకర్ లతో ఎన్నికల కమిటీని వేసి, ఆ వివరాలను పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల కు పంపి, వారి సలహాలు,సూచనలతో ఎన్నికల కమిటీని నియమిస్తామని చెప్పారు.వచ్చే సంవత్సరం ఫిబ్రవరి లోపుగా గ్రామ పంచాయతీ ఎన్నికలు జరిగే అవకాశం ఉందని తెలిపారు.ఈ ఎన్నికల కోసం అసెంబ్లీ కో- ఆర్డినేటర్, మండల ప్రెసిడెంట్లు బాధ్యత తీసుకుని అభ్యర్థుల జాబితా తయారు చేయాలని కోరారు. నగర పాలక మండలి, గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు జిల్లా కాంగ్రెస్ ఆధ్వర్యంలో శిక్షణ నిర్వహిస్తామని చెప్పారు.ఈ శిక్షణ కార్యక్రమాలకు మాజీ ఎంపీ లు,ఉండవల్లి అరుణ్ కుమార్, జి.వి.హర్ష కుమార్ విచ్చేస్తారని తెలిపారు.ఎన్నికల విషయంలో కుంటు గుర్రాలను పక్కన పెట్టి,రేసు గుర్రాలకు ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు.విలేకరుల సమావేశంలో పీసీసీ జనరల్ సెక్రటరీ అరిగెల అరుణ కుమారి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మార్టిన్ లూథర్ , నగర కాంగ్రెస్ కార్యదర్శి పట్నాల శ్రీనివాస్,జిల్లా ఐఎన్టీయుసి అధ్యక్షులు జేటీ రామారావు, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మోతా శారద, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మోతా శారద, బెజవాడ రంగారావు, డాక్టర్ వడయార్,బిల్డర్ బాబీ, కాటం రవి, జాలా నటరాజ్, తదితరులు పాల్గొన్నారు.

## సాధన మహిళా మండలి ఆధ్వర్యంలో అంగన్వాడి పిల్లలకు ప్లేట్లు ఆట వస్తువులు పంపిణీ





**సీతానగరం విశ్వం వాయిస్ న్యూస్:** సీతానగరం మండలం పురుషోత్తపట్నం ఎస్సీ కాలనీలో గల అంగనవాడి కేంద్రంలో, సాధన మహిళా మండలి అభివృద్ధి ప్రదాత, స్వాతంత్ర్యమునకు పూర్వమే ప్రధానోపాధ్యాయులుగా పనిచేసిన కీర్తిశేషులు తాతపూడి సుందర్రావు జయంతి కార్యక్రమం జరిగినది. ఈ కార్యక్రమం సందర్భంగా కేకు కట్ చేసి, అంగన్వాడి ప్రీ స్కూల్ పిల్లలకు ప్లేట్లు, స్నాక్స్ బాక్సులు, వాటర్ బాటిల్స్, స్వీట్స్ బహుమతిగా అందించడం జరిగినది.ఈ కార్యక్రమంలో సాధన చైర్మన్ పి సుజ్ఞాన కుమారి, అంగన్వాడీ టీచర్ పుట్ట రామలక్ష్మి, అంగన్వాడి ఆయా రామలక్ష్మి, గర్భిణీలు బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

## నరసన్న ఆలయాన్ని టీటీడీ దత్తతకు చర్యలు - బత్తుల.

-త్వరలో నరసన్న సేవా కమిటీ.



**కోరుకొండ విశ్వం వాయస్ న్యూస్:** కోరుకొండ స్వయంభు శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయాని తిరుమల తిరుపతి దేవస్థానం దత్తత తీసుకుని ఆలయాన్ని అభివృద్ధి చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు రాజానగరం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ తెలిపారు. గురువారం గ్రామస్తుల ఆధ్వర్యంలో నరసన్న ఆలయం అనేక సమస్యలతో కొట్టుమిట్టాల దుతుందని, సమస్యలను పరిష్కరించే విధంగా అన్నవరం దేవస్థానం ఈవో కెవిఎస్ చౌదరితో చర్చించి, పలు సమస్యలను తక్షణమే పరిష్కరించాలన్నారు. నరసన్న ఆలయం క్రింద నుండి కొండ పైవరకు విద్యుత్ దీపాలు, ఆలయం నుండి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు లౌడ్ స్పీకర్లు, పారిశుద్ధ్యం, ప్రసన్న భక్తులకు అన్న వితరణ వంటి సమస్యలను తక్షణమే పరిష్కరించాలన్నారు. వీటి పర్యవేక్షణకు త్వరలోనే నరసన్న సేవా కమిటీని ఏర్పాటు చేసి, ఆలయానికి రాష్ట్రవ్యాప్తంగా మరింత ప్రాచుర్యం చెందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. త్వరలో పుష్కరాల నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, దేవాదాయశాఖ మాత్యులు ఆనం రామనారాయణతో చర్చించి ఆలయ అభివృద్ధికి మరిన్ని నిధులు తెస్తామన్నారు. ఈ కార్యక్రమంలో శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ, ఎన్డిఏ నాయకులు అడ్డాల శ్రీను, కిమిడి శ్రీరామ్, బదిరెడ్డి దొర, తస్సీరు తాతాజీ, ఎంపీడీవో బత్తిన అశోక్ కుమార్, ఎర్రంశెట్టి పోలారావు, సర్పంచ్ కర్రీ లక్ష్మీసరోజ గణేష్, కటకం చలం, పుప్పాల వెంకటరత్నం, కోర్పు రామకృష్ణ, అన్నవరం దేవస్థానం అధికారులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## బూత్ లెవెల్ అధికారులకు ఎలక్టోరల్ మేనేజ్మెంట్ శిక్షణ కార్యక్రమం





**చింతూరు డివిజన్ విశ్వం వాయిస్ న్యూస్:** అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం (ఎస్.టి) శాసనసభ నియోజకవర్గంలో బూత్ లెవెల్ ఆఫీసర్ల (blio)కు ఎన్నికల జాబితా నిర్వహణ (ఎలక్టోరల్ మేనేజ్మెంట్)పై శిక్షణ కార్యక్రమం ఐటీడీఏ కార్యాలయంలో గురువారం కొనసాగింది.ఈ శిక్షణ కార్యక్రమం ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ మరియు సబ్ కలెక్టర్ శ్రీ అపూర్వ భరత పర్యవేక్షణలో నిర్వహించబడినది. ఈ శిక్షణ భారత ఎన్నికల సంఘంకు అనుబంధ సంస్థ అయిన ఇండియా ఇంటర్నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ డెమొక్రసీ అండ్ ఎలక్షన్ మేనేజ్మెంట్ (IIIDEM) ఆదేశాల మేరకు దేశవ్యాప్తంగా నిర్వహించబడుతోంది.మూడోవ రోజు బ్యాచ్ నెం:3గా కొనసాగింది. ఇందులో 60 మంది బూత్ లెవెల్ ఆఫీసర్లు పాల్గొన్నారు. ప్రతి రోజూ 60 మంది చొప్పున, మొత్తం 3 బ్యాచ్‌లుగాలో శిక్షణ కొనసాగించబడినది. మొత్తం 180 BLO ల కోసం ఈ శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేయబడింది.ఈ శిక్షణ కార్యక్రమంలో EDM శ్రీ వి.నగేష్వరియ మాస్టర్ ట్రైనర్(ALMT) శ్రీ సుధా ప్రకాష్ పాల్గొని మార్గనిర్దేశం చేశారు.

## ఇంగ్లీష్ గెస్ట్ లెక్చరర్ పోస్టు కొరకు దరఖాస్తుల ఆహ్వానం



**చింతూరు డివిజన్ విశ్వం వాయిస్ న్యూస్:** స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల చింతూరు నందు ఖాళీగా ఉన్న ఇంగ్లీష్ పోస్టుకు అతిధి అధ్యాపకుల ప్రాతిపదికన భర్తీ చేయాలని ఇంటర్మీడియట్ విద్యాశాఖ కమిషనర్ ఆదేశాలు ఇవ్వడం జరిగింది.సంబంధిత సబ్జెక్ట్ నందు పోస్ట్ గ్రాడ్యుయేషన్ లో 50% శాతం మార్కులతో ఉత్తీర్ణత కలిగి ఉండాలని, బోధనా అనుభవం ఉన్న వారికీ ప్రాధాన్యత ఉంటుందని, అదేవిధంగా పదవి విరమణ పొందిన ప్రిన్సిపల్స్,జూనియర్ లెక్చరర్స్,స్కూల్ అసిస్టెంట్స్, ప్రొఫెసర్స్ కూడా దరఖాస్తు చేసుకోవచ్చని కళాశాల ప్రిన్సిపాల్ కే.రమేష్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు.పూర్తి వివరాలకు కొరకు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ని సంప్రదించాలని తెలిపారు.

## ప్రజలందరు మోటార్ సైకిల్ వాహనం నడిపే సమయంలో హెల్మెట్ ను ధరించవలెను.

- హెల్మెట్ ధరించని వారికి కొత్త మోటార్ వెహికల్ చట్టం ప్రకారం జరిమానా తప్పదు
- హెల్మెట్ ధరించడంపై స్పెషల్ డ్రైవ్ లు
- కొన్ని ఫేక్ మెసేజ్లు చూసి నమ్మవద్దు
- ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ మహమ్మద్ నబి





**రాజమహేంద్రవరం,విశ్వం వాయిస్ న్యూస్:** చాలామంది ప్రజలు అవగాహన లేకపోవడం వలన, కొన్ని సోషల్ మీడియాలో ఫ్లాట్ ఫామ్లలో పట్టణ,మున్సిపాలిటీ,కార్పొరేషన్ ప్రాంతాల్లో హెల్మెట్ అవసరం లేదని కొన్ని ఫేక్ మెసేజ్లు చూసి హెల్మెట్ అవసరం లేదు అని అపోహతో ఉన్నారు. అటువంటి అవాస్తవాలు నమ్మవద్దని మోటార్ సైకిల్ నడిపే ప్రతివ్యక్తి కచ్చితంగా హెల్మెట్ ధరించాలని లేనిచో జరిమానా విధించబడుతుందని నగర ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ మహమ్మద్ నబి అన్నారు.దీనిలో భాగంగానే తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్ ఆదేశాల ప్రకారం రోడ్డు ప్రమాదాలు అరికట్టాలని ఉద్దేశంతో మరియు తూర్పుగోదావరి ప్రజల భద్రతను దృష్టిలో పెట్టుకొని జిల్లా ట్రాఫిక్ పోలీస్ వారు ప్రతిరోజు హెల్మెట్ ధరించడంపై స్పెషల్ డ్రైవ్ లు నిర్వహిస్తున్నారు.ప్రతిరోజు హెల్మెట్ ధరించని వాహనదారులకు కొత్త మోటార్ వెహికల్ చట్టంపై అవగాహన కల్పిస్తూ మరియు హెల్మెట్ ధరించని వారికి కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నారు. అంతేకాక రాజమహేంద్రవరం పట్టణంలో ప్రవేశించే అన్ని రోడ్ల నందు ట్రాఫిక్ పోలీస్ వారు హెల్మెట్ ధరించడం పై అవగాహన ఫ్లెక్సీలను మరియు విధించబడే జరిమానాను తెలియజేసే విధంగా అన్ని రోడ్ల నందు ఫ్లెక్సీలను కూడా ఏర్పాటు చేసి ప్రజలకు హెల్మెట్ పై అవగాహన కల్పిస్తున్నారు.

## గ్రామాల్లో గ్రామీణ వైద్యుల సేవలు చాలా ఉపయోగం

-ఆర్ఎంపీల సేవలను వినియోగించుకునేలా ప్రభుత్వ దృష్టికి తీసుకుని వెళ్తా



**కర్నూలు,విశ్వం వాయిస్ న్యూస్:** కర్నూలు నగరంలోని బిర్లా గేట్ ప్రక్కన ఉన్న లక్ష్మీ కళ్యాణమండపం నందు ఉమ్మడి కర్నూలు జిల్లా (కర్నూలు, నంద్యాల) గ్రామీణ వైద్యుల మహాసభ డాక్టర్ కేజీ గోవింద రెడ్డి అధ్యక్షతన ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా తెలుగుదేశం పొలిట్ బ్యూరో సభ్యులు మాజీ ఎమ్మెల్సీ టీజీ జనార్దన్,మంత్రి టీజీ భరత్, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యామ్ బాబు,పాణ్యం ఎమ్మెల్యే చరిత,గుడివాడ మాజీ మేయర్ వరప్రసాద్ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీజీ జనార్దన్ మాట్లాడుతూ ఈ రోజు గ్రామాల్లో గ్రామీణ వైద్యుల సేవలు చాలా ఉపయోగపడుతున్నాయని వారి సేవలు వినియోగించుకునేలా ప్రభుత్వ దృష్టికి తీసుకుని వస్తానని తెలియజేసారు.మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ గ్రామాల్లో గ్రామీణ వైద్యుల పైన అపారమైన నమ్మకం ఉంటుందని మీ సేవలు కచ్చితంగా ప్రభుత్వం వినియోగించుకునేలా మా వంతుగా సహకరిస్తామని తెలిపారు. ఎమ్మెల్యేలు శ్యాంబాబు,గౌరు చరితలు మాట్లాడుతూ గ్రామీణ నేపథ్యంలో గ్రామీణ వైద్యుల గురించి మాకు పట్టుపై అవగాహన ఉందని అవకాశాన్ని బట్టి అసెంబ్లీలో కూడా మీయొక్క సేవలను ప్రస్తావిస్తూ మీ గుర్తింపుకు కచ్చితంగా మా వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. డాక్టర్ గోవిందరెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో గ్రామీణ వైద్యులు ప్రథమ చికిత్స చేస్తూ పేద ప్రజలకు సేవ చేస్తున్నారని ఒక ఉమ్మడి రాష్ట్రాలలోనే దాదాపు అర్థ వేలకు పైగా గ్రామీణ వైద్యులు ఉన్నారని అవసరమైతే దేశ వ్యాప్తంగా ఉన్న ఆర్ఎంపీ, పీఎంపీ ల సమస్యల పరిష్కార సాధనకు సహకరిస్తామని సభాముఖంగా తెలిపారు. ఈ కార్యక్రమంలోగ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు రాధాకృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఎస్ రాజు,రాష్ట్ర ప్రచార కార్యదర్శి వర్ల దస్తగిరి,ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు వీటీటీ రాజు,రొక్కం నాగేశ్వరరెడ్డి, బళ్ళా శ్రీనివాసరావు, తోరాటి ప్రభాకరరావు,శేష సాయి, ఎమ్ జయరామ్,ఆర్ఎంపీ కర్నూలు జిల్లా కార్యదర్శి ప్రభాకరరెడ్డి,కోశాధికారి రఘునాథరెడ్డి, జిల్లా నాయకులు నరసింహ, ఉస్మాన్,నంద్యాల జిల్లా కార్యదర్శి సురేష్ బాబు, కోశాధికారి సురేంద్ర, సహాయ కార్యదర్శి నాగేశ్వరరావు లతో పాటు ఉమ్మడి కర్నూలు జిల్లా నలుమూలల నుండి సుమారు మూడు వేల మంది ఆర్ఎంపీలు హాజరయ్యారు.

## జంతువుల సంరక్షణ కోసం సొసైటీలను అన్ని జిల్లాల్లో ఏర్పాటు చేయాలి.





- జంతు హింస నివారణ చట్టాల అమలులో అలసత్వం ఉండరాదు.
- ఎస్ పి సి ఏ నియమాలను పాటించకుంటే కోర్టు ధిక్కరణ చర్యలు.
- ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధికారుల సమావేశంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత.

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్:** జంతువులపై హింసను నివారించడానికి సొసైటీలను ఏర్పాటు చేయాలన్న నిబంధనలను తప్పక పాటించాలని తూర్పు గోదావరి జిల్లా ప్రధానన్యాయమూర్తి గంధం సునీత అన్నారు. రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం & రాష్ట్ర న్యాయ సేవల సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవల సంస్థ ఆధ్వర్యంలో గురువారం ఎస్ పి సి ఏ (జంతువులపై హింస నివారణ కోసం సొసైటీల ఏర్పాటు, నియంత్రణ) నియమాలపై తూర్పుగోదావరి, కాకినాడ, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాల అధికారులతో జిల్లా కోర్టు ప్రాంగణంలో ఆమె సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత మాట్లాడుతూ...జంతువుల సంరక్షణ కోసం తప్పనిసరిగా సొసైటీలను, షెల్టర్ లను ఏర్పాటు చేయాలన్న హైకోర్టు ఆదేశాలను అమలు చేయాలన్నారు. కొన్ని జిల్లాలలో సొసైటీలు, షెల్టర్ లు లేకన్న విషయం తమ దృష్టికి వచ్చిందని, ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం వీటి ఏర్పాటుపై దృష్టి సారించాలని చెప్పారు. వీటి కోసం అవసరమైన భూమి, నిధులు కేటాయించాల్సిందిగా ఆయా జిల్లాల కలెక్టర్లకు లేఖ రాయనున్నట్లు తెలిపారు. సొసైటీల వివరాలు, వాటి ద్వారా సంరక్షించబడిన జంతువుల సంఖ్య తదితర సమాచారాన్ని ప్రతినెల డి ఎల్ ఎస్ ఏ కు పంపాలన్నారు. హైకోర్టు తీర్పు లో సూచించిన జంతు సంరక్షణ చర్యలను తప్పక తీసుకోవాలన్నారు. చర్యలు చేపట్టకుండా ఉదాసీనత ప్రదర్శిస్తే కోర్టు ధిక్కరణ చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. జంతువులకు కూడా హక్కులు ఉంటాయని, వాటిని తరలించేటప్పుడు పశుగ్రాసం, నీరు తప్పక అందించాలని చెప్పారు. వాహనాలలో కనీసం కదిలే అవకాశం కూడా లేకుండా, పరిమితికి మించి జంతువులను తరలించడం క్రూరత్వం కిందకు వస్తుందన్నారు. ఇలావ అక్రమంగా జంతువులను తరలిస్తున్న వారిపై కేసులు నమోదు చేయాలని పోలీస్, రవాణా శాఖలకు సూచించారు. రక్షించిన జంతువులను సంరక్షించడం సంబంధిత శాఖల బాధ్యత అని చెప్పారు.పట్టణాలలో జంతువులను రోడ్లపై విడిచిపెట్టరాదని యజమానులకు సూచించారు. గాయపడిన జంతువుల చికిత్స కోసం అంబులెన్సులు ఉన్నాయని, దీనికై 1962 నంబర్ ను సంప్రదించాలని చెప్పారు.ఈ కార్యక్రమంలో డిఎల్ఎస్ఏ కార్యదర్శి ఎన్. శ్రీలక్ష్మి, ఏసీబీ కోర్టు జడ్జి ఎల్ వెంకటేశ్వర రావు, తూర్పు గోదావరి, కాకినాడ, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలకు చెందిన, రంపచోడవరం రెవెన్యూ డివిజన్, పోలీసు, రవాణా, పశుసంవర్థక, సమాచార %c% పౌర సంబంధాలు, వాణిజ్య పన్నులు, పంచాయతీ, అటవీ, మార్కెటింగ్, పురపాలక శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఇ-వేస్ట్ మేనేజ్ మెంట్ పై అవగాహన,వ్యర్థాల సేకరణ డ్రైవ్



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్:**
స్థానిక ఆర్యాపురం నారాయణ స్కూల్లో ఇ-వేస్ట్ మేనేజ్ మెంట్ పై అవగాహన, వ్యర్థాల సేకరణ కార్యక్రమం నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ శైలజ తెలిపారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్, ఎన్విరాన్మెంట్, ఎస్. డబ్ల్యూఎస్ అనుభవజ్ఞులు -సీనియర్ అఫీసర్ సైదా సిద్ధిక్ టబుసం ఈ డ్రైవ్ ని ప్రారంభించి పోస్టర్ ను ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థులకు ఇ-వేస్ట్ మేనేజ్మెంట్ పైనా వ్యర్థాల సేకరణపైనా అవగాహన కల్పించారు. నారాయణ విద్యా సంస్థల రాజమండ్రి జోనల్ ఏ.జి.యం. అలీషా మాట్లాడుతూ నారాయణ విద్యా సంస్థలు ఎప్పుడూ నూతన ఆవిష్కరణకు నూతన పద్దతులు ఆచరిస్తామని చెప్పారు. ఇ- వేస్ట్ సేకరణ, అవగాహనలో తల్లితండ్రులు భాగం కావాలని విజ్ఞప్తి చేశారు. ఇది తమ సాఫ్ట్ స్కిల్స్ విభాగం తీసుకున్న న్యూ ఇనిషియేటివ్ అని ఆయన చెప్పారు.ఈ కార్యక్రమంలో జోనల్ కో-ఆర్డినేటర్ గోపి నాయుడు, సాఫ్ట్ స్కిల్స్ పాన్ ఇండియా విభాగాధిపతి వేదవతి,సాఫ్ట్ స్కిల్స్ విభాగాధిపతి రాధాకృష్ణ, దివ్య, డీన్ ,ఏ.ఓ , ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

## గీతాపరివార్ సంస్థ 5 వ వార్షికోత్సవం సందర్భంగా సామూహిక గీతా పారాయణం




**కొత్తపేట ఆత్రేయపురం జూలై 17. విశ్వం వాయిస్ న్యూస్.**
ర్యాలి శ్రీ జగన్మోహిని కేశవ & గోపాల స్వామి వారి దేవస్థానం నందు 2025.07.19.శనివారం ఉదయం 8.30 న గీతాపరివార్ సంస్థ 5 వ వార్షికోత్సవం సందర్భంగా సామూహిక గీతా పారాయణం జరుగుతుంది.గీతాపరివార్ సంస్థ ప్రపంచ వ్యాప్తంగా 180 దేశాల లో ఆన్లైన్ ద్వారా ఉచితంగా భగవద్గీత పద్దెనిమిది అధ్యాయాలు శుద్ధ పఠనం శిక్షణ ఇస్తుంది.గీతాపరివార్ ద్వారా రోజు కు నలభై నిముషాలు చొప్పున ఫోన్ లో అందరూ నేర్చుకోవచ్చని గీతాపరివార్ సభ్యులు ర్యాలి రామగోపాల్, ర్యాలి సుబ్బలక్ష్మి, గట్టి బ్రహ్మాజీ తెలిపారు. సదరు సామూహిక గీతా పారాయణం నందు గ్రామస్థుల, భక్తులు కార్యక్రమంలో పాల్గొని తీర్థ, ప్రసాదములు స్వీకరించవలసినదిగా కోరుచున్నాము అని కార్యనిర్వాహణాధికారి తెలియజేశారు.

## కూటమి ప్రభుత్వం ఎన్నికలు హామీలను విస్మరించింది

రాజ్యసభ సభ్యులు బోస్




**రామచంద్రపురం నియోజకవర్గం విశ్వం వాయిస్ న్యూస్ :-**
రామచంద్రపురం వైఎస్ఆర్సిపి పట్టణ అధ్యక్షులు గాదంశెట్టి శ్రీధర్ అధ్యక్షతన బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని వైయస్ ఆర్ సిపి రామచంద్రాపురం పట్టణ కార్యాలయంలో నిర్వహించారు.ఈ కార్యక్రమనికి రామచంద్రపురం నియోజకవర్గ ఇంచార్జ్ మరియు అంబేద్కర్ కోనసీమ జిల్లా యువజన విభాగ అధ్యక్షులు పిల్లి సూర్యప్రకాష్,రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్ర బోస్ ముఖ్య అధితులుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఇరువురు మాట్లాడుతూ మాట్లాడుతూ ప్రజలకు వాస్తవాలను తెలియజేసి, కూటమి ప్రభుత్వం మోసపూరిత హామీల పట్ల ప్రజలందరినీ అప్రమత్తంగా ఉండాలని తెలియజేశారు. అలానే ఈ కార్యక్రమం వార్డుల స్థాయిలో కూడా విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో రామచంద్రపురం నియోజకవర్గ పరిశీలకులు కుడుపూడి శ్రీనివాస్ రావు,మున్సిపాలిటీ చైర్మన్ గాదంశెట్టి శ్రీదేవి,జిల్లా అధికార ప్రతినిధి పెమ్మిరెడ్డి మురళి,మరియు కౌన్సిలర్స్,సీనియర్ నాయకులు మరియు కార్యకర్తలు,అభిమానులు హాజరయ్యారు.

# చంద్రన్న పాలన పై హర్షం వ్యక్తం చేస్తున్న రాజమండ్రి రూరల్ ప్రజలు

-కొంతమూరు గ్రామంలో "సుపరిపాలనలో తొలిఅడుగు" కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే గోరంట్ల..
-కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరిస్తూ, కరపత్రాలను పంపిణీ





**రాజమహేంద్రవరం రూరల్, విశ్వం వాయిస్:**
సూపర్ సిక్స్ పథకాలను ఒక్కొక్కటిగా కూటమి ప్రభుత్వం అమలు చేస్తుందని, ప్రజలు మెచ్చే విధంగా రాష్ట్రంలో చంద్రన్న పాలన కొనసాగుతుందని, రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి పేర్కొన్నారు. గురువారం ఉదయం రూరల్ మండలం స్థానిక కొంతమూరు గ్రామం నందు గ్రామ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమానికి హాజరై ఇంటింటికి వెళ్లి, ప్రజల అభిప్రాయాలను తెలుసుకుని, కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరిస్తూ, కరపత్రాలను పంపిణీ చేశారు. గ్రామం నందు ప్రజలు గోరంట్లకు ఘన స్వాగతం పలికి, సంవత్సర కాల పరిపాలనపై హర్షం వ్యక్తం చేస్తూ నీరాజనాలతో సంతృప్తిని తెలిపారు. ఆ సందర్భంగా ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత, కోలమూరు పంచాయతీ నందు కోట్లాది రూపాయలతో అనేక రోడ్లు, డ్రైనేజీలు పూర్తి చేసామని, అలాగే మరికొన్ని పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. రాష్ట్రంలో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తూనే, అభివృద్ధిలో కూడా ముందుకు వెళ్తున్నామని తెలిపారు. భారతదేశంలో ఏ రాష్ట్రంలో కూడా లేని విధంగా పేద ప్రజలకు అనేక సంక్షేమ కార్యక్రమాలు అందిస్తున్నామని, 4 వేల రూపాయల నుండి 15 వేల రూపాయల వరకు అనేక రకాల పింఛన్లు పేద ప్రజలకు కూటమి ప్రభుత్వం ఇస్తుందని, ఉచిత గ్యాస్ సిలిండర్ పథకాన్ని అందించామని, అలాగే తల్లికి వందనం పేరుతో ఇంటిలో ఎంతమంది చదువుకునే పిల్లలు ఉన్న అంతమందికి కూడా ఒక్కొక్కరికి 13 వేల రూపాయలు తల్లుల ఖాతాలకు జమ చేశారని, 2000 రూపాయలు స్కూల్స్ నందు మెరుగైన సదుపాయాలు కల్పించేందుకు వినియోగిస్తున్నారని అన్నారు.రైతులను ఆదుకునేందుకు త్వరలో కేంద్ర ప్రభుత్వ సహకారంతో రైతులకు 20వేల రూపాయలు అందిస్తామని, అలాగే త్వరలో మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని కూడా అమలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల తెదేపా అధ్యక్షులు మత్సేటి ప్రసాద్, గ్రామ కమిటీ అధ్యక్షులు పిన్నమరెడ్డి ఈశ్వరుడు, రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి మజ్జి పద్మావతి, టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ వాసిరెడ్డి రాంబాబు, యామన నారాయణ గౌడ్, ఉండవల్లి బంగార్రాజు, తాడేపల్లి నాగరాజు, అడ్డాల శ్రీను, నున్న క్రిష్ణ, కురుకూరి కిషోర్, మైనారిటీ నాయకులు షేక్ ఖాసిమ్ , ఉమర్, గోక శ్రీను, బత్తిన రత్నంరాజు, వూడిమూడి సుదీర్, షేక్ సుల్తానా, అంగర చిన్నారావు, పాలడుగుల శ్రీనివాసరావు తదితర కూటమి నాయకులు పాల్గొన్నారు.

# భవిష్యత్తు తరాలకు భవిష్యత్తు కల్పించాలి

- ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్
- ఆగస్టు 21న రాజమండ్రి ఎంట్రపెన్యూర్ సమిట్-2025
- ఆదిరెడ్డి శ్రీనివాస్ చేతులమీదుగా పోస్టర్ ఆవిష్కరణ




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్:**
యువతే మన భవిత... భవిష్యత్తు తరాలకు భవిష్యత్తు కల్పించాలని యోచనతో వచ్చే నెల 21వ తేదీన రాజమండ్రి ఎంట్రపెన్యూర్ సమిట్ -2025 నిర్వహిస్తున్నట్లు రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) చెప్పారు. హెూటల్ లా హాస్పిన్ లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఈ సమిట్ కు సంబంధించిన ఫోస్టర్ ను విద్యాశాఖ అధికారులు, విద్యా సంస్థల ప్రతినిధులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ వరల్డ్ ఎంట్రపెన్యూర్ డే ను పురస్కరించుకుని ఉభయగోదావరి జిల్లాల యువత భవిష్యత్తుకు ఉపయోగపడే విధంగా ఈ సమిట్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమం తమ భవానీ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో తమ సొంత ఖర్చుతో నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. యువత కోసం కూటమి ప్రభుత్వం ఇప్పటికే డీఎస్సీ, కానిస్టేబుల్ పరీక్షలు నిర్వహించిందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు గుర్తు చేశారు. తనను ఎమ్మెల్యేగా అత్యధిక మెజారిటీతో గెలిపించిన రాజమండ్రి ప్రజలకు ముఖ్యంగా యువతక కోసం ఎబిసిటి ప్రోగ్రాం, స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమం నాలుగు నెలలకు ఒక బ్యాచ్ నిర్వహిస్తున్నామని మొదటి బ్యాచ్ 43 మందిలో 23 మందికి రూ. 6 లక్షల ప్యాకేజీతో మంచి ఉద్యోగ అవకాశాలు లభించాయని ఆయన చెప్పారు. అలాగే స్కిల్ ఆన్ వీల్స్ ప్రోగ్రాం, మెగా డీఎస్సీ అభ్యర్థులకు మాక్ టెస్టులు నిర్వహించి వారికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని నిరంతరం యోచిస్తున్నట్లు ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ చెప్పారు. రాజమండ్రిని ఇంక్యూబేషన్ హబ్ గా తీర్చిదిద్దడానికి రాజమండ్రికి రతన్ టాటా ఇంక్యూబేషన్ సెంటర్ అడిగామని త్వరలో వస్తోందని ఆయన చెప్పారు. రాజమండ్రి ఇంట్రపెన్యూర్ సమిట్ ద్వారా ఐడియా పిచ్ కాంపిటీషన్స్ నిర్వహించి మంచి ఆలోచనతో ప్రెజెంట్ చేసిన ముగ్గురికి నగదు బహుమతులను, ఉత్తమ ప్రతిభ కనబరిచిన మరో ముగ్గురకి రతన్ టాటా ఇంక్యూబేషన్ సెంటర్లో అవకాశం కల్పిస్తామని ఆయన హామీ ఇచ్చారు. యువత కోసం చేపడుతున్న ఈ సమిట్ ను ఐటి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రోత్సాహిస్తున్నారని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు చెప్పారు. కేజీ నుంచి పీజీ వరకు అందరూ వచ్చి తమ ఆలోచనలను పంచుకోవాలని ఆయన కోరారు. సమిట్ కోసం విద్యా సంస్థల ప్రతినిధులు, విద్యాశాఖ అధికారులు సహకారం అందిస్తున్నారని ఆయన చెప్పారు.

**-బైక్ లతో అమ్మాయిలను ఇబ్బంది పెట్టే ఆకతాయిల భరతం పడతాం**

నగరంలోని వీధుల్లో కాని, విద్యాసంస్థల వద్దకాని బైక్ లు రైజ్ చేస్తూ అమ్మాయిలను ఇబ్బంది పెట్టే ఆకతాయిల భరతం పడతామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) హెచ్చరించారు. కూటమి సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో 44వ వార్డు మల్లికార్జుననగర్ లో ఇంటింటికీ వెళ్లినప్పుడు ఒక అమ్మాయి ధైర్యంగా ముందుకు వచ్చి ఈ సమస్య చెప్పిందని, ప్రస్తుతం ఆ యువకుడి బైక్ త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ లో ఉందని,అతడి తలిదండ్రులతో కూడా మాట్లాడడం జరిగిందని ఆయన వివరించారు. తాను భరోసా ఇచ్చిన తర్వాత కూడా ఆ అమ్మాయిల జోలికి వెళితే ఊరుకునేది లేదని ఆయన హెచ్చరించారు. అలాగేమూడు విద్యా సంస్థల వద్ద అమ్మాయిలను ఏ టైంలో ఇబ్బంది పెడుతున్నారనేది తెలుసుకుని చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరినట్లు ఆయన చెప్పారు. నగరంలో మహిళలను ఇబ్బంది పెడితే చర్యలు తీవ్రంగా ఉంటాయని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ వార్నింగ్ ఇచ్చారు.

**స్వచ్ఛ సర్వేక్షణలో రాజమండ్రికి ఏపీలో 2వ, దేశంలో 19వ స్థానం ఇది**
**ప్రజల విజయం వారి సహకారంతోనే సాధ్యమైంది**

స్వచ్ఛ సర్వేక్షణలో రాజమండ్రికి రాష్ట్రంలో 2వ స్థానం, దేశంలో 19వ స్థానం రావడం పట్ల ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) హర్షం వ్యక్తంచేశారు. దీనికి కృషి చేసిన రాజమండ్రి నగరపాలక సంస్థ ఉద్యోగులు, ముఖ్యంగా పారిశుద్ధ్య కార్మికులకు ఆయన అభినందనలు తెలిపారు. తాను ఆరోగ్య రాజమండ్రి డిక్లరేషన్ ప్రకటిస్తే చాలా మంది ఇదేంటన్నట్లుగా చూశారని, తాను ఎమ్మెల్యే అయిన తర్వాత ఎప్పటికప్పుడు కాలువలో పూడిక తీయించడం, డ్రైనేజీ వ్యవస్థపై ప్రత్యేక దృష్టి సారించి అవసరమైన చోట కాలువలు నిర్మించడం, నగరంలోని వీధులు, రోడ్లు పరిశుభ్రంగా ఉండేలా ఏడాదిగా చర్యలు చేపట్టామని ఆయన అన్నారు. దాని ఫలితమే రాజమండ్రికి స్వచ్ఛ సర్వేక్షణలో రాష్ట్రంలో రెండో ర్యాంకు, దేశంలో 19వ ర్యాంకు వచ్చిందని, ఇది ప్రజల విజయమని, ప్రజలు సహకరించడంవల్లే ఇది సాధ్యమైందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. మీడియా సమావేశంలో ఏపీ శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమార్, నాయకులు దొండపాటి సత్యంబాబు, వర్రే శ్రీనివాస్, నక్కా చిట్టిబాబు, మజ్జి రాంబాబు, బుడ్డిగ రాధా, రెడ్డి మణేశ్వరరావు, ఉప్పులూరి జానకి రామయ్య, కంటిపూడి శ్రీనివాస్, కొయ్యల రమణ, మొకమాటి సత్యనారాయణ, బుడ్డిగ రవి, దాస్యం ప్రసాద్, వివిధ కళాశాల కరస్పాండెంట్లు తదితరులు పాల్గొన్నారు.




## మండెల శ్రీరామమూర్తిని పరామర్శించిన జెడిఆర్ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి మేడా శ్రీనివాస్, జిల్లా సభ్యులు.

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్:**
తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం రూరల్ బొమ్మూరులోని మురళి కొండలో నివసిస్తున్న సీనియర్ పాత్రికేయులు ది రాజమండ్రి ప్రెస్ క్లబ్ గౌరవ అధ్యక్షులు మండెల శ్రీరామమూర్తిని జెడిఆర్ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి మేడా శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి డివివిఎస్ఎన్ మూర్తి, తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు పెంకే శ్రీనివాస్ పరామర్శించారు. ఇటీవల వారి ప్రథమ కుమార్తె తేజస్వి హఠాన్మరణం చెందడంతో సోకసముద్రంలో ఉన్న శ్రీరామ మూర్తిని పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. తేజస్వి తన భర్త హరిచంద్ర ప్రసాద్ తో యానం వస్తుండగా నీలపల్లి ఎక్సైజ్ చెక్ పోస్ట్ వద్ద అస్వస్థకు గురయ్యారు. మండుటెండలో ప్రయాణం చేయడం వల్ల దాహంతో మంచినీళ్లు అడగగా వెంటనే వారి భర్త మంచినీళ్లు తాగిస్తుండగా గుండెపోటు రావడంతో అక్కడికక్కడే కుప్పకూలిపోయారు. వెంటనే హాస్పిటల్ కు తీసుకు వెళ్ళగా అప్పటికే మృతి చెందారని వైద్యులు నిర్ధారించారు. తమ కుమార్తె విషాద ఘటన తెలిసిన వెంటనే శ్రీరామ మూర్తి తమ కుటుంబ సభ్యులతో యానం చేరుకోని తన కుమార్తెను చూసిన వెంటనే భోరున విలపించారు. సోమవారం యానం నుండి బొమ్మూరులోని మురళికొండ లోని తమ నివాసానికి తేజస్వి భౌతికకాయాన్ని తరలించారు. మంగళవారం రాజమహేంద్రవరం లోని రోటరీ కైలాసభూమిలో తేజస్విని అంత్యక్రియలు జరిగాయి. ఈ విషాద ఘటన తెలిసిన వెంటనే తూర్పుగోదావరి జిల్లా జెడిఆర్ఎఫ్ సభ్యులు, పాత్రికేయ మిత్రులు, రాజకీయ నాయకులు శ్రీరామ్మూర్తిని ఓదార్చారు. జెడిఆర్ఎఫ్ సభ్యులు పిచ్చుక మహేష్, యాకూబ్, యార్లగడ్డ నరేష్ కుమార్, గోడి ప్రసాద్, రాఘవ తదితరులు ఓదార్చిన వారిలో ఉన్నారు.

## ఆ నలుగురు కుటీల రాజకీయాలు మానుకోండి లేదంటే నాలో మరో కోణం చూస్తారు.

- పెందుర్తి అభిరామ్.
-స్థానిక సంస్థల ఎన్నికలు ఉన్నాయి జాగ్రత్త.



**కోరుకొండ విశ్వం వాయిస్ న్యూస్:**
రాజానగరం నియోజకవర్గ ఇన్చార్జ్ బొడ్డు వెంకటరమణ చౌదరి వెనుక ఉన్న ఆ నలుగురు కుటిల రాజకీయాలు మానుకోకపోతే నాలో మరో కోణం చూడవలసి వస్తుందని తెలుగుదేశం పార్టీ నాయకులు పెందుర్తి అభిరామ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం కోరుకొండ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ రాజానగరం నియోజకవర్గ తెదేపా ఇన్చార్జి బొడ్డు వెంకటరమణ చౌదరికి తనకి మంచి సత్సంబంధాలు ఉన్నాయని, ఆయన వెనుక ఉన్న ఆ నలుగురు కుటిల రాజకీయాలు మానుకోకపోతే నాపై చేసిన అసత్య కథనాలకు తగిన సాక్షాలతో కోర్టులోనే తేల్చుకుంటానని ఆగ్రహం వ్యక్తం చేశారు. చేతకాని ఆ నలుగురు అమాయకులైన ఎస్సీ కులస్తులను అడ్డం పెట్టుకొని ఇటువంటి చేతకాని కథనాలు వ్రాయడం వారికే చెల్లిందన్నారు. ఢిల్లీలోనైనా గల్లీలోనైనా తండ్రి పరపతిని ఉపయోగించుకోనని, స్వసక్తిగానే ప్రజలతో మమేకమై నాయకుడిగా ఎదుగుతానన్నారు. చేతనైతే నాపై చేసిన ఆరోపణలు నిరూపించాలని, గతంలో వీరు పెద్దాపురం తదితర నియోజకవర్గాల్లో ఇటువంటి చిల్లర రాజకీయాలే చేశారన్నారు. విద్య, వైద్యానికి పెందుర్తి సేవా సమితి అందరికీ వెన్నుదన్నుగా నిలుస్తుందన్నారు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు ఉన్నాయని, పద్ధతి మార్చుకోకపోతే వారు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని ఘాటుగా హెచ్చరించారు. నియోజకవర్గంలో కాపులను టార్గెట్ చేస్తున్నారని, తెలుగుదేశం పార్టీ ఆరంభం నుండి ఎప్పుడు ఇటువంటి నీచ సంస్కృతి లేదన్నారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు మింగి లక్ష్మీనారాయణ, మట్ట చిన్న వెంకటేశ్వర్లు, కట్టా సత్తిబాబు, పెంటకోట శివ, కోర్పు రాజేష్, సిహెచ్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# ద్రాక్షారామ గ్రామ ప్రజలకు తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారం

**వాటర్ ట్యాంక్ పనులు వేగవంతం చేసిన మంత్రి సుభాష్**

**రామచంద్రపురం విశ్వం వాయిస్ న్యూస్ :-**
మండలం ద్రాక్షారామ గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లోపల జల జీవన్ మిషన్ పనులను సర్పంచ్ కొత్తపల్లి అరుణ పరిశీంచారు. ఈ సందర్భంగా పని పనుల పురోగతిని తెలుసుకున్నారు.ప్రజల తాగునీటి అవసరాలకు రెండు లక్షల లీటర్ల కెపాసిటీ గల వాటర్ ట్యాంక్ నిర్మాణం డూమ్ టైప్ నిర్మాణం పూర్తికావస్తున్నదని,వచ్చే నెలలో దీని నుండి పూర్తిస్థాయిలో ద్రాక్షారామ పలు వార్డులకు పైగా ప్రజలకు త్రాగునీటి సమస్య తీరుతుందని తెలిపారు.ప్రభుత్వ అంచనా మరియు నివేదిక ప్రకారం ప్రతి వ్యక్తికి రోజుకు 55 లీటర్ల నీరు అవసరం అని,గ్రామంలో బండ్ల గేటు ఏరియాలో ఉన్న వాటర్ ట్యాంక్ ఒక లక్ష యాభై వేల లీటర్లు కెపాసిటీ ట్యాంక్ ఒకటే ఉందని,ఇంకొకటి నున్న వారి వీధిలో ఒక లక్ష ఇరవై వేల లీటర్ల ట్యాంకు వున్నా సరిపోవడం లేదన్నారు. అందుకే మూడవ ట్యాంక్ రెండు లక్షల లీటర్ల మంచినీటి ట్యాంక్ నిర్మాణంతో ద్రాక్షారామ గ్రామ ప్రజలకు పూర్తిస్థాయిలో మంచినీటి అవసరాలు తీరుతాయని ఆనందం వ్యక్తం చేశారు. రామచంద్రపురం నియోజవర్గ మంత్రి సుభాష్ కు ఈ జలజీవన్ మిషన్ ట్యాంక్ నిర్మాణం లో జరుగుతున్న జాప్యాన్ని తెలియజేసి ఈ ట్యాంక్ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని కోరిన వెంటనే సంబంధిత అధికారులతోనూ, కాంట్రాక్టర్లతోనూ మాట్లాడి వేరొక కొత్త కాంట్రాక్టర్ కి ఈ పనిని అప్ప చెప్పడం వలన త్వరితగతిన నిర్మాణపు పనులు వేగం పుంచుకున్నాయి. గతంలో సుభాష్ ద్రాక్షారామ డంపింగ్ యార్డ్ కు



రెండు ఎకరాల స్థలం కేటాయించడం లోను, మరియు ఆదివారపు పేట వెళ్ళిదారిలో లేఅవుట్ ఫోర్ నందు సుమారు మూడున్నర కోట్ల రూపాయలతో విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటు చేయడంలోనూ, ముఖ్యంగా భీమేశ్వర స్వామి వారి దేవాలయం ఎదురుగా మార్కెట్లో రథం వీధి వెడల్పు చేసి రెండు వైపులా డ్రైనేజీలతో నూతన సిమెంట్ రోడ్డు నిర్మించడంలోను మంత్రి ఎంతో కృషి చేశారన్నారు.ఆయన చేసిన పనుల్లో మరికొన్ని గ్రామంలో కొన్నిచోట్ల సిమెంట్ రోడ్లు కొన్ని చోట్ల డ్రనేజీలు,మంచినీటి పైపులైన్లు,డబ్ల్యూబిఎం రోడ్లు ఇలా అనేకం ఉన్నాయని తెలియజేసారు.ఇదంతా కేవలం ఒక్క సంవత్సరం కాలంలోనే చేయగలగటం ఆయన సామర్థ్యానికి నిదర్శనం అని ద్రాక్షారామ ప్రజలందరి తరపున గ్రామ సర్పంచ్ గా ఆయనకు అభినందనలు కృతజ్ఞతలు తెలిపారు.

## అంబాజీపేట మార్కెట్ కమిటీ బాధ్యతల స్వీకరణ కార్యక్రమం



**అంబాజీపేట విశ్వం వాయిస్ న్యూస్**
అంబాజీపేట మండలంలోని అంబాజీపేట మార్కెట్ యార్డ్ లో నూతనంగా ఏర్పాటైన మార్కెట్ కమిటీ బాధ్యతల స్వీకరణ కార్యక్రమం ఘనంగా గురువారం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో చైర్మన్ గా చిట్టూరి శ్రీనివాస్ , వైస్ చైర్మన్‌గా కొర్లపాటి వెంకటేశ్వరరావు ఎంపికై, అధికారికంగా తమ పదవులను స్వీకరించారు. అలాగే కమిటీలోని మిగిలిన డైరెక్టర్లుగా నియమితులైన సభ్యులు కూడా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, మార్కెట్ సంబంధిత వ్యాపారస్తులు పెద్ద ఎత్తున హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.ఈకార్యక్రమంలో పి. గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు గిడ్డి సత్యనారాయణ , ముఖ్య అతిథిగా పాల్గొని, నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కమిటీకి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. రైతుల శ్రేయస్సు కోసం మార్కెట్ యార్డును ఒక అభివృద్ధి కేంద్రంగా మార్చే దిశగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆకాంక్ష వ్యక్తం చేశారు. అలాగే ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు రెడ్డి సుబ్రహ్మణ్యం పాల్గొని, నూతన కమిటీకి తన అభినందనలు తెలియజేశారు. కూటమి నాయకులు, కార్యకర్తలు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రజా నాయకులు ఈ సందర్భంగా ఉత్సాహంగా పాల్గొన్నారు. స్థానిక రైతుల సమస్యల పరిష్కారానికి, నూతన కమిటీ నిరంతరంగా కృషి చేస్తుందని, వ్యవసాయ రంగానికి ఇది ఒక శుభసూచకమైన మార్పు అని పలువురు అభిప్రాయపడ్డారు.

## ఘనంగా చోడవరం, ఉండూరు త్రీ మెన్ కమిటీ ప్రమాణ స్వీకారం

**రామచంద్రపురం నియోజకవర్గం విశ్వం వాయిస్ న్యూస్ :-**
అన్నదాత లకు అండగా ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు నిలుస్తాయని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి సుభాష్ తండ్రి సత్యం పేర్కొన్నారు.గురువారం చోడవరం,ఉండూరు సహకార పరపతి సంఘాలకు ఎన్నికైన నూతన పాలక కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార మహోత్సవ త్రీ మెన్ కమిటీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా సత్యం మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో పిఎ సిఎస్ లు రైతులకు అందుబాటులో లేకుండా మరుగున పడ్డాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్ని వ్యవస్థలకు పునర్జీవం తీసుకొచ్చి పూర్తిస్థాయిలో బలోపేతం చేస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం ఈ ఏడాది బడ్జెట్లో వ్యవసాయ రంగానికి రూ.48వేల 402 కోట్లు కేటాయించి రైతులకు అండగా నిలిచిందన్నారు.రైతుల సంక్షేమం,వారి ఆర్థిక పరిపుష్టికి పిఎసిఎస్ లు దోహదపడతాయనటంలో సందేహం లేదన్నారు. దేశానికి వెన్నెముక ఐన రైతాంగాన్ని అన్ని విధాల ఆదుకునేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందన్నారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన మేరకు అన్నదాత సుఖీభవ పథకం కింద రైతుల ఖాతాల్లో త్వరలో నేరుగా సొమ్ము జమ చేస్తామని అన్నారు. గత ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని,రాష్ట్ర ఆర్థిక అభివృద్ధిని పతనం చేశారని విమర్శించారు.పి ఎ సి ఎస్ ల మెరుగైన పనితీరుతో అన్నదాతలకు మేలు జరుగుతుందని ఆకాంక్షించారు. నూతనంగా ఎన్నికైన ఉండూరు,చోడవరం త్రీ మెన్ కమిటీ కార్యవర్గాన్ని వాసంశెట్టి సత్యం గారు ప్రత్యేకంగా అభినందించారు. రైతులకు అందుబాటులో ఉంటూ కూటమి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పలువురు కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొని అభినందనలు తెలియజేశారు.

## నేడు మండలంలోని పలు గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం



**రాయవరం,విశ్వంవాయిస్ న్యూస్,రిపోర్టర్**
డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, రాయవరం మండలంలోని పసలపూడి, చెల్లూరు, వెంటూరు, కురకాళ్ళపల్లి ,కూర్మాపురం, బుట్టాయి పేట తదితర గ్రామాలకు జూలై 18వ తేదీ శుక్రవారం ఉదయం 09:00 గం! నుండి మధ్యాహ్నం 01:00 గం!ల వరకు విద్యుత్ సరఫరా లో అంతరాయం ఏర్పడుతుందని, రామచంద్రపురం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.రత్నాలరావు బుధవారం ప్రకటన ద్వారా తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మత్తులు,చెట్లుకొమ్మలు తొలగించడం, పసలపూడి సబ్ స్టేషన్ పరిధిలో పసలపూడి రూరల్ ఫీడర్, వెంటూరు సబ్ స్టేషన్ పరిధిలో వెంటూరు టౌన్ ఫీడర్, మరమ్మత్తులు, మెయింటనెన్స్ నిమిత్తం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన ప్రకటన ద్వారా కోరారు.

## క్రీడలు ద్వారా మానసిక ఒత్తిడి అధిగమించవచ్చు కలెక్టర్




**అమలాపురం, జిల్లా ప్రతినిధి విశ్వం వాయిస్ న్యూస్ జూలై 17:**
క్రీడా వసతులు కల్పన ద్వారా పోలీసులు (రక్షక బటులు) మానసిక ఒత్తిడిని అధిగమించాలని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ పేర్కొన్నారు. గురువారం సాయంత్రం స్థానిక పట్టణము నందు అశోక్ బ్లెస్సన్ టెన్నిస్ కోర్టును ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఆయన టెన్నిస్ క్రీడలో పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వ హణలో ఉన్న పోలీ సులు విధులు అనంతరం మానసిక ఆరోగ్యాన్ని పని ఒత్తిడిని అధిగమించేందుకు క్రీడావసతులను సద్వినియోగం చేసుకొని ఆహ్లాద కరంగా జీవనాన్ని గడ పాలని ఆయన ఆకాం క్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పోలీస్ సూపరిం టెండెంట్ బి కృష్ణారావు దేవి సీ ఫుడ్స్ సిఎండి పి బ్రహ్మా నందం అడ్మిన్ ఎస్పీ ఏవీఎస్ కెవి ప్రసాద్ డి.ఎస్.పి టిఎస్ఆర్కే ప్రసాద్ ఏ ఆర్ డి ఎస్ పి సుబ్బరాజు మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ వాహనం అంశంపై అసత్య ప్రచారాలు

**సర్పంచ్,వీఆర్వో వ్యవహారంపై మండిపడుతున్న గ్రామస్థులు**

**విశ్వం వాయిస్ న్యూస్ రావులపాలెం**
డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా, రావులపాలెం మండలం కోమరాజులంక గ్రామంలో రేషన్ ఎం.డి.యు వాహనాన్ని కేంద్రంగా చేసుకుని ఇటీవల వైసీపీ కి చెందిన వ్యక్తులు చేస్తున్న అసత్య ప్రచారాలపై గ్రామస్థులు మండిపడుతున్నారు.గ్రామంలో పనిచేస్తున్న సచివాలయం-2కి చెందిన వీఆర్వో నామాల బుల్లిరాజు ఇటీవల సామాజిక మాధ్యమాల్లో చేసిన ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని తేదేపా నాయకులు మండిపడ్డారు.గత వైసీపీ ప్రభుత్వం హయాంలో రేషన్ వాహనం హక్కును బెజవాడ హరిశేషు అనే యువకుడికి అప్పగించారని,ఆయనే అప్పటి నుండి ఈ వాహనాన్ని కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు.అయితే హరిశేషు రేషన్ పంపిణీలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో గ్రామస్తులు అప్పటి తహాశీల్దార్ కు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు. ప్రభుత్వం మారిన తరువాత కూడా హరిశేషు తీరులో మార్పు రాకపోవడంతో చివరికి అతనే స్వచ్ఛందంగా సేవల నుండి తప్పుకుంటానని చెప్పి,ఈ వాహనాన్ని మండేలా విజయకుమార్‌కు అప్పగించినట్టు సమాచారం. విజయకుమార్‌కి నెలవారీ జీతంతో వాహనం అప్పగించగా, నాలుగు నెలల వరకు జీతం కూడా ఫోన్‌పే ద్వారా చెల్లించినట్లు తెదేపా నాయకులు ఆరోపించారు.తర్వాత హరిశేషు జీతం తగ్గిపోవడాన్ని కారణంగా చూపుతూ మళ్లీ వాహనం తిరిగి పొందేందుకు ప్రయత్నిస్తున్నట్లు చర్చనీయాంశంగా మారింది. గ్రామ సర్పంచ్ కర్రి గోవిందు కృష్ణారెడ్డి దీన్ని రాజకీయ లబ్ధి కోణంలో వాడుకోవడానికి



ప్రయత్నించారని తెదేపా నాయకులు ఆరోపించారు. ఆయన హరిశేషుని చేత వివిధ ఆరోపణలు చేయించి, విజయకుమార్ జీతం ఆపివేసేలా ఒత్తిడి తెచ్చినట్టు సమాచారం.ఈ అంశం తహసిల్దార్ దృష్టికి వెళ్లినప్పటికీ, సర్పంచ్ తహసిల్దార్ పట్ల దౌర్జన్యంగా వ్యవహరించినట్టు సమాచారం.వెలిముద్ర మార్పు, అకౌంట్ మార్పు వంటి అధికారిక నిర్ణయాలపై కూడా ప్రశ్నలు తీయడమే కాకుండా, అధికారులపై కేసులు పెడతానని బెదిరింపులకు దిగినట్టు చెప్తున్నారు. వీఆర్వో బుల్లిరాజు సమక్షంలో జరిగిన విషయాలన్నింటిని పక్కన పెట్టి, అసత్య ప్రచారాల్లో మునిగిపోయారని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.గ్రామస్థులు ఈ వ్యవహారంపై జిల్లా అధికారులు సుముఖంగా స్పందించి, నిజానిజాలు బయటపెట్టి బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

## రాజ్యాధికారం పొందేలా బీసీ లు చైతన్యం కావాలి

-రాజకీయ పార్టీలు బిసిలను ఓటు బ్యాంకు లా వాడుకుంటున్నాయి
-రావులపాలెం లో ఘనంగా బిసిల ఆత్మీయ సమావేశం
-ముఖ్య అతిథిగా పాల్గొన్న బీసీవై పార్టీ అధినేత బోడే రామచంద్ర యాదవ్




**రావులపాలెం, విశ్వంవాయిస్ న్యూస్**
డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా మండల కేంద్రమైన రావులపాలెం లో గల సి ఆర్ సి నందు మట్ట వీరబాబు గౌడ్ ఆద్వర్యంలో బీసీల ఆత్మీయ సమావేశ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత తీన్మార్ వాయిద్యముల తో, బాణాసంచా కాల్పులు మద్య ర్యాలీగా బయలుదేరి సి.ఆర్.సి వేదిక చేరుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బోడె రామచంద్ర యాదవ్ విచ్చేసి బీసీలను ప్రతి పార్టీ కూడా ఓటు బ్యాంకుగా చూస్తున్నారని, ఎటువంటి అభివృద్ధి బీసీల్లో లేదని, యువతకు ఉద్యోగ కల్పనలో గవర్నమెంట్ పూర్తిగా విఫలమైందని తెలియజేశారు. బీసీలందరి నీ సంఘటితం చేసి బీసీల హక్కులను కాపాడుకోవడం కోసమే బీసీవై పార్టీ పుట్టిందని తెలియజేశారు. ప్రతి ఒక్క బీసీ చైతన్యవంతంగా ఉండి రాబోయే రోజుల్లో బీసీలు రాజ్యాధికారం చేపట్టేలా పోరాడాలని, తద్వారా బీసీలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతారని సూచించారు. అనంతరం విందు భోజనాల తో సమావేశం ముగించారు. ఈ సమావేశంలో పెరవలి వెంకటేశ్వరరావు, మట్టపర్తి సూర్యచంద్రరావు , వెలుగొట్ల త్రిమూర్తులు ,కోనసీమ జిల్లా యాదవ సంఘం అధ్యక్షులు బర్ల శ్రీనివాస్ యాదవ్, కొత్తపేట నియోజకవర్గ యాదవ సంఘం అధ్యక్షులు గంగుల వీరబాబు, కోనసీమ జిల్లా కోకన్వీనర్ మట్ట సోమరాజు, తదితర నాయకులు కార్యకర్తలు అన్ని వర్గాల బీసీలు మహిళా కార్యకర్తలు,నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి ని దర్శించుకున్న భారత చైతన్యయువజన పార్టీ అధ్యక్షుడు



**కొత్తపేట ఆత్రేయపురం జూలై 17 విశ్వం వాయిస్ న్యూస్.**కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని భారత చైతన్య యువజన పార్టీ అధ్యక్షులు బోడె రామచంద్ర యాదవ్ దర్శించుకున్నారు. గురువారం వాడపల్లి వచ్చిన ఆయనకు దేవస్థానం సిబ్బంది స్వాగతం పలికారు. రామచంద్ర యాదవ్ స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి దర్శనం అనంతరం పండితులు ఆయనకు వేదాశీర్వచనం అందించారు అని డిప్యూటీ కమిషనర్ మరియు ఆలయ కార్యనిర్వహణ అధికారి నల్లం చక్రధరరావు తెలియజేశారు.

## జాతీయ రహదారి ముఖ్య కూడలిలో ట్రాఫిక్ సిగ్నల్ బోర్డులు ఏర్పాటు




**ఆలమూరు (విశ్వం వాయిస్ న్యూస్):**
ఆలమూరు మండలం పరిధిలో 216 నెంబర్ జాతీయ రహదారిపై డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కొనసీమ జిల్లా ఎస్పీ, కొత్తపేట డి.ఎస్.పి, రావులపాలెం రూరల్ సీఐ ఆదేశాల మేరకు ఆలమూరు ఎస్సై నరేష్ జాతీయ రహదారి జొన్నాడ జంక్షన్ కూడలిలో ట్రాఫిక్ సిగ్నల్ నిబంధనలు తెలిపే పోలీస్ కటౌట్లను ఏర్పాటు చేశారు. జాతీయ రహదారిపై నిత్యం గస్తీ ఉంటుందని, వేగం కంటే ప్రాణం ముఖ్యమని నిర్ణీత వేగంతో రహదారిపై ప్రతి వాహనదారుడు ప్రయాణించాలని అన్నారు.జాతీయ రహదారిపై 'యూ"టర్న్ తీసుకునే సమయంలో ఇరువైపు మార్గాలపై వచ్చే వాహనాలను పరిశీలించిన పిమ్మటే "యూ"టర్న్ తీసుకోవాలని తెలిపారు.

## కొత్తపేట సహకార పరపతి సంఘం అధ్యక్షుడిగా జనసేన నేత కంఠంశెట్టి





**కొత్తపేట జులై 17. విశ్వం వాయిస్ న్యూస్.**
అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట ప్రాధమిక సహకార పరపతి సంఘం అధ్యక్షుడు గా జనసేన నేత కంఠంశెట్టి చంటి ప్రమాణ స్వీకారం చేశారు ఈకార్యక్రమానికి ముఖ్య అతిధిగా జ నసేన నియోజకవర్గ ఇన్ ఛార్జ్ బండారు శ్రీనివాస్ పాల్గొన్నారు కొత్తపేట నియోజవర్గంలో ఉమ్మడికూటమిలో కొత్తపేట సహకార పరపతి సంఘం జనసేనకు కేటాయించారు త్రీమెన్ కమిటీ లో సంఘ అధ్యక్షుడు గా కంఠంశెట్టి చంటి సభ్యులు గా వాసనశెట్టి సత్యనారాయణ(జనసేన) పాలురి జయప్రకాష్ నారాయణ(బిజెపి) ప్రమాణ స్వీకారం చేశారు తొలుత బోడిపాలె వద్ద ఆంజనేయ స్వామి కి ప్రత్యేక పూజలు నిర్వహించి ర్యాలీగా బ్యాంకు వద్దకు చేరుకున్నారు ఈ కార్యక్రమంలో కూటమి నేతలు నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## కాపవరంలో టీచర్ నాగలక్ష్మి కి ఘన సన్మానం



**రామచంద్రపురం విశ్వం వాయిస్ న్యూస్ :-**
కాపవరం గ్రామంలో హైస్కూల్ 8 సవంత్సరాలు పనిచేసిన నందూరి నాగలక్ష్మి బదిలీపై వేళ్తున్న సందర్భంగా అభినందన సభ ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఆమె సేవలకు గ్రామ ప్రజా ప్రతినిధులు ఎంపీటీసీ రెడ్నం సతీష్, సర్పంచ్ యనమదల మంగాదేవి,విద్యా కమిటీ చైర్మన్ గీసాల వీర వెంకట రామ్ ప్రసాద్,మాజీ విద్యా కమిటీ చైర్మన్ మత్తి లక్ష్మీ మణిమాల మరియు హై స్కూలు ఉపాధ్యాయులు నాగలక్ష్మి దంపతులునీ ఘనంగా సత్కరించారు. ఈ సభకి అధ్యక్షత ప్రధానోపాధ్యాలు ముమ్మిడి సత్యనారాయణ వ్యవహరించారు. ఎంపీటీసీ రెడ్నం సతీష్ మాట్లాడుతూ 6 సవంత్సరాలు ప్రధానోపాధ్యాయులు గా పనిచేసిన సందర్భంలో ప్రాథమికోన్నత స్కూల్ గా ఉన్న స్కూలుని హైస్కూలుగా రూపాంతరం చెందటంలో ఆమె తెగువ ఎనలేనిదన్నారు.అదే సమయంలో నాడు నేడు కార్యక్రమంలో స్కూల్ చాలా ఉన్నతంగా అభివృద్ధి చేశారని. ట్రాన్స్ఫర్ మీద వెళుతున్న నాగలక్ష్మి మాట్లాడుతూ ఎన్ని స్కూల్ లో పనిచేసిన ఈ కాపవరం స్కూల్లో పనిచేసిన అనుభూతి ఎన్నటికీ మరువలేనిదిగా గుర్తుండి పోతుందని. ఇక్కడ గ్రామస్థులు, విద్యార్థులు ఎంతో ఆప్యాయత అనురాగాలు చూపించే వారని తెలియజేశారు.అదే విధంగా రెండు సవంత్సరాలు ఉపాధ్యాయులు పనిచేసిన పోతంశెట్టి మధుమోహన్ గంగవరం మండలం మసకపల్లి ట్రాన్స్ఫర్ అయిన సందర్భంగా వారిని కూడా సత్కరించడం జరిగినది. ఈ రోజుల్లో పోటీ ప్రపంచంలో ఉపాధ్యాయ వృత్తిలో ఉండి ఈయన పిల్లలు ఇద్దరిని ఇదే స్కూల్లో చదివించడం ఆయన విలువలకు ఆదర్శనీయుడని ప్రధానోపాధ్యాయులు ముమ్మిడి సత్యనారాయణ తెలియజేశారు.

# పేదరికం లేని సమాజం కోసం ధనవంతులు ముందుకు రావాలి కలెక్టర్

**అమలాపురం జిల్లా ప్రతినిధి విశ్వం వాయిస్ న్యూస్ జూలై 17:**

పేదరికం లేని సమాజం కోసమే జిల్లాలో 64 వేల బంగారు కుటుంబాల పేదలను పైకి తీసుకుని వచ్చేలా ముందుకు రావాలనీ ధనవంతులు ఈ కార్యక్రమంలో భాగ స్వామ్యం కావాలని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ పిలుపుని చ్చారు. గురు వారం అమరావతి నుండి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికే విజయానంద్ 26 జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫ రెన్ నిర్వహించి స్వర్ణాంధ్ర పి4, పాజిటివ్ పబ్లిక్ పెర్సెప్షన్ ,ఎం ఎస్ ఎం ఈ పార్కుల ఏర్పాటు, స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన పథకాల పురోగతి పై సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సమా జంలో ఆర్థిక అసమా నతలు తొలగించి పేదరికం లేని సమాజాన్ని రూపొం దిం చాలన్నదే పీ4 కార్యక్ర మం ప్రధాన ఉద్దేశ్య మన్నారు. పారిశ్రామికవే త్తలు, వివిధ సంస్థల ప్రతినిధులు ముందుకు వచ్చి బంగారు కుటుం బాలకు మద్దతుగా నిలవాలన్నారు సమాజంలో 10 శాతంగా ఉన్న ధనవం తులు, అట్టడుగు పేదరికం లో ఉన్న 20 శాతం మంది బంగారు కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేయడం ద్వారా జీరో పేదరికం సాధనకు పాటు పడాలని సూచించారు p4 ద్వారా నిరుపేదల జీవన ప్రమాణాల స్థాయిని పెంచేం దుకు చేయూత నివ్వడమే పథక లక్ష్యమన్నారు. పేదలకు సేవచేద్దామని, వారి జీవన ప్రమాణాల స్థాయిని పెంచేందుకు సంకల్పించి సదుద్దేశ్యంతో ఉన్న ధనవంతులకు పీ4 కార్యక్రమం ఒక మంచి వేదికన్నారు. జిల్లాలో ఇంత వరకు 64వేల మంది బంగారు కుటుంబాలను గుర్తించామని, బంగారు కుటుంబాలకు మార్గద ర్శకులు అండగా నిలవాలన్నారు. పీ4 కార్యక్రమంపై మార్గదర్శ కులపై ఎటువంటి ఒత్తిడి లేదని, వారికి వారు స్వ చ్ఛందంగా ఈ కార్యక్ర మంలో పాల్గొనాలన్నారు మార్గదర్శకులు నిధులు ఇవ్వడమే కాక పీ4 స్ఫూర్తిని అర్థం చేసుకుని బంగారు కుటుంబాలకు వారు అందించే సాయం ఏ విధంగా ఉపయో గపడు పడుతుందనే కోణంలో బంగారు కుటుంబాలలో సమస్యలు తెలుసుకుని, ఆయా కుటుం బాలలోని పిల్లలకు విద్య, వారి జీవనోపాధికి అవసరమైన, ఉద్యోగ, ఉపాధి అవకా శాలు కల్పించడం, ఆ కుటుంబం అభివృద్ధి వైపు అడుగులు వేసేలా మార్గదర్శి చేయూత అందించాలన్నారు ఆ యొక్క వివరాలను పీ4 వెబ్సైటు లో పొందు పరచాలన్నారు జిల్లాలో మరింతమంది మార్గ దర్శలను గుర్తించి పీ4 కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు చేసి జిల్లాలో పేదరికాన్ని రూపుమా పేందుకు అధికారులు కృషి చేయాల న్నారు. పలు మార్లు సమావేశాలు నిర్వహించి మార్గద ర్శకులకు పీ4 కార్యక్రమం స్ఫూర్తిని తెలపా లన్నారు.అధికారులు సమన్వ యంతో



ప్రతీ నియోజక వర్గంలో ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటుకు చర్యలు వేగవంతం చేయాలన్నారు ముఖ్య మంత్రి ఆశయాల మేరకు స్వర్ణాంధ్ర ఏ2047 లక్ష్యా లకు అనుగు ణంగా జిల్లా, నియోజకవర్గాల విజన్ యాక్షన్ ప్లాన్ లను ఏటా 15 వృద్ధిరేటు లక్ష్యంతో జిల్లాలో పటిష్టంగా అమలు చేసేందుకు నియో జకవర్గ ప్రత్యేక అధికారులు పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని, విజన్ యాక్షన్ ప్లాన్ తుది ప్రణాలికను స్వల్పకాలిక, దీర్ఘకాలిక లక్ష్యాలతో సిద్ధంచే యాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో పారి శ్రామికాభి వృద్ధిలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా అమలు చేస్తున్న నూతన పారిశ్రామిక విధానం ద్వారా పరిశ్రమల స్థాపనకు త్వరితగతిన అనుమతులు మంజూరు చేయడం జరుగుతుంద న్నారు. పరిశ్రమల స్థాపనతో స్థానిక ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మరింత మెరుగుపడతాయ న్నారు జిల్లా, నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ ను పటిష్టంగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నా మన్నారు. పీఎం ఆదర్శ గ్రామ యోజన పథకానికి సంబంధించి 55 గ్రామాలలో సర్వే నిర్వ హించి మొదటి దశలో 25 విలేజ్ డెవలప్మెంట్ ప్రణాళికలు రచించడం జరిగిందన్నారు రెండోదశ కొనసాగుతుందన్నారు, షెడ్యూల్డ్ కులాల జనాభా ఎక్కువగా ఉన్న గ్రామాలను సమగ్రంగా అభివృద్ధి చేయాలన్నారు. ఈ పథకం ద్వారా, గ్రామాలలో మౌలిక సదుపాయాలు, విద్య, ఆరోగ్యం, సామాజిక భద్రత వంటి రంగాలలో అభివృద్ధి సాధించాలని లక్ష్యంగా పె ట్టుకున్నారన్నారు.అభివృద్ధి చెందిన గ్రామాలు ఇతర గ్రామాలకు ఆదర్శంగా నిలవడం అభివృద్ధిలో భాగస్వామ్యం చేస్తూ షెడ్యూల్డ్ కులాల ప్రజల జీవితాలను మెరుగుపర చడం.గ్రామాలలో సామా జిక, ఆర్థిక అసమానతలను తగ్గించడం.గ్రామాలలో మౌలిక సదుపాయాలు మరియు సేవల నాణ్యతను మెరుగుపరచా లన్నారు. రిజిస్ట్రేషన్ సేవలు స్లాట్ బుకింగ్ ఏపీఎస్ఆర్టీసీ సర్వీసులు బస్టాండ్లు సౌకర్యాలు నిత్యవసరాల సరఫరా దీపం 2 సబ్సిడీ రాయితీ అవినీతికి తావు లేకుండా రియంబర్ చేయడం ఉద్యోగుల సేవలు సంతృప్తి కరంగా అందించ డం అంశాలలో ప్రజా సంతృప్తి స్థాయిలను మెరుగుపరచాల్సిన అవసరం ఉందన్నారు ఈ నెల 19వ తేదీ మూడో శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా సింగిల్ యూస్ ప్లాస్టిక్ ను పూర్తిగా నిరోధించి ప్రత్యామ్నాయ సంచులు వినియోగంలో తేవాలని విస్తృత ప్రచారం గావిం చాలన్నారు ముందుగా ప్రభుత్వ కార్యాలయాలు పాఠశాలలు కళాశాలలో ఈవెంట్లు నిర్వహణ ప్రదే శాలలో ప్లాస్టిక్ నిరోధిం చాలని ప్లాస్టిక్ స్థానంలో ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయాలన్నారు. గ్రామాలలో సిసి రోడ్లకు ఇరువైపులా ఉపాధి హామీ అనుసం ధానంతో మ్యాజిక్ పిట్లను ఏర్పాటు చేసి మురికి నీటిని భూమిలో ఇంకింప చేస్తూ భూగర్భ జలాల స్థాయి లను మెరుగుపరచడం తోపాటు గ్రామాలను పారిశుద్ధ్య పరంగా తీర్చిదిద్దాలని సూచించారు ఈ కార్యక్ర మంలో జిల్లాస్థాయి అధికారులు మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

## వైసిపి లీగల్ సెల్ నాయకులు కుడుపూడి త్రినాధ రావు పుట్టినరోజు వేడుకలు



**అమలాపురం టౌన్ విశ్వం వాయిస్ న్యూస్**

అమలాపురం బార్ అసోసియేషన్ మాజీ ఉపాధ్యక్షులు. సీనియర్ న్యాయవాది. వైసిపి లీగల్ సెల్ నాయకులు కుడుపూడి త్రినాధ రావు పుట్టినరోజు వేడుకలు అమలాపురం హై స్కూల్ వద్ద కుడుపూడి గోపాలకృష్ణ గోకిలే (కేజీ కే ) జిమ్ లో గురువారం సాయంత్రం జరిగాయి.. వాకర్స్ క్లబ్ సభ్యులు. జిమ్ సభ్యులు ఆయనకు కేక్ తినిపించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణ రావు మాట్లాడుతూ త్రినాధ రావు మరిన్ని పుట్టినరోజులు జరుపుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో రాజోలు నియోజకవర్గం వైసీపీ పార్టీ పరిశీలకుడు మట్టపర్తి నాగేంద్ర. టిడిపి నాయకులు వాసనశెట్టి చినబాబు.బీసీ నాయకులు దండుమేను రూపేష్. చప్పిడి శోభన్ బాబు. ముంగర ప్రసాద్. కుడుపూడి వెంకటేష్. ఏ ఆర్ ఎస్ ఐ త్రినాథ్. గుత్తుల రాంబాబు. కాంద్రేకుల గోపి. కుడుపూడి బుజ్జి. ఈదరపల్లి బుజ్జి. స్వామి ఫ్రెండ్స్. కట్టా విష్ణు ప్రసాద్. దొంగ చంద్ర. గంగరాజు గోపి. రాజా. విత్తనాల భూషణం. కే. శేఖర్ తదితరులు పాల్గొన్నారు

## ఎమ్మెల్సీ తోటను కలిసిన ఆదిత్య కుమార్...

### పార్టీ బలోపేతానికి కృషి



**మండపేట టౌన్...విశ్వం వాయిస్ న్యూస్...**

మండపేట విజయలక్ష్మి నగర్ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండపేట నియోజకవర్గ ఇన్ ఛార్జ్ తోట త్రిమూర్తులు ని నియోజకవర్గ వైసిపి పరిశీలకులు కటకంశెట్టి విజయ ధర్మ ఆదిత్య కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సమావేశంలో రాష్ట్ర అధికార ప్రతినిధి తెన్నేటి కిషోర్, సర్పంచ్ సలాది సతీష్, మాజీ ఏ యం సి ఛైర్మన్ సిరిపురపు శ్రీనివాస్ తదితర నాయకులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కటకంశెట్టి విజయ ధర్మ ఆదిత్య, నియోజకవర్గ పార్టీ పటిష్టత కోసం తన పూర్తి స్థాయి సహకారం అందిస్తానని పేర్కొన్నారు.పార్టీ బలోపేతానికి అవిశ్రాంతంగా కృషి చేస్తానని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుకు హామీ ఇచ్చారు.బాబు షూరిటీ, మోసం గ్యారంటీ అనే నినాదంతో పార్టీ నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా, ప్రజల సమస్యలను పరిష్కరించడానికి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ లక్ష్యాలను ముందుకు తీసుకెళ్లడానికి తమ వంతు కృషి చేస్తామని ఆయన తెలిపారు.ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, పార్టీ కార్యకర్తలు నాయకుల సమన్వయంతో మండపేట నియోజకవర్గంలో వైయస్సార్ కాంగ్రెస్ జెండాను ఎగురవేయడమే తమ లక్ష్యమని అన్నారు.

## ఎన్నికల విధుల పట్ల అలసత్వం వద్దు ...

### జిల్లా ఓటర్ నమోదు అధికారి పి.కృష్ణమూర్తి...



**మండపేట టౌన్,విశ్వం వాయిస్ న్యూస్...**

బూత్ లెవల్ అధికారుల జాతీయ శిక్షణ కార్యక్రమంలో భాగంగా మండపేట అసెంబ్లీ నియోజకవర్గం (48) ఓటర్ నమోదు అధికారి మరియు స్పెషల్ డిప్యూటీ కలక్టర్ పి.కృష్ణమూర్తి ఆధ్వర్యంలో గురువారం నాడు మండపేట ఎంపీడీవో కార్యాలయంలో మండపేట మండలం,రాయవరం మండలం,కపిలేశ్వరపురం మండలలకు సంబంధించిన 42 మంది బూత్ లెవెల్ అధికారులకు శిక్షణా తరగతులు ఏర్పాటు చేయడం జరిగింది.ఓటర్ నమోదు అధికారి మరియు స్పెషల్ డిప్యూటీ కలక్టర్ పి.కృష్ణమూర్తి మాట్లాడుతూ బూత్ లెవల్ అధికారులు ఎన్నికల విధుల పట్ల నిర్లక్ష్యం, అలసత్వం వ్యవహరించరాదని శిక్షణ తరగతులను సద్వినియోగించుకోవాలని అన్నారు. ఈ శిక్షణ తరగతులు అనంతరం ఎన్నికల కమీషన్ ఏర్పాటు చేసిన గూగుల్ లింక్ ద్వారా పరీక్షలు నిర్వహించి ధ్రువపత్రాలు పంపిణీ చేశారు తదుపరి ప్రతిజ్ఞ చేయించారు. ఈ బూత్ లెవెల్ శిక్షణ కార్యక్రమాలు11.07.2025 వ తేదీ నుండి 5 బ్యాచ్ లతో 17.07.2025 వ తేదీతో ముగిసినవి అని తెలిపారు.ఈ కార్యక్రమంలో తహసిల్దార్ పి.తేజేశ్వరరావు, డిప్యూటీ తహసిల్దార్ పీ ఏ మెహర్ బాబా,టిడిపి మాజీ అధ్యక్షులు ఉంగరాల రాంబాబు, టిడిపి నాయకులు మేడపాటి రవీంద్రారెడ్డి, బిజెపి మండల అధ్యక్షులు పాలిక రమణ, పందిరి వీర్రాజు ,మాస్టర్ ట్రైనర్ నాగం నాగ శివ, సీనియర్ అసిస్టెంట్ మేకా శ్రీనివాస్ రావు, డేటా ఎంట్రీ ఆపరేటర్ ఆంజనేయులు, మూడు మండలల బి ఎల్ ఓ లు,తదితరులు పాల్గొన్నారు.

## డ్రోన్ల నిఘాతో ఈవ్ టీజింగ్, ర్యాగింగ్ కు చెక్

# -విద్యా సంస్థల వద్ద ప్రత్యేక చర్యలు





### -జగ్గంపేట సీఐ వై ఆర్ కే శ్రీనివాస్

**జగ్గంపేట :విశ్వం వాయిస్ న్యూస్**

కాకినాడ జిల్లా పోలీస్ శాఖ విద్యార్థుల భద్రత పట్ల మరింత అప్రమత్తంగా ఉంది. విద్యా సంస్థల వద్ద ఈవ్ టీజింగ్, ర్యాగింగ్ లాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఉండేందుకు జగ్గంపేట సర్కిల్ పరిధిలో ప్రత్యేక నిఘా చర్యలు చేపట్టారు. జిల్లా ఎస్పీ బిందు మాధవ్, ఐపీఎస్ ఆదేశాల మేరకు డ్రోన్ల సహాయంతో పాఠశాలలు, కళాశాలల వద్ద జగ్గంపేట సీఐ వై ఆర్ కే శ్రీనివాస్ ఆధ్వర్యంలో పర్యవేక్షణ నిర్వహిస్తున్నారు.ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం సమయాల్లో పాఠశాలలు, ప్రైవేట్ కళాశాలల వద్ద డ్రోన్ల ద్వారా నిఘా కొనసాగుతోంది. డ్రోన్ కెమెరాల సాయంతో అనుమానాస్పద వ్యక్తులను గుర్తించి, శాంతి భద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. విద్యార్థులు, విద్యార్థినులలో భద్రతాభావాన్ని పెంపొందించడంతో పాటు, అవాంఛనీయ ఘటనలు జరగకుండా నియంత్రించడం పోలీసుల ప్రధాన లక్ష్యంగా మారింది.గురువారం కిర్లంపూడి మండలం బూరుగుపూడి హై స్కూల్ వద్ద డ్రోన్ కెమెరా సాయంతో పరిసరాల పర్యవేక్షణ జరిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని జగ్గంపేట సర్కిల్ పోలీసులు తెలిపారు.

## పొట్టి శ్రీరాములు ట్రస్ట్‌కు స్థలం కేటాయింపుపై

## హర్షం వ్యక్తం చేసిన ఆర్యవైశ్య నాయకులు...



**మండపేట టౌన్.విశ్వం వాయిస్ న్యూస్...**

అమరావతిలో పొట్టి శ్రీరాములు మెమోరియల్ ట్రస్ట్‌కు కూటమి ప్రభుత్వం స్థలం కేటాయించడం పట్ల మండపేట ఆర్యవైశ్య సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పట్టణంలోని పెద్ద కాలువ వంతెన వద్ద గల పొట్టి శ్రీరాములు, మహాత్మా గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.అనంతరం ట్రస్ట్ స్థల కేటాయింపునకు కీలక పాత్ర పోషించిన టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు . జిల్లా, మండల ఆర్యవైశ్య సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వాకచర్ల వీర వెంకట సత్యనారాయణ గుప్తా, వైస్ ప్రెసిడెంట్ కంచర్ల వీర వెంకట ప్రసాద్, పీఆర్ఓ నాళం కిట్టు, వాసవి సేవా చైర్మన్ కేశవరపు శ్రీనివాసరావు, సోషల్ మీడియా చైర్మన్ మద్దుల సుబ్బారావు, మండపేట మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కాళ్లకూరి శ్రీనివాస్, గాది శ్యామల రావు, పట్నాల సురేష్, బోనగిరి బాబ్జి, బలబద్రపు రాజు, కంచర్ల రాజు, వాకచర్ల వీరభద్రరావు, వెత్స సుబ్బారావు, గ్రంధి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా గోకవరం సొసైటీ చైర్మన్ గా ప్రమాణ స్వీకారం చేసిన గాజింగం సత్తిబాబు

### భారీ ర్యాలీతో, వందలాది మోటార్ సైకిల్ తో ర్యాలీగా ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూతో కలిసి వెళ్లి బాధ్యత స్వీకరించిన గాజింగం సత్తిబాబు



**జగ్గంపేట :విశ్వం వాయిస్ న్యూస్**

గోకవరం సొసైటీ చైర్మన్ గా గోకవరం గ్రామానికి చెందిన గాజింగం సత్తిబాబు సభ్యులుగా కొత్తల వీర అప్పారావు, వాకాడ కాటమాస్వామి ప్రమాణ స్వీకారం గురువారం సూర్య ఫంక్షన్ హాల్ లో అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి జగ్గంపేట శాసనసభ్యులు, తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండల సభ్యులు జ్యోతుల నెహ్రూ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా చైర్మన్ సత్తిబాబు ఇంటి వద్ద నుండి వందలాది బైకులతో, మంగళ వాయిద్యాలతో భారీ బాణాసంచా కాల్పులతో గోకవరం మండలంలోని కూటమి నాయకులు అందరూ భారీ ఊరేగింపుగా ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, చైర్మన్ గాజింగం సత్తిబాబు ఓపెన్ టాప్ జీపు పై ప్రజలకు అభివాదం చేస్తూ గోకవరం సొసైటీ వద్దకు చేరుకున్నారు. అక్కడ పదవి బాధ్యతలు చేపట్టిన తర్వాత సూర్య ఫంక్షన్ హాల్ లో ప్రమాణ స్వీకార మహోత్సవం జరిగింది. అనంతరం వందలాదిగా తరలివచ్చిన అభిమానులు ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూను, చైర్మన్ సత్తిబాబును గజమాలతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా సత్తిబాబు మాట్లాడుతూ నాపై నమ్మకంతో గోకవరం సొసైటీ చైర్మన్ నియమించిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ నమ్మకాన్ని వమ్ము చేయకుండా సొసైటీని మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తారని రైతులకు అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తారని అన్నారు. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ గోకవరం సొసైటీకి మంచి వ్యక్తులను ప్రీమియం కమిటీగా నియమించడం జరిగిందని సొసైటీని అన్ని రకాల గా అభివృద్ధి చేసే చైర్మన్ ఈరోజు బాధ్యతలు స్వీకరించుతున్నారని మళ్లీ ఎన్నికల్లో కూడా వీరినే పోటీ చేస్తామని అన్నారు. రాష్ట్రాన్ని అన్ని రకాలుగా నాశనం చేసిన జగన్ రెడ్డికి ప్రతిపక్ష హెూదా కూడా ఇవ్వకుండా ప్రజలు తగిన బుద్ధి చెప్పారని ముఖ్యమంత్రి చంద్రబాబు అభివృద్ధి సంక్షేమం సమాంతరంగా అందిస్తూ సూపర్ సిక్స్ పథకాలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నారని ఆగస్టు 15న మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఈ నెలలోనే రైతులకు అన్నదాత సుఖీభవ అందించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కుటమి నాయకులు, కార్యకర్తలు అభిమానులు అధిక సంఖ్యలో గాజింగం సత్తిబాబు అభిమానులు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## పిల్లా వారి సొసైటీ చైర్మన్

# ప్రమాణ స్వీకారం



**రామచంద్రపురం విశ్వం వాయిస్ న్యూస్**

రామచంద్రపురం పట్టణంలో స్థానిక శివాలయం వీధిలో వున్న పిల్లా వారి సొసైటీ చైర్మన్ ప్రమాణ స్వీకారం ఘనంగా జరిగింది.స్థానిక జనసేన పార్టీ ఆఫీస్ నుండి శివాలయం విధి వరుకు భారీ ర్యాలీ గా సొసైటీ కి చేరుకున్నారు. అనంతరం చైర్మన్ గా పిల్లా సత్యనారాయణ ఫణి, సభ్యులు గా పోలిశెట్టి వెంకటరమణ,ముమ్మారెడ్డి పద్మశ్రీ నియమితులు అయ్యారు.ఈ సందర్బంగా చైర్మన్ ఫణి మాట్లాడుతూ చైర్మన్ గా బాధ్యతలు తీసుకోవడం చాలా సంతోషంగా ఉందని ఆనందం వ్యక్తం చేశారు. అలానే కమిటీ నిర్ణయం వెనుక మంత్రి సుభాష్ మరియు సత్యం,చంద్రశేఖర్ సహాయసాకారాలు ఉన్నాయన్నారు.అలానే సొసైటీ సభ్యులు నిర్ణయంతోనే నాకు ఈ చైర్మన్ బాధ్యత వచ్చిందని అన్నారు. సొసైటీ విషయంలో ఎటువంటి వివాదాలుకు తావు లేకుండా సామాన్య నిర్ణయాలుతో ముందుకు వెళ్తానన్నారు. ఎల్ సందర్బంగా నా స్నేహితులుకు, అభిమానులుకు, కూటమి కార్యకర్తలుకు ధన్యవాదములు తెలిపారు. అనంతరం ఘనంగా ముగ్గురుని సత్కరించారు.ఈ కార్యక్రమంలో రామచంద్రపురం రాజకీయ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జరిగిన ప్రపంచ న్యాయ దినోత్సవం.






**కాకినాడ రూరల్: విశ్వం వాయిస్ న్యూస్.**
ప్రపంచ న్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఎంఎస్ఎన్ క్యాంపస్‌లో బుధవారం ఘనంగా కార్యక్రమం నిర్వహించబడింది. ఈకార్యక్రమానికివిశ్వవిద్యాలయ ం ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్. ప్రశాంతి శ్రీ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ న్యాయం అనే పదం అర్థవంతంగా ఉండేందుకు ప్రతి పౌరుడి భాగస్వామ్యం అవసరం. న్యాయ వ్యవస్థపై నమ్మకంతో సమాజంలో సమానత్వాన్ని స్థాపించాలి అని పేర్కొన్నారు. ముఖ్య వక్తగా విచ్చేసిన ప్రముఖ సీనియర్ అడ్వొకేట్ డా. వై.వసంత విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ భారత రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులు, న్యాయ విధానం ఎలా పనిచేస్తుంది, న్యాయవాదుల బాధ్యతలు మరియు పౌరుల హక్కులు వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. న్యాయం సమాజం రక్షణకవచం, ప్రతి ఒక్కరూ చట్టాన్ని గౌరవించాలి అని ఉద్ఘాటించారు. ఈ సందర్భంగా డా. ఎం. నాని బాబు గారి నేతృత్వంలో విద్యార్థులు న్యాయ నిబంధనలను గౌరవిస్తూ ప్రమాణం స్వీకరించారు. విద్యార్థులు ఈ కార్యక్రమంలో డా మధుకుమార్, డా స్టీఫెన్, డా హారిక, డా గోపి, డా హరిబాబు మహమ్మద్ నదీమ్ , మనోజ్ దేవ , డా ఎస్తర్ రాణి, పీడీ డా.రామ్ గోపాల్ , ఎస్టాబ్లిషమెంట్ డిపార్ట్మెంట్ శ్రీనివాస్ తదితర అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది మరియు విద్యార్థులు హాజరై, న్యాయ వ్యవస్థ నకు సంబంధించిన అంశాలను నివృత్తి చేసుకున్నారు.

## ఉల్లాస్...అక్షరాంధ్ర.. అక్షరాస్యత కార్యక్రమంలో అధికారులు అందరూ భాగస్వాములు అవ్వాలి...






-జిల్లా కలెక్టర్

**కాకినాడ కలెక్టరేట్: విశ్వం వాయిస్ న్యూస్**
రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసినటువంటి ఉల్లాస్... అక్షరాంధ్ర... అక్షరాస్యత కార్యక్రమం లో అధికారులందరూ భాగం అవ్వాలని కాకినాడ జిల్లా కలెక్టర్ షన్మోహన్ సగిలి పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయం నందు వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో 2025.. 26 సంవత్సరానికి సంబంధించినటువంటి అక్షరాంధ్ర ..అక్షరాస్యత కార్యక్రమానికి సంబంధించినటువంటి జిల్లాస్థాయి అధికారులతో సమన్వయ సమావేశాన్ని కలెక్టర్ వారి అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో కాకినాడ జిల్లా కలెక్టర్ షన్మోహన్ సగిలి మాట్లాడుతూ రాష్ట్రం వ్యాప్తంగా 2023 వ సంవత్సరంలో నిర్వహించినటువంటి క్యాస్ట్ సర్వే ద్వారా 3,39,963మంది వయోజనులైన నిరక్షరాశులను కాకినాడ జిల్లాలో, జిల్లా గ్రామ మరియు వార్డు సచివాలయాల శాఖల ద్వారా గుర్తించడం జరిగిందని తెలిపారు. వారి నుండి కాకినాడ జిల్లాలో మొదటి విడతగా 2025-26 సంవత్సరం లో1,03,081 మంది వయోజనులైన నిరక్షరాశులను తీసుకుని వారిని అందరిని అక్షరాస్యులుగా చేయడానికి సంబంధిత శాఖల ద్వారా యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించినట్లు తదుపరి మూడు సంవత్సరాల లో మొత్తం 3,39,963మంది నిరక్షరాస్యులైన వయోజనులను అక్షరాస్యులుగా చేసి కాకినాడ జిల్లాని అక్షరాస్యతలో మొదటి స్థానంలోకి తీసుకుని రావాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు...కాకినాడ జిల్లా వయోజన విద్య నోడల్ అధికారి శ్రీ అనిశెట్టి వెంకట్రావురెడ్డి మాట్లాడుతూ గత సంవత్సరం అనగా 2024 -25 సంవత్సరంలో ఉల్లాస్ అక్షరాస్య కార్యక్రమం 27 మండలాల్లో నిరక్షరాశులయిన డ్వాక్రా గ్రూపు మహిళలని 6,806 మందిని గుర్తించి జిల్లా కలెక్టర్ వారి ఆదేశాలతో, డిఆర్డిఏ పిడి గారి సహకారంతో 6,806 మందిని అక్షరాస్యులుగా తయారు చేయడం జరిగిందని తద్వారా రాష్ట్రస్థాయిలో ఉల్లాస్ అక్షరాస్యత కార్యక్రమంలో కాకినాడ జిల్లా 7 వ స్థానం సాధించిందని తెలిపారు..

ఇప్పుడు జరుగుతున్న రెండో దఫా అక్షరాంధ్ర.. అక్షరాస్యత కార్యక్రమం ఈనెల 25వ తారీకు వరకు మండలాలలో వాలంటరీ టీచర్స్ ని గుర్తించి, వారికి మ్యాచింగ్ - బ్యాచింగ్ ద్వారా పదిమందికి ఒక వాలంటరీ టీచర్ ని ఏర్పాటు చేస్తారని, తర్వాత ఈనెల 25వ తారీకు నుండి 28వ తారీకు వరకు ఒకరోజు జిల్లాస్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తామని, 29వ తారీకు నుండి ఆగస్టు ఆరో తారీకు వరకు మండల స్థాయిలో వాలంటరీ టీచర్స్ కి, రిసోర్స్ పర్సన్స్ కి శిక్షణ కార్యక్రమాలు ఎంపీడీవో గారి ఆధ్వర్యంలో నిర్వహిస్తామని, ఆగస్టు ఏడో తారీఖు నుండి ఫిబ్రవరి 2026 వరకు 100 గంటల తరగతులు నిర్వహిస్తామని , ఈ శిక్షణ తరగతులలో వయోజనులైన నిరక్షరాశులకు, ఫైనాన్షియల్ లిటరసీ, డిజిటల్ లిటరసీ, మరియు ఫంక్షనల్ లిటరసీ లలో శిక్షణ ఇవ్వటం జరుగుతుందని, తర్వాత మార్చి నెలలో వారికి పరీక్ష నిర్వహించడం జరుగుతుందని వయోజన విద్య నోడల్ అధికారి అనిశెట్టి వెంకటరావురెడ్డి తెలియజేశారు...
ఈ సమావేశంలో సీఈఓ జడ్పీ, పి డి డి ఆర్ డి ఎ, డిఇఓ, డిపిఓ, పిడిఐసిడిఎస్, పిడి మెప్మా, పిడి డ్వామా, డి పి ఆర్ ఓ, వయోజన విద్య నోడల్ అధికారి , జి ఎస్ డబ్ల్యూ ఎస్ ఇంచార్జీ అధికారి తదితరులు పాల్గొన్నారు..

## ఆగస్టు 1 నుండి 20 వరకు ఆర్మీ రిక్రూట్మెంట్ ర్యాలీ....


-సెప్టెంబర్ మూడు నుంచి 20 వరకు జాతీయ జూనియర్ హాకీ ఛాంపియన్షిప్ పోటీలు.....
-జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా



**కాకినాడ సిటీ: విశ్వం వాయిస్ న్యూస్**
కాకినాడలో నిర్వహించనున్న జాతీయ జూనియర్ హాకీ ఉమెన్ ఛాంపియన్షిప్, ఆర్మీ ర్యాలీ సక్రమ నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా అధికారులను ఆదేశించారు. ఆర్మీ ర్యాలీ, ఉమెన్ ఆంటీ ఛాంపియన్షిప్ పోటీలకు సంబంధించి కాకినాడ క్రీడా మైదానంలో జరుగుతున్న ఏర్పాట్లను గురువారం జేసీ రాహుల్ మీనా..రెవెన్యూ, కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్, ఇతర శాఖల అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు 1 నుంచి 20వ వరకు ఆర్మీ రిక్రూట్మెంట్ ర్యాలీ, 3 నుంచి 20వ తేదీ వరకు జాతీయ జూనియర్ హాకీ ఛాంపియన్షిప్ పోటీలు కాకినాడ డీఎస్ఏ మైదానంలోజరగనున్నాయన్నారు. ఆర్మీ ర్యాలీకి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 13 ఉమ్మడి జిల్లాల నుంచి అభ్యర్థులు హాజరుకానున్నారు. అదేవిధంగా హాకీ ఛాంపియన్షిప్ పోటీలకు దేశ వ్యాప్తంగా ఉన్న 26 జిల్లా నుంచి సుమారుగా 500 మంది మహిళల క్రీడాకారులు, 200మంది సహాయక సిబ్బంది పాల్గొంటారని ఆయన తెలిపారు. ఆర్మీ ర్యాలీ రిక్రూట్మెంట్ కి సంబంధించి రోజుకు సుమారుగా 800 మంది అభ్యర్థులు హాజరుకానున్న నేపథ్యంలో అందుకు తగిన విధంగా అధికారులు ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా జేసీ అధికారులను ఆదేశించారు. ఈ పరిశ్రమంలో జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా వెంట జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు, కాకినాడ ఆర్డీవో ఎస్.మల్లి బాబు, ఎడీసీ కేపీ సుధాకర్, ఎస్ఈ వెంకటరావు ఇతర క్రిడాధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రైతుల సంక్షేమం కోసం చంద్రబాబు కృషి

మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు



**విశ్వం వాయిస్- కాజులూరు**
రైతుల సంక్షేమం కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిరంతరం కృషి చేస్తున్నారని మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు పేర్కొన్నారు. కాజులూరు మండలం గొల్లపాలెంలో నూతనంగా ఏర్పడిన సొసైటీ కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆయన ముఖ్యతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సొసైటీ చైర్ పర్సన్గా అంగర కృష్ణ, సొసైటీ పర్సన్లుగా డేగల సుబ్బారావు, మాత నాగరాజు ప్రమాణస్వీకారం చేసి పదవి బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, తెలుగుదేశం పార్టీ పరిశీలకులు కాకినాడ రామారావు, బీసీ సంక్షేమ శాఖ రిటైర్డ్ డీడీ సనపల ధనరాజు తదితరులు నూతన కార్యవర్గాన్ని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి చిక్కాల మాట్లాడుతూ టీడీపీ నాయకులు, కార్యకర్తలు పార్టీ ఆశయ సాధనకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ మాజీ చైర్మన్ గుత్తుల బులిరాజు, మండలటీడీపీ అధ్యక్షులు చవ్వాకుల నారాయణమూర్తి(డాక్టర్ బాబు), డేగల సతీష్, నీటి సంఘం ప్రెసిడెంట్ తాడి మాచారెడ్డి, తణుకువాడ సొసైటీ చైర్మన్ పితాని సతీష్ కుమార్, టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు నక్క శ్రీను,సలాది సాయిబాబు వనుం వీరబ్రహ్మం పలివెల రాజు, అంగర శ్రీనివాస్, palivela రాజు, కొప్పాక రాంబాబు చౌదరి, అంగర చిన్న గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆలమూరు శాఖా గ్రంధాలయానికి టేబుల్స్, కుర్చీల అందజేత



**ఆలమూరు( విశ్వం వాయిస్ న్యూస్):**
మండల కేంద్రమైన ఆలమూరు శాఖ గ్రంథాలయానికి దివంగత గొడవర్తి సత్యానందం (బండబ్బ) జ్ఞాపకార్థం ఆయన కుమారుడు గొడవర్తి వెంకట నారాయణ రూ.12వేల విలువైన టేబుల్స్, కుర్చీలు అందజేశారు. ఆలమూరు శాఖ గ్రంథాలయం పై అంతస్తు నిర్మాణం పూర్తవడంతో, పాఠకుల సౌకర్యార్థం నూతన ఫర్నిచర్ ను దాత అందించినట్లు ఏఎంసి మాజీ చైర్మన్,తెదేపా నాయకుడు ఈదల నల్ల బాబు తెలిపారు. దాత వెంకటనారాయణను పలువురు అభినందించారు.

## శంఖవరం మండల భాజపా. అధ్యక్షుడుగా వరహాలబాబు

**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్**
కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండల భారతీయ జనతా పార్టీ అధ్యక్షునిగా నెల్లిపూడికి చెందిన అదట్రా వరహాలబాబు నియామకం అయ్యారు. బికాం చదువుకున్న ఉన్నత విద్యావంతుడైన ఈయన స్థానికంగా వ్యవసాయం చేసుకుంటూ పార్టీ కార్యక్రమాల్లో పాలు పంచుకుంటున్నారు. గతంలో ఒక పర్యాయం ఇదే మండలంలో ఇదే అధ్యక్ష పదవిని చేపట్టి తన శక్తి మేరకు పార్టీకి సముచిత సేవలను అందించారు.



కాకినాడ జిల్లా భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు బిక్కిన విశ్వేశ్వరరావు ఆదేశాలతో ఈ నియామకం చేపట్టారు. ఈ నియామకం విషయమై నెల్లిపూడిలోని తన నివాసంలో గురువారం నిర్వహించిన ఓ ప్రత్యేక కార్యక్రమంలో ప్రత్తిపాడు భా.జ.పా. నేత ఘంటా బాలుదొర ప్రకటించారు. నాకు ఈ పదవీ అవకాశం ఇచ్చిన రాష్ట్ర పార్టీకి, జిల్లా అధ్యక్షులకు, నియోజకవర్గ పార్టీ నాయుకులకు నూతన అధ్యక్షుడు గంటా వరహాలబాబు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయుకులు, రాష్ట్ర ధార్మిక సెల్ కొకన్వీనర్ కామర్సు చిరంజీవి, రాష్ట్ర యువమోర్చా కార్యవర్గ సభ్యులు అదట్రా వెంకన్నదొర, మండల ప్రధాన కార్యదర్శి బొమ్మిడి లోవరాజు, మునశాల రాజు, జంగం శివశంకర్, ఎస్.ఆర్.ఎస్. నారాయణ, మెరపల శివ పాల్గొన్నారు.

## కైలాసభూమి అభివృద్ధి పనులు ప్రారంభించిన లయన్స్ క్లబ్



**తాళ్లరేవు,విశ్వంవాయిస్ న్యూస్:**
తాళ్లరేవు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం తాళ్ళరేవు గ్రామపంచాయతీ లయన్స్ కైలాస భూమి అభివృద్ధిలో భాగముగా సెకండ్ ఫేస్ పనులు ప్రారంభించారు. కైలాస భూమి పక్కనే గల చెరువుల సరిహద్దులో నాలుగు మీటర్ల వెడల్పు లో తుప్పలతో నిరుపయోగంగా ఉన్న స్మశాన భూమిని జెసిబితో క్లియర్ చేయించి, నాలుగు మీటర్ల వెడల్పు గలబాట ఏర్పాటు చేయడం జరిగిందని తాళ్ళరేవు లయన్స్ క్లబ్ రీజియన్ చైర్పర్సన్ బిళ్ళకుర్తి శ్రీనివాసరెడ్డి అన్నారు.

## కూటమి ప్రభుత్వ పాలనపై హర్షం వ్యక్తం చేస్తున్న రాష్ట్ర ప్రజలు....

-సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వనమాడి...



**కాకినాడ సిటీ:విశ్వం వాయిస్ న్యూస్**
సూపర్ సిక్స్ పథకాలను ఒక్కొక్కటిగా కూటమి ప్రభుత్వం అమలు చేస్తుందని, ప్రజలు మెచ్చే విధంగా రాష్ట్రంలో చంద్రన్న నాయకత్వంలో కూటమి ప్రభుత్వం పాలన కొనసాగుతుందని కాకినాడ సిటీ శాసనసభ్యులు వనమాడి కొండబాబు పేర్కొన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా కొండబాబు గురువారం స్థానిక 29, 16 డివిజన్ నందు ఇంటింటికి వెళ్లి ప్రజల అభిప్రాయాలను తెలుసుకుని, కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొండబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ పాలనపై రాష్ట్ర ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని, రాష్ట్రంలో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తూనే, అభివృద్ధిలో కూడా ముందుకు తీసుకువెళ్తున్నారని, దేశంలో ఏ రాష్ట్రంలో కూడా లేని విధంగా పేద ప్రజలకు అనేక సంక్షేమ కార్యక్రమాలు కూటమి ప్రభుత్వం అందిస్తుందని, పింఛన్లు పెంపు, ఉచిత గ్యాస్ సిలిండర్ పథకాన్ని అందించామని, అలాగే తల్లికి వందనం పేరుతో ఇంటిలో ఎంతమంది చదువుకునే పిల్లలు ఉన్న అంతమందికి కూడా ఒక్కొక్కరికి 13 వేల రూపాయలు తల్లుల ఖాతాలకు జమ చేశారని, త్వరలో మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని కూడా అమలు చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గదుల సాయిబాబా, చింతలపూడి రవి, అమలకంటి బలరాం, మల్లాడి చిన్న, కోనాడ ప్రకాష్, పినిశెట్టి చిన్న, అయినాల రమణ, మల్లాడి రాజు, చింతలపూడి మనకంట, సికోటి శ్రీనివాస్, గొల్లపూడి శ్రీదేవి, కరకవలస నాగమణి, కోన పద్మావతి, చింతా సతీష్, సిత్రాల గోవిందు, తదితర నాయకులు పాల్గొన్నారు.

## డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో మిగులు సీట్ల భర్తీకి 21వ తేదీన కౌన్సిలింగ్....

**కాకినాడ సిటీ:విశ్వం వాయిస్ న్యూస్**
కాకినాడ జిల్లాలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో అయిదవ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు మిగులు సీట్లు భర్తీకి ఈ నెల 21వ తేదీన ఉదయం 10 గంటల నుండి కాకినాడ, సాంబమూర్తి నగర్ లోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాలలో కౌన్సిలింగ్ నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి ఒక ప్రకటనలో తెలిపారు.

పాఠశాలల వారీగా మిగుల సీట్ల వివరాలు ఈ విధంగా తెలిపారుః
పి.వెంకటాపురం - పదవ తరగతి (3), జూనియర్ ఇంటర్ 8, సీనియర్ ఇంటర్ (16)
ఎ.మల్లవరం-5వ తరగతి (18), 10వ తరగతి (9), సీ.ఇంటర్ (44)
ఎస్.ఎం.నగర్-5వ తరగతి (29), 10వ తరగతి (2), సీ.ఇంటర్ (14)
ఏలేశ్వరం-5వ తరగతి(28), 10వ తరగతి (2), సీ.ఇంటర్ (17)
వి.కొత్తూరు-5వ తరగతి (3), జూ.ఇంటర్ (17), సీ.ఇంటర్ (35)
జగ్గంపేట - 5వ తరగతి (36), 10వ తరగతి (13), సీ.ఇంటర్ (19)
చొల్లంగిపేట-5వ తరగతి (60), 6వ తరగతి (3), 9వ తరగతి (1), 10వ తరగతి (14), జూ.ఇంటర్(37), సీ.ఇంటర్ (39)
తుని బాలురు-5వ తరగతి(4), 10వ తరగతి (4),
పిఠాపురం-5వ తరగతి (9), పదవ తరగతి (3), సీ.ఇంటర్ (13)

ఈ విద్యా సంవత్సరం నుండి పదవ తరగతి, ఇంటర్మీడియేట్ రెండవ సంవత్సరం మిగులు సీట్లు కూడా భర్తీ చేయడం జరుగుతుందని, పదవ తరగతిలో చేరేందుకు 9వ తరగతి ఫైనల్ మార్కుల షీటు, స్టడీ సర్టిఫికేటు, ఇంటర్ రెండవ సంవత్సరంలో చేరేందుకు ఫస్ట్ ఇయర్ లో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత అవసరమని తెలిపారు. కావున కాకినాడ జిల్లాలో పైన తెలిపిన గురుకుల పాఠశాలల్లో 5వ తరగతి నుండి ఇంటర్మీడియేట్ మిగులు సీట్ల భర్తీకి ఈ నెల 21వ తేదీన కాకినాడ గురుకుల పాఠశాలలో నిర్వహిస్తున్న కౌన్సిలింగ్ ను ఆశక్తి కలిగిన ఎస్సి, ఎస్టీ బాలబాలికలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ తమ ప్రకటనలో కోరారు.

## ట్రాఫిక్ రూల్స్ పై అవగాహన కల్పించిన ట్రాఫిక్ పోలీసులు





**కాకినాడ సిటీ:విశ్వం వాయిస్ న్యూస్**
కాకినాడ - కల్పన సెంటర్"నందు వాహన దారులకు మరియు పాదాచారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించిన కాకినాడ ట్రాఫిక్ పోలీసులు మోటార్ వాహనాలు కలిగిన ప్రతి ఒక్కరూ గవర్నమెంట్ వారు జారీ చేసిన నంబర్ ప్లేట్లను మాత్రమే వాడాలని మోటార్ సైకిల్స్ నడిపే ప్రతి ఒక్కరు తప్పని సరిగా హెల్మెట్/ ధరించాలని,ట్రిపుల్ రైడింగ్, బైక్ స్టంట్స్, మైనర్ డ్రైవింగ్ చేయరాదని రాష్ అండ్ నెగ్లిజెన్స్ గా డ్రైవ్ చేయరాదని, మాడిఫైడ్ సైలెన్సర్లు వాడరాదని, సెల్ ఫోన్లో మాట్లాడుతు డ్రైవింగ్ చేయొద్దని, ట్రాఫిక్ రూల్స్ తప్పని సరిగా అందరు పాటించాలని మోటార్ వెహికల్ యాక్ట్ కొత్త చట్టం ప్రకారం తప్పు చేసిన వాహన దారులకు భారీ జరిమానాలు విధించబడునని తెలియజేయడం జరిగినది అనంతరం సైబర్ నేరలలో భాగముగా ఆన్లైన్ మోసాలు,ఫేక్ లోన్స్ మోసాలు, ఆన్లైన్ జాబ్స్/వర్క్స్ డిజిటల్ అరెస్టు 112/100, 1930, 1972 కాల్స్ యొక్క ఉపయోగములు గురించి వివరించినారు. ఈ కార్యక్రమం నందు ట్రాఫిక్-1 ఇన్స్పెక్టర్ ఎన్. రమేష్, 3 టౌన్ లా అండ్ ఆర్డర్ ఇన్స్పెక్టర్ కే వి వి సత్యనారాయణ మరియు ట్రాఫిక్ సబ్ ఇన్స్పెక్టర్లు మరియు సిబ్బంది పాల్గొన్నారు

## శంఖవరం - వేళంగి ఆర్టీసీ బస్సును పునరుద్ధరించండి

**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్**
కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం మండల కేంద్రం శంఖవరం నుంచి వేళంగికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ బస్సును పునరుద్ధరించాలని జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం.శ్రీనివాసరావును జిల్లా భారతీయ జనతా పార్టీ పూర్వ అధ్యక్షుడు రామ్ కుమార్ చిలుకూరి గురువారం కోరారు. కాకినాడ ఆర్టీసీ కార్యాలయంలో శ్రీనివాసరావును కలిసిన రామ్ కుమార్, పార్టీ నేతల బృందం ఈ మేరకు వినతి పత్రాన్ని సమర్పించారు. ఆయనతో రామ్ కుమార్ మాట్లాడుతూ... గతంలో సుమారు 10 ఏళ్ళ క్రితం వరకూ తుని, కాకినాడ ఆర్టీసీ డిపోల నుంచి శంఖవరం నుంచి గౌరంపేట, శృంగధార, పెదమల్లాపురం మీదుగా వేంగి గ్రామానికి 19 కిలో మీటర్ల దూరం పొడవునా ఆర్టీసీ బస్సులు ప్రజా రవాణా సేవలను అందించేవని చెప్పారు. అయితే అనంతరం కాలంలో రోడ్డు బాగా ధ్వంసమైన నేపథ్యంలో బస్సు సర్వీసులను రద్దు చేశారు. ఈ రోడ్డును ఆర్నెల్ల క్రితం పునర్నిర్మించి నప్పటికీ కూడా ఇంకా బస్సును పునరుద్ధరించలేదని రామ్ కుమార్ గుర్తుచేశారు. గిరిజన కు గ్రామాల ప్రజల రవాణా ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని బస్సు సర్వీసులను యధావిధిగా పునరుద్ధరించాలని రాంకుమార్ బృందం కోరింది. బస్సులను పునరుద్ధరించడానికి ఉన్న అన్ని అవకాశాలనూ అధ్యయనం చేసి తగు చర్యలు తీసుకుంటామని కాకినాడ జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం.శ్రీనివాసరావు సానుకూలంగా ప్రతిస్పందించారు. ఈ కార్యక్రమంలో రంభాల వెంకటేశ్వరరావు, బొలిశెట్టి రామకృష్ణన్, పెండెం బాబ్జీ, సలాది నాయుడు తదితరులు రాంకుమార్ వెంట ఉన్నారు.





# ఆర్టీసీ బస్టాండులోనికి వెళ్లే దారి గుంతలమయం

బనగానపల్లె **విశ్వం వాయిస్ న్యూస్**
ఆర్టీసీ బస్టాండ్ లోనికి వెళ్లే దారి గుంతల మయంగా మారడంతో ప్రయాణికులు, ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షం వస్తే గుంతల్లో నీరు నిలిచి ప్రయాణికులు, ద్విచక్ర వాహనదారుల పరిస్థితి అగమ్య గోచరంగా మారుతుంది. ఆర్టీసీ బస్టాండు నుండి బస్సులు బయటకు వచ్చే దారి గుంతల మయంగా మారింది. మట్టి రోడ్డు కావడంతో వర్షం వస్తే గుంతల్లో నీరు నిలిచి ఆర్టీసీ బస్టాండు లోనికి వెళ్లే ద్విచక్ర వాహనదారులు జారిపడి గాయాల పాలవుతున్నారు. ద్విచక్ర వాహనంపై ఇద్దరు వెళితే అదుపుతప్పి కింద పడిపోతున్నారు. ఆర్టీసీ బస్టాండులోనికి వెళ్లే ప్రయాణికులు బురదమయంగా మారిన రహదారిలో వెళ్లలేక తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఆర్టీసీ అధికారులు పట్టించుకోకపోవడంతో గుంతలు వర్షం వస్తే చిన్నపాటి చెరువులను తలపిస్తున్నాయి . అధికారులు తగు చర్యలు తీసుకొని గుంతలను పొడిచి వర్షపు నీరు ఆగకుండా చూడాలని ప్రయాణికులు, ద్విచక్ర వాహనదారులు కోరుతున్నారు.

# వడదెబ్బకు కుప్పకూలిన విద్యార్థులు



**జగ్గంపేట** విశ్వం వాయిస్ న్యూస్
మండలంలోని కాండ్రేగుల జిల్లా పరిషత్ హైస్కూల్‌లోని ఆరుగురు విద్యార్థులు వడదెబ్బకు కుప్పకూలి పోవడంతో ఆసుపత్రికి తరలించారు. గురువారం ఉదయాన్నే వర్షం కురిసి విపరీతమైన ఎండ కాసింది. ఎప్పటిలాగే విద్యార్థులు స్కూల్‌కు వచ్చారు. వారిలో 7, 8, 10 తరగతుల విద్యార్థినులు మేరీ, పి.దివ్య, ఎ.గనిలక్ష్మి, జి.దుర్గాభవాని, సిహెచ్.దివ్య, ఎం.పావని పాఠశాల ఆవరణంలో అస్వస్థతకు గురై పడిపోయారు. వెంటనే స్కూల్ హెచ్‌ఎం నాగేశ్వరరావు విద్యార్థినుల తల్లిదండ్రులకు సమాచారం అందించారు. వారు వచ్చి ఆసుపత్రులకు తీసుకువెళ్లారు. ఇద్దరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో చికిత్స పొందగా, నలుగురు ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందారు. విద్యార్థులను తహశీల్దార్ జెవిఆర్.రమేష్, ఎఎంఇఒ స్వామి పరామర్శించారు. విద్యార్థినుల పరిస్థితి గురించి ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రణీత్‌ను అడగ్గా అందరూ బాగానే ఉన్నారని డీహైడ్రేషన్‌కు గురయ్యారని తెలిపారు. విద్యార్థినులను వైసిపి నియోజకవర్గ కో ఆర్డినేటర్ తోట నరసింహం, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి తుమ్మలపల్లి రమేష్ పరామర్శించారు.

# తహశీల్దార్లు బాధ్యతల స్వీకరణ

**–అనంతగిరి తహశీల్దార్ వీరభద్రాచారిని సత్కరిస్తున్న ఉద్యోగులు**



**జికే వీధి విశ్వం వాయిస్ న్యూస్**
మండల రెవెన్యూ తహసిల్దార్ గా హెచ్ అన్నాజీరావు గురువారం బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ పనిచేస్తున్న తహసిల్దార్ టి రామకృష్ణ బదిలీ అయ్యారు. అన్నాజీరావు అల్లూరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పనిచేస్తూ పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. ఈయన గతంలో కోటవురట్ల, నక్కపల్లి ప్రాంతాలలో డిప్యూటీ తహసిల్దారుగా విధులు నిర్వహించారు. అనంతగిరి:మండల తహసిల్దార్‌గా ఎం. వీరభద్రచారి గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనకాపల్లి జిల్లా కలెక్టరేట్లో డీటీగా పని చేస్తు ప్రమోషన్ పై మండలంలో తహసిల్దారుగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది మండలం ఉప తహసిల్దార్ గా పని చేస్తున్న సమ్మరెడ్డి. మాణిక్యం ఇన్చార్జి తహసిల్దారుగా బాధ్యతలు చేపట్టారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన తహసిల్దార్ వీరభద్రచారికు సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిశారు జి.మాడుగుల: స్థానిక తహశీల్దారు గిడ్డి రాజ్ కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఇదే జి.మాడుగుల తహసిల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసిల్దారిగా విధులు నిర్వహించారు. ప్రమోషన్ పై తహసిల్దారుగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇక్కడ గిరిజనులకు సేవలందించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. మండల కేంద్రంలో రెవెన్యూ శాఖపై మరింత దృష్టి పెట్టి ప్రజలకు ఎల్లవేళలా అధికారులందరూ అందుబాటులో ఉండేటట్టు చూస్తానన్నారు

# జిఎంసిలో కాంట్రాక్టు నియామకాలకు బ్రేక్

**కడప విశ్వం వాయిస్ న్యూస్**
జిల్లా ప్రభుత్వ మెడికల్ కళాశాలలో కాంట్రాక్టు ఫ్యాకల్టీ నియామ కాలకు బ్రేక్ పడింది. ఈనెల 17న జిఎంసి ఫ్యాకల్టీలోని ప్రొఫెసర్, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల నియామకాలను చేపట్టాల్సి ఉంది. జిఎంసి పాలనా యంత్రాంగం నోటిఫికేషన్ సైతం విడుదల చేసింది. 2014-19 పీరి యడ్‌లో జూనియర్ డాక్టర్లు సీనియర్లుగా మారిన పరిస్థితుల నేపథ్యం వివాదా స్పదంగా మారింది. ప్రభుత్వం ఏడాది పాటు కనీస బోధనా నుభవం కలిగిన అధ్యాపకులకు ప్రొఫెసర్, అసోసియేటెడ్, అసిస్టెంట్ ప్రొఫె సర్లను ప్రమోషన్ ఇవ్వాలని భావించింది. జిఎంసిలో కాంట్రాక్టు నియామకాలకు బ్రేక్‌పడిన కారణంగా సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి పరిధిలోని 11 ప్రొఫెసర్, ఎనిమిది అసోసియేట్, ఐదు అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులకు బ్రేక్ పడింది. ప్రభుత్వం కాంట్రాక్టు అధ్యాపక పోస్టులను నిలిపేసిన నేపథ్యంలో సూపర్‌లో వైద్యసేవలు ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం పొంచి ఉంది. ప్రభుత్వ నిబంధన మేరకు ఏడాదిపాటు బోధనానుభవం కలిగిన అధ్యాపకుల నియామకాలను



వేగ వంతం చేయాల్సిన అవసరం ఉంది. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని స్టాఫ్‌నర్సుల కొరత వేధిస్తోంది. ఇటీవల ప్రాంతీయ వైద్య విధాన పరిషత్ కార్యాలయం 140 స్టాఫ్‌నర్స్‌ల పోస్టుల భర్తీని చేపట్టింది. సుమారు 11 వేల దరఖాస్తులను స్వీకరించింది. నకిలీ మార్కుల సర్టిఫికెట్ల ఉన్నాయని తేలడంతో సంబంధిత ఎన్టీఆర్ యూనివర్శిటీ అధికారుల దృష్టికి తీసుకెళ్లింది. సంబంధిత అధికారులు సర్టిఫికెట్లను పరిశీలించడం ఎప్పటికి పూర్తి చేస్తుందో తెలియని నేపథ్యం సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని వెంటాడుతోంది. ఐదారేళ్లుగా వెంటా డుతున్న ఫేక్ సర్టిఫికెట్ల ఉదంతంపై ఓ ఉన్నతాధికారిని సంప్రదించగా ఫేక్ సర్టిఫికెట్లుగా తేలితే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని, కేసులు నమోదు చేయడం దగ్గర నుంచి, సర్టిఫికెట్ల ధ్రువీకరణ పూర్తయ్యే వరకు జీతాలు చెల్లించ బోమనే నిబంధనల మేరకు రిక్రూట్‌మెంట్ చేస్తే ఫేక్ సర్టిఫికెట్ల పరిస్థితే తలెత్త బోదని, క్వాలిటీ నర్సింగ్ సేవలకు అంతరాయం తలెత్తబోదని పేర్కొనడం గమనార్హం.

# విద్యార్థులకు మత్తు పదార్థాలపై అవగాహన సదస్సు నిర్వహించిన జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ

**.... త్వరలో అన్ని ప్రభుత్వ పాఠశాలలో కళాశాలలో ఈగల్ క్లబ్ లు ఏర్పాటు....**

కాకినాడ కలెక్టరేట్ :విశ్వం వాయిస్ న్యూస్
మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థుల్లో అవగాహన, చైతన్యం పెంపొందించేలా జిల్లాలోని అన్ని పాఠశాలల్లోనూ ఈగల్ క్లబ్ లను ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ లో పాఠశాలలకు, విద్యార్థులకు మత్తు పదార్థాలకు దూరంగా ఉంచడం, మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలు, ప్రతి పాఠశాలలోను ఈగల్ క్లబ్ ఏర్పాటు ఆవశ్యకత వంటి అంశాలపై జిల్లా కలెక్టర్ షణ్మోహన్.. జిల్లా ఎస్పీ జి.బిందు మాధవ్ తో కలిసి జిల్లాలోని అన్ని మండలాల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మాదక ద్రవ్యాలు, గంజాయి వంటివి వాడకం, అమ్మకం, రవాణాను అరికట్టేందుకు ఈగల్ (ఎలైట్ యాంటీ నార్కోటిక్స్ గ్రూప్ ఫర్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్) టీమ్ అనే కొత్త వ్యవస్థను ఏర్పాటు చేసిందన్నారు. ఈగల్ టీం మత్తు పదార్థాలు వాడేవారిపై ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో



పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉంచే చర్యలో భాగంగా ప్రతి పాఠశాల, కళాశాలలోని ఈగల్ క్లబ్ లను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈగల్ క్లబ్ లో ప్రతి పాఠశాల నుంచి 8 మంది విద్యార్థులు, ఇద్దరు ఉపాధ్యాయులు మొత్తం10 మందితో జిల్లాలో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు, జూనియర్ కళాశాల్లో ఈగల్ క్లబ్ లను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలు, ఎదురయ్యే దుష్పరిణామాల పట్ల విద్యార్థుల్లో అవగాహన, చైతన్యాన్ని పెంపొందించేందుకు ఈగల్ క్లబ్ లు పనిచేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. జిల్లాలో డ్రగ్స్, మత్తు పదార్థాలపై మిషన్ మోడ్ లో ప్రతి పాఠశాల, కళాశాలలోను విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ నెల 30 నాటికి అన్ని పాఠశాలల్లో ఈగల్ క్లబ్ లు ఏర్పాటు చేయడం పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులకు స్పష్టం చేశారు. జిల్లా ఎస్పీ బిందు మాధవ్ మాట్లాడుతూ మత్తు పదార్థాలు వాడకం, అమ్మకం, రవాణా వంటి కేసుల్లో దోషులుగా ఉన్న వారి పట్ల రాష్ట్ర ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందన్నారు. జిల్లాలో మాదక ద్రవ్యాలకు సంబంధించిన విషయాలు తమ దృష్టికి వచ్చిన వెంటనే టోల్ ఫ్రీ నెంబర్-1972 కి సమాచారం ఇవ్వాలన్నారు. పాఠశాలలోని విద్యార్థులకు చక్కని విద్యాబుద్ధులు నేర్పించడంతోపాటు మత్తు పదార్థాలకు ఆకర్షితులు కాకుండా ఉంచేలా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ఏర్పాటుచేసిన ఈగల్ క్లబ్ ల ఆవశ్యకతను ప్రతి ఒక్కరు గుర్తించి తప్పనిసరిగా అన్ని పాఠశాలల్లను ఈగల్ క్లబ్ లు ఏర్పాటు చేయాలని జిల్లా ఎస్పీ తెలిపారు.సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి పి.రమేష్, ఎస్ఎస్ఏ పీవో వేణుగోపాల రావు, ఈగల్ టీం అధికారి కె.ధర్మతేజ, డిప్యూటీ డీఈవోలు, అన్ని మండలాల ఎంఈవో ఇతర పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# 'ఖేలో ఇండియా' కింద కాకినాడలో క్రీడల అభివృద్ధికి సహకరించండి...

**.....కేంద్ర మంత్రి మాండవీయ ను కోరిన కాకినాడ ఎంపీ ఉదయ్ శ్రీనివాస్....**



**కాకినాడసిటీ: విశ్వం వాయిస్ న్యూస్**
కాకినాడ పార్లమెంటు పరిధిలో ప్రతిభ గల క్రీడాకారులను ప్రోత్సహించడంతో పాటు, అంతర్జాతీయ ప్రమాణాలకు దీటుగా క్రీడలను అభివృద్ధి చేసేందుకు ' ఖేలో ఇండియా ' కింద మౌళిక వసతులు కల్పించాలని కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగెళ్ళ ఉదయ్ శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు ఆయన బుధవారం ఢిల్లీ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తో పాటు కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్ తదితరులుతో కలసి కేంద్ర క్రీడల శాఖ మంత్రి మన్ సుఖ్ మాండవీయ ను ప్రత్యేకంగా కలిసి కాకినాడ పార్లమెంట్ పరిధిలో క్రీడ అభివృద్ధిపై చర్చించారు. జిల్లా కేంద్రం కాకినాడ లో గల జిల్లా క్రీడామైదానంలో మెరుగైన వసతులు కల్పనకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వచ్చే ఏడాది ఆంధ్రప్రదేశ్ లో మార్షల్ ఆర్ట్స్ గేమ్స్ నిర్వహించే అవకాశం కల్పించినందుకు కేంద్ర మంత్రి కి ఈ సందర్భంగా ఎంపీ ఉదయ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ క్రీడల నిర్వహణ ద్వారా రాష్ట్రంలో మార్షల్ ఆర్ట్స్ గేమ్స్ కు మరింత ప్రాముఖ్యత పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.


# ఘనంగా పౌరసరఫరాల శాఖ చైర్మన్ తోట సుధీర్ జన్మదిన వేడుకలు...



**కాకినాడసిటీ: విశ్వం వాయిస్ న్యూస్**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సివిల్ సప్లై కార్పొరేషన్ చైర్మన్ తోట సుధీర్ పుట్టినరోజు వేడుకలు కూటమి నాయకులు, అభిమానులు మధ్య ఆయన నివాసంలో ఘనంగా నిర్వహించారు. కాకినాడ నగర ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు (కొండబాబు), తెదేపా నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, జనసేన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి అట్ల సత్యనారాయణ, జనసేన పార్టీ కాకినాడ జిల్లా ప్రధాన కార్యదర్శి తలాటం సత్యా, జగ్గంపేట ఇంచార్జి తుమ్మల బాబు, నున్న దొరబాబు తదితరులు కేక్ కట్ చేయించి శాలువా కప్పి సివిల్ సప్లై కార్పొరేషన్ చైర్మన్ తోట సుదీర్కు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే జిల్లా పౌరసరఫరాల శాఖ జిల్లా అధికారి ఆర్ఎస్ఎస్ సత్యనారాయణ రాజు, డిఎమ్ దేవులనాయక్, ఏఎస్వో టి విజయలక్ష్మి డిటీ విజయ్ కార్యాలయం సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు ఆకుల వెంకట రమణ, నులుకుర్తి వెంకటేశ్వరరావు, చెన్నం శెట్టి గోవిందరాజుల దుర్గ భవాని, సత్యనారాయణ, ఆకుల శ్రీనివాస్, బడే కృష్ణ, నల్లపాటి షణ్ముఖ గణేష్, శివాజీ, మణికంఠ, బడే ఆనంద్, నీలపల్లి కామరాజు, మల్లాడి నాగరాజు, సోనీ ఫ్లోరెన్స్, జాహ్నవి, సత్యనారాయణమ్మ, సుజాత, సుంకర సురేష్ జనసేన వీర మహిళలు భారీ ఎత్తున పాల్గొన్నారు.

# బిజినెస్

## 5 వేల మందిని తొలగిస్తున్నాం.. లేఆఫ్స్ ప్రకటించిన ఇంటెల్




ప్రపంచవ్యాప్తంగా టెక్ ఉద్యోగాల కోత కొనసాగుతున్నది. ఆర్థిక అస్థిరతతో గ్లోబల్ మార్కెట్లలో ఒత్తిడి, లాభాల క్షీణత, ఏఐ వినియోగం పెరగడం.. వెరసి కంపెనీలు ఖర్చులు తగ్గించుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఇందులో భాగంగా పెద్ద ఎత్తున ఉద్యోగులను తొలగిస్తున్నాయి. తాజాగా చిప్ తయారీ సంస్థ ఇంటెల్ తన ఉద్యోగులకు షాక్ ఇచ్చింది. ఈ వారంలో 5 వేల మందికిపైగా ఉద్యోగులను తొలగిస్తున్నట్లు ప్రకటించింది.కాగా, ఇంటెల్ 4 వేల మంది ఉద్యోగులకు లేఆఫ్స్ ప్రకటించనున్నట్లు ఇటీవలే అంచనాలు వెలువడిన విషయం తెలిసిందే. అయితే, 4 వేల మంది కాదని, 5 వేల మందిని తొలగిస్తున్నట్లు సంస్థ తాజాగా ప్రకటించింది. ఈ వారంలోనే అమెరికా వ్యాప్తంగా తొలగింపులు ఉంటాయని స్పష్టం చేసింది. ఖర్చులు తగ్గించుకోవడంలో భాగంగా లే ఆఫ్‌లు అమలు చేస్తున్నట్లు వెల్లడించింది. ఒరెగాన్, కాలిఫోర్నియాలో ఎక్కువగా తొలగింపులు ఉంటాయని పేర్కొంది. ఇందులో కాలిఫోర్నియా ఆఫీస్ నుంచి 1,935 మంది, ఒరెగాన్ యూనిట్ నుంచి 2,392 మంది తమ ఉద్యోగాలను కోల్పోనున్నట్లు తెలిసింది. అరిజోనా కార్యాలయం నుంచి 696 మందిపై వేటు పడనున్నట్లు సమాచారం. ఈ ఏడాది మార్చిలో ఇంటెల్ కొత్త సీఈఓగా లిప్-బు టాన్ బాధ్యతలు స్వీకరించిన విషయం తెలిసిందే. ఆయన ఆధ్వర్యంలో భారీ పునర్వ్యవస్థీకరణ చేపడుతున్న ఇంటెల్, తన ఉద్యోగుల్లో 20 శాతానికి పైగా తొలగించాలని యోచిస్తోంది. ఇందులో భాగంగానే లేఆఫ్స్‌ను ప్రకటించింది.

## ఈ రోజు బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయంటే..

బంగారం ధర మళ్లీ లక్ష రూపాయలకు దగ్గరల్లో ట్రేడ్ అవుతోంది. గత వారంలో 98 వేలకు దగ్గర్లో ఉన్న పది గ్రాముల బంగారం ప్రస్తుతం తిరిగి లక్ష రూపాయలు చేరువ అయింది. ఈ నేపథ్యంలో (జులై 17న) ఉదయం 6.30 గంటల సమయానికి 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ. రూ. 99, 270కి చేరింది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. రూ. 90, 990కి చేరింది. నిన్నటితో పోల్చుకుంటే దాదాపు రూ.500 వరకు తగ్గింది.
ఢిల్లీలో 24 క్యారెట్ల పసిడి రేటు 10 గ్రాములకు రూ. 99, 420కి చేరుకోగా, 22 క్యారెట్ల గోల్డ్ ధర 10 గ్రాములకు రూ. 91, 140కి చేరుకుంది. ఇక హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 99, 270కి చేరుకోగా, 22 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేటు రూ. 90, 990కి చేరింది. వెండి ధరలు నిన్నటితో పోల్చుకుంటే వంద మేర తగ్గాయి. ఈ క్రమంలో దేశంలోని ప్రధాన నగరాల్లో ఉన్న బంగారం, వెండి రేట్లను ఇప్పుడు



తెలుసుకుందాం.


దేశంలోని ప్రధాన నగరాల్లో బంగారం రేట్లు (10 గ్రాములకు) (24 క్యారెట్, 22 క్యారెట్)
హైదరాబాద్‌లో రూ. 99, 270, రూ. 90, 990
విజయవాడలో రూ. 99, 270, రూ. 90, 990
ఢిల్లీలో రూ. 99, 420, రూ. 91, 140
ముంబైలో రూ. 99, 270, రూ. 90, 990
వడోదరలో రూ. 99, 320, రూ. 91, 040
కోల్‌కతాలో రూ. 99, 270, రూ. 90, 990
చెన్నైలో రూ. 99, 270, రూ. 90, 990
బెంగళూరులో రూ. 99, 270, రూ. 90, 990
కేరళలో రూ. 99, 270, రూ. 90, 990

పుణెలో రూ. 99, 270, రూ. 90, 990

**ప్రధాన నగరాల్లో వెండి ధరలు (కేజీకి)**
హైదరాబాద్‌లో రూ. 1, 23, 900
విజయవాడలో రూ. 1, 23, 900
ఢిల్లీలో రూ. 1, 13, 900
చెన్నైలో రూ. 1, 23, 900
కోల్‌కతాలో రూ. 1, 13, 900
కేరళలో రూ. 1, 23, 900
ముంబైలో రూ. 1, 13, 900
బెంగళూరులో రూ. 1, 13, 900
వడోదరలో రూ. 1, 13, 900
అహ్మదాబాద్‌లో రూ. 1, 13, 900

## స్వల్ప నష్టాల్లో స్టాక్‌మార్కెట్లు..

భారత్‌తో ఇండోనేసియా తరహా వాణిజ్యం ఒప్పందం చేసుకుంటామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొనడం మదుపర్లను కలవరపెడుతోంది. అలా అయితే దేశీయ తయారీ రంగానికి ఇబ్బందులు తప్పవని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అలాగే రష్యాతో వ్యాపారం చేస్తే వంద శాతం సుంకాలు విధిస్తామని భారత్, చైనాలకు నాటో దేశాలు హెచ్చరికలు చేయడం కూడా మర్కెట్లను కలవరపరుస్తోంది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం సెన్సెక్స్, నిఫ్టీ స్వల్ప నష్టాల్లో కదలాడుతున్నాయి బుధవారం ముగింపు (82, 634)తో పోల్చుకుంటే గురువారం ఉదయం వంద పాయింట్లకు పైగా లాభంతో మొదలైన సెన్సెక్స్ ఆ తర్వాత నష్టాల బాట పట్టింది. ఒక దశలో దాదాపు 100 పాయింట్లు కోల్పయి 82, 532 వద్ద కనిష్టానికి




చేరింది. ప్రస్తుతం ఉదయం 10:00 గంటల సమయంలో సెన్సెక్స్ 69 పాయింట్ల నష్టంతో 82, 565 వద్ద కొనసాగుతోంది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే సాగుతోంది. ప్రస్తుతానికి 22 పాయింట్ల నష్టంతో 25, 189 వద్ద కొనసాగుతోంది.సెన్సెక్స్‌లో బ్లూ స్టార్, ఏంజెల్ వన్, ప్రెస్టీజ్ ఎస్టేట్, సోనా బీఎల్‌డబ్ల్యూ, కేఈఐ ఇండస్ట్రీస్ షేర్లు లాభాల్లో ఉన్నాయి. ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, యూనియన్ బ్యాంక్, మ్యాక్స్ ఫైనాన్సియల్, ఎల్‌టీఐ మైండ్ ట్రీ, ఇండియన్ బ్యాంక్ షేర్లు నష్టాల బాటలో కొనసాగుతున్నాయి. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 5 పాయింట్ల స్వల్ప నష్టంతో ఉంది. బ్యాంక్ నిఫ్టీ 73 పాయింట్ల నష్టంతో కొనసాగుతోంది. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మారకం విలువ 85.83గా ఉంది.

# స్పోర్ట్స్

## కోచ్‌గా సెకండ్ ఇన్నింగ్స్.. దాదాతో పోటీపడుతున్న సాహా..!


భారత మాజీ క్రికెటర్ వృద్ధిమాన్ సాహా సెకండ్ ఇన్నింగ్స్ ప్రారంభించనున్నాడు. ఆరు నెలల క్రితమే అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన అతడు త్వరలోనే కోచ్‌గా అవతారం ఎత్తనున్నాడు. దేశవాళీలో, ఐపీఎల్‌లో సుదీర్ఘ అనుభవం కలిగిన సాహా బెంగాల్ అండర్ -23 జట్టుకు కోచ్‌గా సేవలందించనున్నాడు. ఓపెనర్‌గా, వికెట్ కీపర్‌గా చెరగని ముద్రవేసిన అతడితో ఒప్పందం చేసుకునేందుకు బెంగాల్ క్రికెట్ సంఘం (క్యాబ్) ఆసక్తి కనబరుస్తోంది. అయితే.. బీసీసీఐ, క్యాబ్ మాజీ అధ్యక్షుడు, సౌరభ్ గంగూలీ నుంచి అతడికి పోటీ ఎదురవుతోంది.'అండర్ -23 జట్టుకు కొత్త కోచ్ కోసం వెతుకున్నాం. ఈ నేపథ్యంలోనే వచ్చే వారం క్యాబ్ అధికారులు ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. ప్రస్తుతానికి కోచ్ పదవికి వృద్ధిమాన్ సాహా పేరు పరిశీలనలో ఉంది. అయితే.. సౌరభ్ గంగూలీ, పంకజ్ రాయ్‌లు కూడా రేసులో ఉన్నారు. ఈ ముగ్గురిలో కోచ్‌గా బాధ్యతలు చేపట్టేది ఎవరు? అనేది త్వరలోనే తెలియనుంది' అని క్యాబ్ సీనియర్ అధికారి తెలిపాడు. 40 టెస్టు మ్యాచ్‌లు, 9 వన్డేలు బ్యాటర్,






వికెట్ కీపర్ అయిన సాహా భారత జట్టు తరఫున 40 టెస్టు మ్యాచ్‌లు, 9 వన్డేలు ఆడాడు. 2021లో జట్టుకు దూరమైన సాహా ఆ తర్వాత ఐపీఎల్‌కే పరిమితం అయ్యాడు. గుజరాత్ టైటాన్స్ (Gujarat Titans) తరఫున విధ్వంసక ఇన్నింగ్స్‌లు ఆడిన అతడిని 18వ సీజన్‌కు ముందు గుజరాత్ వదిలించుకుంది. రంజీ ట్రోఫీలో బెంగాల్ లీగ్ దశలోనే నిష్క్రమించడంతో జనవరిలో ఫస్ట్ క్లాస్ క్రికెట్ నుంచి రిటైర్ అయ్యాడీ బెంగాల్ స్టార్.

## సాత్విక్ - చిరాగ్ జోడీకి షాక్.. రెండో రౌండ్‌లోనే లక్ష్య సేన్ ఓటమి



జపాన్ ఓపెన్ సూపర్ 750 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత స్టార్లకు వరుస పరాజయాలు ఎదురవుతున్నాయి. మహిళల సింగిల్స్‌లో పీవీ సింధు తొలి రౌండ్‌లోనే నిష్క్రమించగా.. లక్ష్య సేన్, సాత్విక్ -చిరాగ్ ఆమెను అనుసరిస్తూ ఇంటిదారి పట్టారు. గురువారం జరిగిన పురుషుల సింగిల్స్ రెండో రౌండ్‌లో ఎనిమిదో ర్యాంకర్ సేన్ తేలిపోయాడు. స్థానిక ఆటగాడు కొడాయ్ నరొకా చేతిలో 19-21, 11-21తో అనూహ్యంగా కంగుతిన్నాడు.బుల్స్‌లో ఫేవరెట్లుగా బరిలోకి దిగిన సాత్విక్ సాయిరాజ్ - చిరాగ్ శెట్టి ద్వయం తొలి రౌండ్‌లో అద్భుత విజయం సాధించింది. అయితే.. రెండో రౌండ్‌లో మాత్రం ఐదో సీడ్ జంట ధాటికి చేతులెత్తేసింది భారత జోడీ. గురువారం హోరాహోరీగా జరిగిన పోరులో లియాంగ్ వీ కెంగ్ వాంగ్ చాంగ్ (చైనా) జంటకు బదులివ్వలేకపోయింది చిరాగ్ ద్వయం.తొలి సెట్‌లో గట్టిగానే పోరాడినా..22-24తో వెనకబడింది. రెండో సెట్‌లో పుంజుకుంటారనుకుంటే బలహీనమైన డిఫెన్స్ కారణంగా 14-21తో దారుణ ఓటమి చవిచూసింది. ఈ పరాజయంతో చైనీస్ షట్లర్లు భారత స్టార్లపై తమ విజయాల ఆధిక్యాన్ని 7-2కు పెంచుకున్నారు.

## దూసుకొస్తున్నాడు మన బోల్ట్.. అథ్లెటిక్స్‌లో కొత్త చరిత్ర సృష్టిస్తాడా..!

క్రికెట్.. హాకీ.. బ్యాడ్మింటన్.. నీరజ్ చోప్రా రాకతో ఈమధ్య కాలంలో జావెలిన్ త్రోలో భారతదేశం పేరు విశ్వవేదికపై మార్మోగిపోతోంది. కానీ, అథ్లెటిక్స్‌లో మాత్రం ఆసియా క్రీడల వరకే మనోళ్ల విజయాలు పరిమితం అయ్యాయి. కరణం మల్లీశ్వరీ, పీటి ఉష.. అంజూ బీజార్జ్.. కుంజరాణి వంటి వారు దేశ ప్రతిష్టను పెంచినా.. ఆ తర్వాతి తరం వీళ్ల వారసత్వాన్ని అందిపుచ్చుకోలేకపోయింది. అవినాష్ సబ్లే, పరుల్ చౌదరీ, జ్యోతి ఎర్రాజీలు ఫర్వాలేదనిపిస్తున్నా ట్రాక్ అండ్ ఫీల్డ్ మీద చిరుతాల పరుగెత్తి పతకాలు కొల్లగెట్టే అథ్లెట్లు



కరువయ్యారు. అయితే.. అనిమేశ్ కుజూర్ రూపంలో భారత్‌కు 'ఉసేన్ బోల్ట్' లాంటి పరుగుల వీరుడు దొరికాడు. బుల్లెట్ వేగంతో దౌడు తీస్తూ జాతీయ స్థాయిలో రికార్డులు బద్ధలు కొడుతున్న ఈ యువకెరటం.. టోక్యోలో జరుగబోయే వరల్డ్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్ మీద గురి పెట్టాడు. ఈ పోటీలకు అర్హత సాధించాడంటే అనిమేశ్ చరిత్ర సృష్టించడం ఖాయం. ట్రాక్ మీద రాకెట్ వేగంతో దూసుకెళ్లే అనిమేశ్ కుజూర్‌ది ఛత్తీస్‌గఢ్‌లోని మారుమూల గ్రామం. ఆరడుగుల రెండు అంగుళాల పొడవుండే ఇతడు టీనేజ్ నుంచే తన స్పీడ్‌తో అందర్నీ ఆశ్చర్యపరుస్తున్నాడు. ఈమధ్యే 100 మీటర్ల దూరాన్ని 10.18 సెకన్లలో చేరుకొని చరిత్ర సృష్టించాడు. తద్వారా గురిందెర్వీర్ (10.20 సెకన్లు) పేరిట ఉన్న జాతీయ రికార్డును బద్ధలు కొట్టి ది 'ఫాస్టెస్ట్ మ్యాన్ ఆఫ్ ఇండియా'గా అవతరించాడు అనిమేశ్.




# అనుపమ పరమేశ్వరన్ 'పరదా' నుంచి థీమ్ సాంగ్ విడుదల

మలయాళీ బ్యూటీ అనుపమ పరమేశ్వరన్ లీడ్ రోల్‌లో నటిస్తున్న తాజా చిత్రం 'పరదా' . ఈ సినిమాకు సినిమా బండి , శుభం సినిమాల ఫేమ్ ప్రవీణ్ కాంద్రేగుల దర్శకత్వం వహిస్తున్నాడు. శ్రీధర్ మక్కువ, విజయ్ డొంకాడ నిర్మిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ఆగష్టు 22న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా మూవీ నుంచి 'యత్ర నార్యస్తు పూజ్యంతే..' థీమ్ ఆఫ్ పరదా సాంగ్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ పాటకు వనమాలి సాహిత్యం అందించగా.. అనురాగ్ కులకర్ణి పాడాడు. గోపి సుందర్ సంగీతం అందించాడు.సంప్రదాయపు కట్టుబాట్లు మహిళలను ఎలా అణచివేస్తున్నాయి. ఎలా ఎదగకుండా అణగదొక్కుతున్నాయి.. వాటిని దాటి మహిళలు ఎలా ఎదుగుతున్నారు అనే సోషియో డ్రామా కథాంశంతో ఈ సినిమా రాబోతుంది. మలయాళ నటి దర్శన.. సంగీత ఇందులో కీలక పాత్రలో నటిస్తున్నారు.




# కవిన్ సరసన ప్రియాంక...

మూడు పదుల వెన్నెల సోన ప్రియాంక అరుల్ మోహన్ కు ఇంకా గ్రాండ్ విక్టరీ దొరకలేదు. అయితే... తమిళంలో ఆమె నటించిన 'డాక్టర్, డాన్ ' చిత్రాలు కొంతలో కొంత ఊరటను కలిగించాయి. ప్రస్తుతం పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ సరసన 'ఓజీ' లో నటిస్తోంది ప్రియాంక అరుల్ మోహన్. పాన్ ఇండియా స్థాయిలో విడుదల కాబోతున్న 'ఓజీ' పై అమ్మడు భారీ ఆశలే పెట్టుకుంది.తెలుగులోనూ ఇప్పటికే నటిగా తన సత్తా చాటడానికి శతవిధాలా ప్రయత్నించింది. నానిస్ 'గ్యాంగ్ లీడర్'తో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చిన ప్రియాంక... ఆ తర్వాత శర్వానంద్ సరసన 'శ్రీకారం'లో నటించింది. ఈ రెండు సినిమాలు ఆశించిన స్థాయిలో ఆడలేదు. అయితే 'గ్యాంగ్ లీడర్'లో ఆమె చేసిన పాత్ర మంచి గుర్తింపును తెచ్చిపెట్టింది. అందుకే మరోసారి నాని సరసన 'సరిపోదా శనివారం' లో ఛాన్స్ దక్కించుకుంది. ఈ సినిమా కూడా బాక్సాఫీస్ బరిలో మిస్ ఫైర్ అయింది.ఇదిలా ఉంటే... ప్రియాంక అరుల్ మోహన్ కు ఇప్పుడో కొత్త ప్రాజెక్ట్ లభించింది. హీరో కవిన్ తొమ్మిదో చిత్రంలో ఆమె హీరోయిన్ గా నటించబోతోంది. ఈ సినిమాకు సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడింది. కెన్ రాయ్ సన్ దర్శకత్వం వహించే ఈ సినిమా త్వరలోనే పట్టాలెక్కబోతోంది. థింక్ స్టూడియోస్ సంస్థ ఈ రొమాంటిక్ కామెడీ మూవీని ప్రొడ్యూస్ చేబోతోంది. 'కొత్త ప్రయాణం... కొత్త సినిమా' అంటూ వీరు సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టారు. కవిన్ సరసన ప్రియాంక తొలిసారి నటిస్తోంది. మరి సెప్టెంబర్ 25న రాబోతున్న 'ఓజీ'తో ప్రియాంక స్టార్ హీరోయిన్ కేటగిరిలోకి చేరిపోతుందేమో చూడాలి.



# రంగుల్లో వెన్నెలలా.. కలర్‌ఫుల్ డ్రెస్‌లో అదిరిపోయిన కీర్తి!

బ్యూటీ కీర్తి సురేష్ గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. రామ్ పోతినేని నేను శైలజా సినిమాతో ఈ ముద్దుగుమ్మ టాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చింది. ఈ సినిమాతో మంచి ఫేమ్ సంపాదించుకొని, అనతికాలంలోనే ఈ ముద్దుగుమ్మ స్టార్ నటిగా తన సత్తా చాటుకుంది. వరసగా స్టార్ హీరోల సరసన నటించి మంచి క్రేజ్ సొంతం చేసుకుంది.ఈ బ్యూటీ తెలుగులో అగ్రహీరోలందరి సినిమాల్లో నటించి మంచి ఫేమ్ సంపాదించుకున్న విషయ తెలిసిందే. ఇక ప్రస్తుతం ఈ అమ్మడుకు తెలుగులో అవకాశాలు తగ్గడంతో ఈ ముద్దుగుమ్మ బాలీవుడ్ చెక్కేసి, అక్కడ వరసగా సినిమాలు చేస్తూ ఫుల్ బిజీ అయిపోయింది. బేబీజాన్ సినిమాతో బాలీవుడ్ ప్రేక్షకులను పలకరించిన ఈ బ్యూటీ, బాలీవుడ్ లోనే మరో ప్రాజెక్ట్ కూడా సైన్ చేసినట్లు తెలుస్తుంది.ఇక ఇదిలా ఉంటే ఈ బ్యూటీ తన చిన్ననాటి స్నేహితుడు ఆంటోని థట్టిల్ ను డిసెంబర్ 12,2024లో బంధుమిత్రుల సమక్షంలో పెళ్లి చేసుకున్న విషయం తెలిసిందే. ఇక పెళ్లి తర్వాత ఈ బ్యూటీ గ్లామర్ మరింత పెంచిందనే చెప్పాలి. ఎందుకంటే ఈ మధ్య ఈ అమ్మడు తన అంద చందాలతో సోషల్ మీడియాలో తెగ హల్ చల్ చేస్తుంది.తాజాగా ఈ బ్యూటీ మల్టీ కలర్ ఫ్రాక్‌లో తన అభిమానుల ముందుకు వచ్చింది. ఈ ఫొటోల్లో ఈ ముద్దుగుమ్మ అందానికి ఎవ్వరైనా సరే ఫిదా అయిపోవాల్సిందే. అంతలా తన అంద చందాలతో మాయ చేస్తుంది ఈ బ్యూటీ. ప్రస్తుతం దీనికి సంబంధించిన ఫొటోలు ఈ అమ్మడు తన సోషల్ మీడియాలో షేర్ చేయడంతో ఇవి నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి.అయితే ఈ బ్యూటీ ధరించిన ఫ్రాక్ వివిధ రంగులతో ఉండటంతో, ఈ ఫొటోస్ చూసిన ఈ బ్యూటీ అభిమానులు ఏంటీ కీర్తి.. ఈ అతుకుల డ్రెస్ ఎక్కడ కుట్టించావు అంటూ కామెంట్స్ చేస్తున్నారు. ఇంకొందరేమో, పాత సినిమా ట్రెండ్ గుర్తు చేశావంటూ కీర్తిని పొగిడేస్తున్నారు.



# అందరూ సర్‌ప్రైజ్ అవుతారు!

'యానిమల్' సినిమాతో దేశవ్యాప్తంగా యువతలో మంచి క్రేజ్ సంపాదించుకుంది త్రిప్తి దిమ్రి. . ప్రభాస్-సందీప్‌రెడ్డి వంగా 'స్పిరిట్' చిత్రం నుంచి దీపికా పదుకోన్ తప్పుకోవడంతో ఆమె స్థానంలో త్రిప్తి దిమ్రిని నాయికగా ఎంపిక చేశారు. తాజా ఇంటర్వ్యూలో ఈ భామ తాను నటిస్తున్న సినిమాల విశేషాలను వెల్లడించింది."స్పిరిట్' సినిమా కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నా. బలమైన భావోద్వేగాలు కలబోసిన కథ ఇది. ఈ సినిమాలోని ఎలిమెంట్స్ అందరిని సర్‌ప్రైజ్ చేస్తాయి. నా కెరీర్‌లో మరో ఉత్తమ చిత్రంగా మిగిలిపోతుందనే నమ్మకం ఉంది. విశాల్ భరద్వాజ్ దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్నా. అదొక అద్భుతమైన కథ. కెరీర్ ఆరంభంలోనే ప్రతిభావంతులైన దర్శకులతో పనిచేయడం గొప్ప అదృష్టంగా భావిస్తున్నా' అని చెప్పింది.



# నువ్వుంటే చాలే' అంటున్న రామ్ పోతినేని!




ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని, దర్శకుడు మహేష్ బాబు పీ కాంబినేషన్‌లో వస్తున్న 'ఆంధ్ర కింగ్' చిత్రంపై భారీగా అంచనాలు నెలకొన్న విషయం తెలిసిందే. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా టైటిల్ గ్లింప్స్‌కు అద్భుతమైన స్పందన లభించింది. దీంతో తాజాగా చిత్ర బృందం సినిమాలోని మొదటి సింగిల్ 'నువ్వుంటే చాలే' ప్రోమోను విడుదల చేసింది. ఈ పాట యొక్క పూర్తి వెర్షన్‌ను జులై 18న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. రామ్ లిరిక్స్ అందించిన ఈ పాటకు వివేక్ మార్విన్ సంగీతం అందిస్తుండగా.. అనిరుధ్ రవిచందర్ పాడాడు.రామ్ ఒక సూపర్ స్టార్‌కి డై-హార్డ్ అభిమానిగా కనిపించబోతున్న ఈ చిత్రంలో కన్నడ స్టార్ హీరో ఉపేంద్ర ముఖ్య పాత్రలో నటిస్తుండగా, భాగ్యశ్రీ బోర్స్ కథానాయికగా నటిస్తుంది. రావు రమేష్, మురళి శర్మ, సత్య, రాహుల్ రామకృష్ణ, విటివి గణేష్ ఇతర ప్రముఖ నటీనటులు కీలక పాత్రలలో కనిపించనున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తుంది.

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603, viswamvoice@gmail.com